అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 28-5-2023

సంపుటి : 9 | సంచిక : 147 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00



కలిసి పనిచేయాలి

రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

రాష్ట్రాలు ఆర్థికంగా వివేకవంతమైన నిర్ణయాలు తీసుకోవాలి

- కేంద్రం, రాష్ట్రాల మధ్య సమాన భాగస్వామ్యానికి నీతి ఆయోగ్ ఒక వేదిక
- కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిసి పని చేయాలి
- నీటి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : రాష్ట్రాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. శనివారం నాడిక్కడ ప్రగతి మైదానంలోని కన్వెన్షన్ సెంటర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన నిటి ఆయోగ్ పాలక మండలి ఎనిమిదో సమావేశం జరిగింది. 'వికసిత్ భారత్ ఏ 2047' అనే థీమ్ తో నిర్వహించిన ఈ సమావేశంలో 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా.. ఆరోగ్యం, నైపుణ్యాల అభివృద్ధి మహిళా సాధికారత, మౌలిక సదుపాయల వృద్ధి వంటి ఎనిమిది అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు భూపేష్ భఘేలా, సుఖ్వేంధర్ సుక్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, బీజేపీ ...5లో

పది రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైర్హాజరు

నీతి ఆయోగ్ సమావేశానికి పది రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైర్హాజరు అయ్యారు. ముఖ్యమంత్రులు కె చంద్రశేఖర్ రావు (తెలంగాణ), నితీష్ కుమార్ (బీహార్), అరవింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ), సిద్ధ ...5లో

హద్దులు దాటుతున్న కేంద్రం ఆగడాలు

ఎమర్జెన్సీని గుర్తుకుతెస్తోంది.. ఆనాటి స్థితికి.. ఇప్పటి పరిస్థితులకు పెద్దగా తేడా లేదు

రాష్ట్ర ప్రభుత్వాలను పని చేయనివ్వకపోవటం అరాచకం • సుప్రీం తీర్పును సైతం కాలరాయటం దుర్మార్గం

- దాన్ని ఓడించేందుకు మా శక్తినంతా ఉపయోగిస్తాం
- ఢిల్లీ, పంజాబ్ సీఎంలతో కలిసి మీడియా సమావేశంలో కేసీఆర్
- ప్రగతి భవన్‌లో సీఎంతో భేటీ అయిన కేజ్రీవాల్, భగవత్‌మాన్ సింగ్

కేంద్రంలోని బీజేపీ పాలన ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోందని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆనాటి స్థితికి..దేశంలో ఇప్పుడున్న పరిస్థితికి పెద్ద తేడా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ నాటి పరిస్థితుల గురించి పదే పదే గొంతు చించుకునే ప్రధాని మోడీ, బీజేపీ నేతలు... తాము కూడా అవే విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో అధికారుల బదిలీ, పోస్టింగులకు సంబంధించి అక్కడి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అధికారాల్లేకుండా చేస్తూ కేంద్రం ఆర్డినెన్సును తీసుకొచ్చిన సంగతి విదితమే. దీనికి వ్యతిరేకంగా విపక్షాలు పార్లమెంటులో గళమెత్తాలని కోరుతూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పలు రాష్ట్రాల సీఎంలను కలుస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన పంజాబ్ సీఎం భగవత్‌సింగ్ మాన్ తో కలిసిశనివారం హైదరాబాద్‌కు విచ్చేశారు. ప్రగతి భవన్‌లో సీఎం కేసీర్‌తో వారు భేటీ అయ్యారు. అనంతరం సీఎంలు ముగ్గురూ సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేసీఆర్ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ అరాచకాలు, ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతు న్నాయని విమర్శించారు. అవి ఇప్పుడు పరాకాష్టకు చేరాయని అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను ముప్పుతిప్పలు పెడుతున్న మోడీ సర్కార్... వాటిని పని చేయనివ్వటం లేదని వాపోయారు. ఆర్థికపరమైన పరిధులు విధించటం, రకరకాల దాడులకు పాల్పడటం లాంటి చర్యలతో పలు దుర్మార్గాలకు అది ఒడిగడుతున్నదని తెలిపారు. వీటిని యావత్ దేశం గమనిస్తోందని చెప్పారు. ఢిల్లీలోని ఆమాద్మీ పార్టీ ఒక పాపులర్ పార్టీ.. యావత్ ప్రపంచానికి దాని గురించి తెలుసునని అన్నారు. ఒక సోషల్ మూవ్‌మెంట్ నుంచి వచ్చిన ఆప్... అక్కడ మూడు సార్లు విజయం సాధించిందని సీఎం గుర్తు చేశారు. ఇటీవల నిర్వహించిన ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో సైతం చాలా స్పష్టమైన మెజారిటీని అది సాధించిందని తెలిపారు. బీజేపీ ఎన్ని రకాల ప్రయత్నాలు, ప్రలోభాలు, మాయా మశ్చీంద్రలు చేసినా అక్కడి ప్రజలు ఆ పార్టీని తిరస్కరించి.. ఆప్‌ను గెలిపించారని తెలిపారు. అయినా బీజేపీ అడ్డం తిరిగి మేయర్‌ను ప్రమాణ స్వీకారం చేయనీయలేదన్నారు. చివరకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప ప్రమాణ స్వీకారం జరగలేదని అన్నారు. మరోవైపు ప్రజాస్వామ్యబద్ధంగా ...5లో

> కేంద్రం తెచ్చిన ఆర్డినెన్సును తక్షణం వెనక్కు తీసుకోవాలి

ఇది యావత్ దేశ సమస్య : కేజ్రీవాల్

ఇప్పుడు తాము ఎదుర్కొంటున్న సమస్య... కేవలం ఢిల్లీకే పరిమితం కాదు, అది యావత్ దేశ సమస్యని ఆ రాష్ట్ర సీఎం కేజ్రీవాల్ చెప్పారు. 2015 ఫిబ్రవరిలో తాము మొదటిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు కేవలం మూడే మూడు నెలల్లో మోడీ సర్కార్ ఓ నోటిఫకేషన్ ద్వారా తమ అధికారాలను లాక్కుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కంటే ముందున్న షీలా దీక్షిత్ ప్రభుత్వంలో అధికారులంతా ఆనాటి సర్కార్ హయాంలోనే ఉన్నారని తెలిపారు. ఇప్పుడు ఢిల్లీ సీఎంగా తనకు కనీసం విద్య, వైద్య శాఖల కార్యదర్శులు, ఉప కార్యదర్శులను కూడా బదిలీ చేసే అధికారం లేకుండా పోయిందని వాపోయారు. ఈ క్రమంలో ఎనిమిదేండ్లుగా పోరాటం చేసిన తాము సుప్రీంకోర్టుకెళ్లి మరీ అధికారాలను రాబట్టుకున్నామని వివరించారు. కానీ మోడీ సర్కార్ కేవలం ఎనిమిది రోజుల్లోనే తమ అధికారాలను కాలరాస్తూ ఆర్డినెన్సును తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశ ప్రధాని సుప్రీంకోర్టును, దాని తీర్పులను ...5లో

బదిలీలు, పదోన్నతులపై సీఎం జోక్యం చేసుకోవాలి

హైకోర్టు స్టే ఎత్తేసేందుకు చర్యలు చేపట్టాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- నిరసన దీక్షలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్
- పలు ఉపాధ్యాయ సంఘాల సంఘీభావం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి ...2లో



కొనుగోలు కేంద్రంలో దారుణం

నిద్రిస్తున్న రైతుపై నుంచి వెళ్లిన ట్రాక్టర్



- అక్కడికక్కడే మృతి

నవతెలంగాణ - తిమ్మాపూర్

ధాన్యం కొనుగోలు కేంద్రంలో దారుణ ఘటన జరిగింది. వరి కుప్పలకు కాపలాగా పడుకున్న రైతు పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం వచ్చునూరు గ్రామంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

వచ్చునూర్ గ్రామానికి చెందిన ఉప్పులేటి మెండయ్య(60) తాను పండించిన ధాన్యాన్ని రెండ్రోజుల కిందట ఐకేపీ సెంటర్‌కు తీసుకొచ్చాడు. శనివారం వేకువ జామున 2 గంటలకు వడ్లను తూకం వేశారు. ఉదయం లోడింగ్ చేస్తామనడంతో మొండయ్య ఐకేపీ కేంద్రంలో బస్తాల పక్కనే నిద్రపోయాడు. తెల్లవారుజామున 3.30గంటల సమయంలో లోడుతో ఉన్న ట్రాక్టర్ ...5లో



నేడు కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభం

- ఉదయం ఏడుగంటలకు కార్యక్రమం

న్యూఢిల్లీ : నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం నేడు జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభించనున్నారు. పార్లమెంటులోని మహాత్మాగాంధీ విగ్రహం సమీపంలో ఏర్పాటుచేసే మందిరంలో సంప్రదాయ పూజలు, హోమంతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇందులో ప్రధాని మోడీ, లోక్‌సభ ...5లో




రోళ్లు పగిలేలా...

- మండుతున్న ఎండలు
- హుజూర్‌నగర్ @ 46.1 డిగ్రీలు
- ఈ ఏడాది ఇదే అత్యధికం
- రెడ్ అలర్ట్ జోన్‌లో పలు జిల్లాలు

వివరాలు 5లో..

'సారే జహా సే అచ్ఛా' రచయిత ఇక్బాల్ పాఠం

సిలబస్ నుంచి తొలగింపు



- ప్రత్యేక అధ్యయనంగా హిందూత్వ
- ఢిల్లీ యూనివర్సిటీ నిర్ణయం

న్యూఢిల్లీ : 'సారే జహా సే అచ్ఛా' గీత రచయిత మహమ్మద్ అల్లమ ఇక్బాల్‌పై పాఠాన్ని సిలబస్ నుంచి తొలగించాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. బీఏ ఆరో సెమిస్టర్‌లో 'మోడరన్ ఇండియన్ పొలిటికల్ థాట్' అధ్యాయాన్ని తొలగించాలని విశ్వ విద్యాలయం అకడమిక్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఢిల్లీ ...5లో

జూన్ 26 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్

28 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

- జులై 8 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు • 12న తొలివిడత సీట్ల కేటాయింపు
- మూడు విడతల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ • షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం వచ్చేనెల 26 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. శనివారం హైదరాబాద్‌లో ఎంసెట్ ప్రవేశాల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఇతర సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చేనెల 26 నుంచి ఆగస్టు తొమ్మిదో తేదీ వరకు మూడు విడతల్లో ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టనున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ వంటి ప్రక్రియను వచ్చేనెల 26 నుంచి అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. వచ్చేనెల 28 నుంచి జులై ఆరో తేదీ వరకు ధ్రువపత్రాల పత్రాల పరిశీలన నిర్వహిస్తామని వివరించారు. అదేనెల 28 నుంచి జులై ఎనిమిదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు ...5లో



కేరళ రబ్బరు రైతుల రాజ్‌భవన్ మార్చ్

రైతు వ్యతిరేక రబ్బరు బిల్లును ఉపసంహరించాలి : వక్తల డిమాండ్

తిరువనంతపురం : కేరళలోని తిరువనంతపురంలో రబ్బరు రైతులు కదం తొక్కారు. పది వేల మందికిపైగా రైతులు ఏఐకేఎస్ అనుబంధ కేరళ కర్షక సంఘం ఆధ్వర్యాన కేరళ యూనివర్సిటీ సమీపంలోని అసన్ స్క్వేర్ నుంచి రాజ్‌భవన్ వరకూ మార్చ్ నిర్వహించారు. రాజ్‌భవన్ బయట ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఏఐకేఎస్ అధ్యక్షులు డాక్టర్ అశోక్ ధావలే, ఉపాధ్యక్షులు ఇవి జయరాజన్, ప్రధాన ...5లో





బిజినెస్

కేంద్రానికి పిఎస్‌బిల రికార్డ్ డివిడెండ్

- 2022-23కు గాను రూ.13,800 కోట్లు



న్యూఢిల్లీ: కేంద్రానికి ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)లు అదిరిపోయే డివిడెండ్‌ను అందించాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకల ఉన్నా పిఎస్‌బిలు 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.13,800 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించాయి. 12 ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు ఇంతక్రితం 2021-22లో రూ.9,210 కోట్ల డివిడెండ్‌ను అందించాయి. దీంతో పోల్చితే 2023 మార్చితో ముగిసిన ఏడాదిలో 50 శాతం పెంచి ఇచ్చాయి. ఇంతక్రితం ఎప్పుడూ లేని విధంగా రికార్డ్ స్థాయిలో డివిడెండ్‌ను ఇవ్వడం విశేషం. అదే విధంగా 12 పిఎస్‌బిలు 2022-23కు గాను ఈక్విటీ డివిడెండ్ కింద 53 శాతం పెంచి రూ.21,000 కోట్లు కేటాయించాయి. ఇది 2021-22లో రూ.13,710 కోట్లుగా ఉంది.

గడిచిన ఆర్థిక సంవ త్సరంలో కేంద్రానికి అత్యధికంగా ఎస్‌బిఐ రూ.5,740 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది. కేంద్రానికి అందిన మొత్తం డివిడెండ్‌లో ఎస్‌బిఐ వాటానే 42 శాతంగా ఉంది. 2022-23కు గాను ఆర్‌బిఐ కూడా కేంద్రానికి రూ.87,416 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. గత శుక్రవారం ముంబయిలో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ 602వ బోర్డు సమావేశంలో తన మిగులు నిధుల్లోంచి రూ.87,416 కోట్లను కేంద్రానికి ఇవ్వడానికి ఆమోదం తెలిపారు. ఇంతక్రితం 2021-22లో రూ.30,307 కోట్లతో పోల్చితే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ సంస్థల నుంచి బిజెపి సర్కార్ భారీ డివిడెండ్‌ను ఆశిస్తోందని తెలుస్తోంది.

ప్రగతిలో బిఒఎం టాప్..



హైదరాబాద్ : పిఎస్‌బిల్లో అత్యంత మెరుగైన ప్రగతి కనబర్చిన వాటిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఒఎం) టాప్‌లో నిలిచింది. ఆర్థిక సంవత్సరం 2022-23లో ఆ బ్యాంక్ లాభాలు 126 శాతం పెరిగి రూ.2,602 కోట్లుగా నమోదయ్యాయి. 12 పిఎస్‌బిల సంయుక్త లాభాలు 57 శాతం పెరిగి రూ.1,04,649 కోట్లుగా చోటు చేసుకున్నాయి. 2022-23లో పిఎస్‌బిల ఆర్థిక ఫలితాల గణంకాల ప్రకారం.. రుణాల జారీలోనూ బిఒఎం 29.4 శాతం వృద్ధితో రూ.1,75,120 కోట్లకు చేరాయి.

ఆ తర్వాత స్థానాల్లో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యుకో బ్యాంక్‌లు 21.2 శాతం, 20.6 శాతం చొప్పున పెరుగుదలను నమోదు చేశాయి. దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ ఎస్‌బిఐ రుణాల వితరణలో 16 రెట్లు పెరిగి రూ.27,76,802 కోట్ల విలువను కలిగి ఉంది. డిపాజిట్ల పరంగా బిఒఎం 15.7 శాతం వృద్ధితో రూ.2,34,083 కోట్లకు చేరింది. బ్యాంక్ ఆఫ్ బరోడా డిపాజిట్లలో 13 శాతం పెరిగి రూ.10,47,375 కోట్లుగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 11.26 శాతం వృద్ధితో రూ.12,51,708 కోట్ల డిపాజిట్లను కలిగి ఉన్నాయి. బిఒఎం మొత్తం వ్యాపారం 21.2 శాతం పెరిగి రూ.4,09,202 కోట్లకు చేరింది. బిఒబి 14.3 శాతం పెరిగి రూ.18,42,935 కోట్లుగా నమోదయ్యింది.

ఐసిఐసిఐ ప్రుడెన్సియల్ లైఫ్ నుంచి కొత్త ఫండ్


న్యూఢిల్లీ : దీర్ఘకాలిక సంపదను పొందడానికి కొత్త డెట్ ఫండ్‌ను విడుదల చేసినట్లు ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. ఐసిఐసి ప్రూ కాన్‌స్టంట్ మెచ్యూరిటీ ఫండ్ పేరుతో దీన్ని ఆవిష్కరించినట్లు పేర్కొంది. డెట్ ఫండ్‌లు ఖాతాదారులకు పన్ను ప్రయోజనాలను అందిస్తాయని వెల్లడించింది. తమ కొత్త ప్లాన్ వార్షిక ప్రీమియం కంటే 10 రెట్లు లైఫ్ కవర్‌తో, మెచ్యూరిటీ రాబడితో పన్ను రహితంగా ఉంటుందని ఆ సంస్థ తెలిపింది.

2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశం..!

- మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ : వచ్చే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరనుందని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ అన్నారు. బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం నిర్వహించిన ఓ సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. రాబోయే రెండేళ్లలో ప్రపంచంలోనే భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనుందన్నారు. ఆరేళ్లలో మూడో స్థానానికి ఎగబాకొచ్చన్నారు. 2014 నుంచి ప్రధాని మోడీ ప్రభుత్వం చేపడుతున్న విధానాలే ఇందుకు కారణమన్నారు. పదో స్థానంలో ఉన్న భారత్ ప్రస్తుతం ఐదో స్థానానికి చేరిందన్నారు.

600పైగా ఇన్‌స్టిట్యూషన్లతో ఎక్సెల్‌ఆర్ ఒప్పందం



హైదరాబాద్: దేశంలోని 600 పైగా కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నామని ఎక్సెల్‌ఆర్ వ్యవస్థాపకుడు రామ్ తవ్వా తెలిపారు. ఎడ్‌టెక్ పరిశ్రమలోని తమ సంస్థ విద్యా రంగం, పరిశ్రమల మధ్య ఉన్న నైపుణ్య అంతరాన్ని పూరించటం ద్వారా విప్లవాత్మక మార్పుల కోసం కృషి చేస్తుందని రామ్ తవ్వా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులను సరికొత్త సాంకేతికతలతో సన్నద్ధం చేయాలనే దృఢ సంకల్పంతో ఎక్సెల్‌ఆర్ డాటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి), మెషిన్ లెర్నింగ్ వంటి అత్యాధునిక కోర్సులను ఇంజినీరింగ్ విద్యార్థుల పాఠ్యాంశాల్లోకి ప్రవేశపెట్టిందన్నారు. ఆయా పాఠ్యాంశాలను విద్యార్థులకు అందించడానికి పలు ఇన్‌స్టిట్యూషన్లతో భాగస్వామ్యం అయ్యామన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సంస్థల ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు ఎక్సెల్‌ఆర్ శిక్షణ అందిస్తుందన్నారు.

ఎనిగ్మా నుంచి జిటి 450 ఇ-స్కూటర్

భోపాల్ : విద్యుత్ వాహనాల తయారీదారు ఎనిగ్మా ఆటోమొబైల్స్ కొత్తగా జిటి450, క్రింక్ హైస్పీడ్ వేరియంట్ ఇ-స్కూటర్‌లను ఆవిష్కరించింది. జిటి450 ఎక్స్‌షోరూం ధరను రూ.89,000గా, క్రింక్ ధరను రూ.94,000గా ప్రకటించింది. వీటిని ఫేస్-2, అమెండ్‌మెంట్ 3 అనుమతులు పొందిన లిథియం ఐయాన్ బ్యాటరీలతో విడుదల చేసినట్లు తెలి పింది. బైక్ దేకో, ఎనిగ్మా ఆన్‌లైన్ సైట్‌లలో ఈ వాహనాలను బుక్ చేసుకో వచ్చని పేర్కొంది. క్రింక్ గంటలకు గరిష్టంగా 70 కిలోమీటర్ల వేగంతో, జిటి 450 గంటకు 60 కిలోమీటర్ల చొప్పున ప్రయాణించగలవని తెలిపింది.

ఫోన్‌పేలో రూపే క్రెడిట్ కార్డ్ లింక్

బెంగళూరు: ప్రముఖ చెల్లింపుల వేదిక ఫోన్‌పేలో యుపిఐ చెల్లింపులకు వీలుగా విజయవంతంగా రూపే క్రెడిట్ కార్డ్‌ను అనుసంధానం సదుపాయాన్ని కల్పించినట్లు ఆ సంస్థ వెల్లడించింది. యుపిఐ చెల్లింపుల కోసం క్రెడిట్ కార్డ్ అనుసంధానం దేశంలోనే తొలిసారి అని ఫోన్ పే వెల్లడించింది. మొత్తంగా రూ.150 కోట్ల విలువ చేసే రూపే క్రెడిట్ కార్డుల అనుసంధాన ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపింది. ఎన్‌పిసిఐ భాగస్వామ్యంతో రూపే క్రెడిట్ కార్డ్ పరిష్కారాలను అందిస్తున్నట్లు పేర్కొంది. దేశంలోని 1.2 కోట్ల వ్యాపారస్తుల వల్ల ఈ చెల్లింపులకు వీలుందని వెల్లడించింది.

భద్రాచలంలో మేఘా గ్యాస్ సేవలు ప్రారంభం

హైదరాబాద్ : భద్రాచలం పట్టణంలో మేఘా గ్యాస్ సేవలను ప్రారంభించినట్లు ఆ సంస్థ తెలిపింది. భద్రాచలం ఆర్‌టిసి బస్టాండ్ పక్కన ఉన్న వాణి పెట్రోల్ బంక్‌లో మేఘా గ్యాస్ సిఎన్‌జి స్టేషన్‌ను ఫిల్లింగ్ స్టేషన్ యాజమాని వాణి కుమారి, మేఘా గ్యాస్ ఖమ్మం ఇంచార్జ్ వంశీ శనివారం లాంచనంగా ప్రారంభించారు. ఇది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 5వ సిఎన్‌జి స్టేషన్ అని మేఘా గ్యాస్ సంస్థ తెలిపింది. హెచ్‌పిసిఎల్‌కు చెందిన వాణి ఫిల్లింగ్ స్టేషన్లో ఇక నుంచి మోటార్ వాహనాలకు అవసరమైన మేఘా గ్యాస్ ను విక్రయిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మరో ఆరు సిఎన్‌జి ఔట్‌లెట్లను తెరువనున్నామని వంశీ తెలిపారు. మేఘా గ్యాస్ దేశంలోని 10 రాష్ట్రాల్లోని 64 జిల్లాల్లో తన కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు.

మోడీ-సావర్కర్‌కు పోలికలు

ఇద్దరూ నియంతృత్వానికి ప్రతీకలే...

- అందుకే సావర్కర్ జయంతిరోజు పార్లమెంటు భవన ప్రారంభం :

ఎస్వీకే వెబినార్‌లో ప్రొఫెసర్ ఉదయ్‌నార్కర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రధాని నరేంద్రమోడీకీ, సావర్కర్‌కు అనేక అంశాల్లో పోలికలు ఉన్నాయని మహారాష్ట్ర, కొల్హాపూర్‌లోని శివాజీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ (రిటైర్డ్) ఉదయ్‌నార్కర్ అభిప్రాయపడ్డారు. అందుకే సావర్కర్ జయంతి రోజు రాష్ట్రపతిని కాదని, మోడీ నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభిస్తున్నారని చెప్పారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం (ఎస్వీకే) ఆధ్వర్యంలో 'సావర్కర్ జయంతినాడు పార్లమెంటు భవనం ప్రారంభమా?' అంశంపై శనివారం జరిగిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. సావర్కర్ తరహాలోనే మోడీ కూడా నియంతృత్వానికి ప్రతీక అని చెప్పారు. దేశ విభజనకు జిన్నా ఎంత కారణమో, సావర్కర్ కూడా అంతే కారణమని విశ్లేషించారు. తనకు, జిన్నాకు ఎలాంటి విభేదాలు లేవని స్వయంగా సావర్కర్ రాసుకున్న పుస్తకంలో చెప్పుకున్నారని ఉదహరించారు. భారతదేశాన్ని హిందూదేశంగా ప్రకటింపచేసేందుకు సావర్కర్ చివరి వరకు ప్రయత్నించారనీ, ఆయన ఏనాడూ స్వాతంత్ర్య, జాతీయోద్యమంలో పాల్గొనలేదనీ, పైగా బ్రిటీష్ పాలకులకు అనుకూలంగా వ్యవహరించారని తెలిపారు. ప్రపంచ యుద్ధం సమయంలో భారత యువతను బ్రిటన్ దేశం తరపున సైన్యంలో చేరాలని పిలుపునిచ్చారని వివరించారు. హిందువులకు ముస్లింలే ప్రధాన శత్రువులు అని సావర్కర్ భావించారనీ, ఏనాడూ ఆయన బ్రిటీష్ వారిని భారత అక్రమణదారులుగా పరిగణించలేదన్నారు. పార్లమెంటు భవనం అంటే దానిలో లోక్‌సభతో పాటు రాజ్యసభ కూడా ఉంటుందనీ, దానిలో రాష్ట్రపతి, వారి కార్యదర్శులు కూడా ఉంటారని చెప్పారు. అన్నింటా తానే ఉండాలనే ప్రచార కాంక్షతోనే ఆ భవనాన్ని ప్రధానమంత్రి మోడీ ప్రారంభిస్తున్నారని అన్నారు. సావర్కర్ ఈ దేశం హిందువు లదే అని ప్రచారం చేశారనీ, జిన్నా పాకిస్తాన్ డిమాండ్‌కు ఇదే ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. సావర్కర్ చాలా త్యాగాలు చేశారని పుస్తకాల్లో రాసుకున్నారనీ, కానీ ఆయన అనేక రాజకీయ హత్యలకు కారణమయ్యాడనే కారణాలతోనే అండమాన్ జైలుకు పంపారని తెలిపారు. 1857లో సిపాయిల తిరుగుబాటును మొదటి స్వాతంత్ర్య పోరాటమని కీర్తిస్తూ సావర్కర్ రాసిన పుస్తకమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని వివరించారు. అయితే అంతకంటే ముందే కారల్ మార్క్స్ తొలి స్వాతంత్ర్య పోరాట పుస్తకం రాసారనీ, దానిలో హిందూ, ముస్లింలు ఐక్యంగా పోరాటం చేయాలని పేర్కొన్నారని విశ్లేషించారు. సావర్కార్‌పై రెండు కేసుల్లో బ్రిటీష్ పాలకులు 50 ఏండ్ల శిక్ష వేశారనీ, కానీ 1911లో జైలుకు వెళ్లి 1921లో పదేండ్లకే విడుదల అయ్యారని తెలిపారు. జైలులో ఉన్నప్పుడు ఆయన బ్రిటీష్ పాలకులకు అనేకసార్లు క్షమాభిక్ష కోసం పిటీషన్లు పెట్టుకున్నారనీ, వీర సావర్కర్‌గా జైలుకి వెళ్లి, పిరికి సావర్కర్‌గా తిరిగివచ్చారని ఎద్దేవా చేశారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమం, 1946లో ముంబయిలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్రోద్యమాల్లో ఆయన ఎక్కడా పాల్గొనలేదన్నారు. అండమాన్ లోని కాలాపానీ జైలులో ఖైదీల హక్కుల కోసం జైలులోనే త్రైలోక్యనాథ్ చక్రవర్తి, హరేకృష్ణ కోణార్క్ వంటి నాయకులు పోరాటాలు చేస్తుంటే, సావర్కర్ కనీసం వారికి మద్దతుగా కూడా ఆ ఆందోళనల్లో పాల్గొనలేదని ఉదహరించారు. సావర్కర్ జైలులో ఉన్నప్పుడు 1924లో 'ప్రిన్స్‌పుల్స్ ఆఫ్ హిందుత్వ' అనే పుస్తకం రాసారనీ, ప్రజల్లో చీలిక తెచ్చేందుకు బ్రిటీష్ వారితో ఒప్పందం చేసుకొని, జైలు నుంచి విడుదల అయ్యారని అన్నారు. జైలులో నైతికస్థైర్యాన్ని కోల్పోయి, ప్రజల్లోని జాతీయోద్యమ కాంక్షను తగ్గించేసి, దేశంలో పీష్వాల కాలంనాటి బ్రాహ్మణాధిక్య పాలన కొనసాగించాలని కాంక్షించారని తెలిపారు. భారతదేశం హిందువులదనీ, ఇదే వారికి పితృభూమి అనీ, పుణ్యభూమి అనీ తన పుస్తకంలో సావర్కర్ పేర్కొన్నారని చెప్పారు. హిందూఏతరులు అంతా ఇతరదేశాల నుంచి వచ్చినవారే అనీ, వారందరికీ మాతృ దేశాలు వేర్వేరుగా ఉన్నాయని తన రచనల్లో పేర్కొన్నారని తెలిపారు. భారతదేశంలో హిందూఏతరులు ఉండాలంటే, హిందువులు చెప్పినట్టు వినేవారే ఉండాలని సావర్కర్ తన పుస్తకంలో రాసుకున్నారని ఉదహరించారు. ఈ సిద్ధాంతమే జిన్నాకు తోడ్పడి, సైద్ధాంతిక నైతికతకు కారణమై, దేశ విభజన జరిగిందని వివరించారు. అంతకుముందు జరిగిన పలు ఎన్నికల్లో ముస్లింలీగ్, హిందూమహాసభ ఐక్యంగా ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయని తెలిపారు. జిన్నా, సావర్కర్ ఎప్పుడూ బ్రిటీషర్లకు వ్యతిరేకంగా పోరాడలేదన్నారు. కార్యక్రమానికి ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

బీజేపీ తొమ్మిదేండ్ల పాలన

అబద్ధాలు, దోపిడీకి కేరాఫ్ అడ్రస్

ఏఐసీసీ అధికార ప్రతినిధి కన్నయ్యకుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని తొమ్మిదేండ్ల బీజేపీ పాలన అబద్ధాలకు, దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఏఐసీసీ అధికార ప్రతినిధి కన్నయ్యకుమార్ విమర్శించారు. ఏఐసీసీ ఆధ్వర్యంలో బీజేపీ పాలనపై రూపొందించిన 'నౌ సాల్, నౌ సవాల్' అనే పుస్తకాన్ని శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన పార్టీ నేతలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కన్నయ్యకుమార్ మాట్లాడుతూ ప్రధాని మోడీ దేశ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారనీ, వాటినే కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని బీజేపీ ప్రభుత్వం అనడం కంటే మోడీ ప్రభుత్వం అనడమే సరైందని విమర్శించారు. వంద రోజుల్లో నల్లధనం బయటకు తీసుకొస్తామని ప్రగల్బాలు పలికారని గుర్తు చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామనీ, అధికారంలోకి వస్తే 100 స్మార్ట్ సిటీలు నిర్మిస్తామని హామీ ఇచ్చిన మోసం చేసిందని విమర్శించారు. తొమ్మిదేండ్లలో మోడీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలంటూ కాంగ్రెస్ పార్టీ తొమ్మిది ప్రశ్నలు లేవనెత్తుతున్నదని చెప్పారు. ఆ ప్రశ్నలకు ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలను దేశ ప్రజల తరపున కాంగ్రెస్ పార్టీ అడుగుతున్నారని చెప్పారు. తప్పులు చేసిన వాళ్ళంతా బీజేపీ వాషింగ్ మెషిన్‌లోకి వచ్చి పవిత్రంగా మారుతున్నారని ఎద్దేవా చేశారు. అదానీ అభివృద్ధియే దేశాభివృద్ధిగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రైతులు అభివృద్ధి అవుతుంటే అమిత్‌షా తన కొడుకుని రైతుగా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మేక్ ఇన్ ఇండియా విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మోడీ ప్రభుత్వం ఆర్థిక అరాచకత్వానికి పాల్పడుతున్నదని ఆరోపించారు. మోడీ ప్రధాని అయ్యాక పేదల సంఖ్య పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ షెల్ కంపెనీల్లో పెట్టుబడులు ఎవరివో ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. తొమ్మిదేండ్లలో మోడీ ఒక్క ప్రెస్‌మీట్ కూడా ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ప్రధాని కేవలం ప్రధాని మాత్రమే కాదనీ, ఆయనే రాష్ట్రపతి, ఆర్థిక మంత్రి, హోం మంత్రి, విదేశాంగ మంత్రి ఇలా మోడీకి ఏం కావాలనిపిస్తే అది అయిపోతారని ఎద్దేవా చేశారు. 'ధరలు పెరుగుతున్నాయంటే ధరలు తగ్గించడం ప్రధాని పని కాదని బీజేపీ నేతలు చెప్పడం దారుణమన్నారు. బీజేపీ నాయకులు కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకం అంటారు కానీ మిత్ర రాజకీయాలకు వ్యతిరేకం' అని ఎందుకు చెప్పడం లేదన్నారు. పుల్వామా ఘటనకు ముందే హెచ్చరించినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఓబీసీ అని చెప్పుకునే ప్రధాని కుల గణనను ఎందుకు ఒప్పుకోవడం లేదని ప్రశ్నించారు. మై పార్లమెంట్ మై ప్రైడ్ అంటున్న మోడీ 'మన పార్లమెంట్ మన ప్రైడ్' అనలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. పీఎం కేర్ ఫండ్ పీఎం కోసమే ఏర్పాటు చేశారనీ, అందుకే వివరాలు బయటకు చెప్పడం లేదని విమర్శించారు. కరోనా వాక్సిన్ కోసం ఖర్చు చేసిన నిధులను డీజిల్, పెట్రోల్ ధరలు పెంచడం ద్వారా లాకుంటున్నారని చెప్పారు. ఇన్ని వైఫల్యాలు మూట కట్టుకున్న మోడీ విశ్వగురువు ఎలా అయ్యారని ప్రశ్నించారు.

కుల గణనను చేసేందుకు బీజేపీకి భయమెందుకు? వీహెచ్

బీసీ ప్రధాన మంత్రి అని చెప్పుకునే మోడీ కనీసం కేంద్రం బీసీ శాఖను ఏర్పాటు చేయలేకపోయారని మాజీ ఎంపీ వి హనుమంత రావు ఎద్దేవా చేశారు. కుల గణనను చేసేందుకు బీజేపీకి భయమెందుకని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీలో గొప్ప మార్పు కనిపిస్తున్నదని తెలిపారు. లారీలో ప్రయాణించి వారి సాధక బాధకాలు తెలుసుకున్నారని గుర్తు చేశారు. తొమ్మిదేండ్ల బీజేపీ పాలనలో ఉన్న సమస్యపై రాహుల్ గొంతెత్తి మాట్లాడుతున్నారని చెప్పారు. బీసీలకు 40శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్, మోడీ జిమ్మికులు : పొన్నాల లక్ష్మయ్య

ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇక్కడ కేసీఆర్, అక్కడ మోడీ జిమ్మిక్కులు చేస్తున్నారని మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. పార్లమెంట్ వ్యవస్థపై బీజేపీ చిత్తశుద్ధిపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ప్రజలు తిరగబడితే నల్ల చట్టాల విషయంలో బీజేపీ ఎలా తోక ముడి చిందో, భవిష్యత్‌లోనూ అదే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరిం చారు. లిక్కర్ స్కాం కేసు గురించి చర్చించేందుకే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారని ఎద్దేవా చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి మాట్లాడుతూ బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని టీపీసీసీ నిర్ణయించడం పట్ల హర్షనీయమన్నారు.

ఈ ఏడాది సాధారణ వర్షపాతం

జూన్‌లో తక్కువే: ఐఎండీ అంచనా

న్యూఢిల్లీ : నైరుతి రుతుపవనాల రాక నెమ్మదించినా ఈ సంవత్సరం వర్షపాతం సాధారణంగానే ఉంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. జూన్‌లో సాధారణం కంటే తక్కువగానే వర్షాలు పడతాయని, అయితే జూన్-సెప్టెంబర్ మధ్య కాలంలో మొత్తంమీద సాధారణ వర్షపాతం నమోదవుతుందని వివరించింది. ఈ కాలంలో సగటున 96% వర్షపాతం ఉంటుం దని వాతావరణ విభాగానికి చెందిన డీఎస్ పాయ్ చెప్పారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా పంజాబ్, హర్యానా, ఢిల్లీ సహా దేశంలోని వాయవ్య ప్రాంతంలోనూ, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది. అయితే కొన్ని సానుకూల అంశాల కారణంగా దేశంలో మొత్తం మీద సాధారణ వర్షపాతమే నమోద వుతుంది. సీజన్ ప్రారంభంలో వర్షాలు తక్కువగా కురవడం వల్ల పలు ప్రాంతాలలో వేసవి పంటలపై ప్రభావం పడే అవకాశం ఉంది.

పండుగ వాతావరణంలో...

- దశాబ్ది ఉత్సవాలపై మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పండుగలా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని మంత్రి సత్యవతి రాథోడ్ సూచించారు. గిరిజనోత్సవాల నిర్వహణ, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారోత్సవాలపై రాష్ట్ర గిరిజన, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పదేండ్ల ప్రగతిని చాటుతూ పండుగ వాతావరణంలో అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయినుంచి రాష్ట్ర స్థాయి వరకు జూన్ 2 నుంచి 22 వరకు ఏరోజున ఏ కార్యక్రమం చేపట్టాలో అధికారులకు మంత్రి వివరించారు. గిరిజన విద్యాలయల్లో సంబరాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. జిల్లాల వారీగా ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు.

అదిరిపోయేలా దశాబ్ది ఉత్సవాలు

ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశంలో మంత్రి తలసాని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను హైదరాబాద్ నగరంలో అత్యంత ఘనంగా నిర్వహించే విధంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. ఈ ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిర్వహణ, ఏర్పాట్లపై శనివారం సచివాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా ఈ కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రత్యేకంగా సమావేశమై ఉత్సవాలు నిర్వహించే ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గాల వారీగా కార్యక్రమాన్ని రూపొందించాలని ఆయన సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విస్తతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు ఆయా శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో నిమగ్నం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

ఏం సాధించారని సంబురాలు?

- టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలి
- దశాబ్ది ఉత్సవాలను బహిష్కరించాలి
- ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాల పేరుతో సంబురాలు జరుపుతున్నారని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఈ ఉత్సవాలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. టీఎస్పీఎస్సీ బోర్డును రద్దు చేసిన తర్వాతనే గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న పత్రాల లీకేజీలో కమిషన్ చైర్మెన్ జనార్దన్ రెడ్డి, ఏవోలను సిట్ అధికారులు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. దీని వెనుక సీఎంఓ అధికారుల హస్తం ఉందని ఆరోపించారు. ఈ విషయంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిదేండ్లయినా రైతులకు రుణమాఫీ ఎందుకు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. కౌలు రైతుల సంక్షేమ నిధి ఎక్కడ అని ప్రశ్నించారు. రైతు ఆత్మహత్యలపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను సృష్టి చేస్తున్న వారిపై ఎందుకు పీడీ యాక్టుపై కేసులు నమోదు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. రెవిన్యూ రికార్డుల డిజిటలైజేషన్ పేరుతో ఆర్ఓఆర్ చట్టంలో అనుభవదారు కాలం తొలగించి రైతుల హక్కులను పూర్తిగా కాలరాశారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బంధు ద్వారా భూస్వాములకు ఎన్ని కోట్లు ఇచ్చారో, పేద రైతులకు ఎన్ని కోట్లు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్ ఎవరి ప్రయోజనాల కోసం తెచ్చారని ప్రశ్నించారు. అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. సీక్రెట్ జీవోలు, చీకటి ఒప్పందాలతో ప్రభుత్వ నడుస్తున్నదని ఆరోపించారు. బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన నిధులెన్ని? ఎంత ఖర్చు చేశారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. హోంగార్డులను రెగ్యులరైజ్ చేస్తామంటూ పలు సార్లు హామీ ఇచ్చి ఎందుకు చేయదని ప్రశ్నించారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మత్స్యకార సంఘాలను బడా కాంట్రాక్టర్ల చేతిలో పెట్టి పేద ముదిరాజ్,గంగపుత్రల పొట్ట కొట్టింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.

సంపాదకీయం

విలువల విస్మ'రణం'

సాధారణంగా సొంతిల్లు కట్టుకుని గృహప్రవేశ ఉత్సవాన మొదట ఇంట్లోకి అడుగుపెట్టేది ఇంటి పెద్దనే కదా! ఈ మాత్రం తెలియని వారెవరుంటారు! కానీ ఇప్పుడలా ఎందుకు జరగటం లేదు. పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవం పార్లమెంటులో సమున్నత అధిపతిగా ఉన్న రాష్ట్రపతి ప్రమేయం లేకుండానే ఎందుకు జరుగుతోంది. పార్లమెంటు అంటే లోక్‌సభ, రాజ్యసభ, వీటితో పాటు ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి నిర్ణయమూ రాష్ట్రపతి పేరుమీదనే జరుగుతాయి. అసలు ప్రధానమంత్రిని, మంత్రులను నియమించేదీ రాష్ట్రపతే. మన రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి పదవి సర్వోన్నతమైనది. అలాంటి అధిపతిని విస్మరించి, ప్రధాని ప్రారంభించడమనేది ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలివ్వటమేనని 19 ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. అంతే కాక అందుకు నిరసనగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నాయి.

ప్రారంభోత్సవానికి కనీసం ఆహ్వానం కూడా రాష్ట్రపతికి అందించకపోవటం దారుణమైన విషయం. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి, విలువలకు భంగకరం. ప్రతిపక్షాలు, ఇతర నిపుణులు అభ్యంతర పెడుతున్నప్పటికీ ఏమాత్రం ఖాతరు చేయకుండా ప్రధానియే ప్రారంభించాలని తీసుకున్న నిర్ణయం అనేక చర్చలకు తావిస్తున్నది. అసలు పార్లమెంటు భవన శంఖుస్థాపన సందర్భంలో కూడా ఒక దళిత రాష్ట్రపతిగా ఉన్న రామ్‌నాథ్ కోవింద్‌నూ ఆహ్వానించలేదు. ఇప్పుడు ఆదివాసీ మహిళ రాష్ట్రపతిగా ఉంది. వీరిద్దరినీ దూరం పెట్టటమనేది వారిని అవమానపరిచేదిగా ఉందన్న విమర్శకు బలం చేకూరుస్తున్నది. కేవలం రాజకీయ ప్రయోజనాలు పొందేందుకే దళిత, ఆదివాసీలను రాష్ట్రపతులుగా చేయడం, చేసామని చెప్పుకోవటమే గాని, నిజంగా గౌరవ మర్యాదలు ఇవ్వటంలో వీరికి ఆసక్తిలేదనేది ఈ సంఘటనలు రుజువు చేస్తాయి.




ఇకపోతే ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలూ అని ఇతరులు గగ్గోలు పెట్టటమే కాని, అసలు ఏలుతున్న వారికి వాటిపైన అంత శ్వాసము, నమ్మకము లేవన్న విషయాన్ని మనమింకా అర్థం చేసుకోవలసేవుంది. బాహ్యంగా ప్రకటించకపోయినప్పటికీ వారి అంతర్గతమైన అవగాహనలో భారత రాజ్యాంగ విలువల పట్ల తృణీకారమే ఉన్నది. ఒక్కొక్క రాజ్యాంగ విలువను ధ్వంసమొనరుస్తూ వస్తున్న తీరు అందుకు నిదర్శనం. కేంద్రీకృతమైన అధికారాన్ని కలిగివుండాలన్నది వారి కోరిక. ప్రజాస్వామిక భావనే వారికి సరిపడదు. ఇప్పటి వరకు మన రాజ్యాంగం ద్వారా ఏర్పడిన ప్రజాస్వామిక ప్రతీకలను, రూపాలను, సంకేతాలను ఒక్కొక్కటే మార్చుతూ, తమవైన నిర్మాణాలను చేపడుతుండటాన్ని మనం చూస్తాం. అందులో భాగమే పార్లమెంటు నూతన భవనం. దశాబ్దాలుగా చూస్తూవస్తున్న ఇమేజెస్‌నూ మార్చేస్తున్నారు. హీరోలనూ మార్చేస్తున్నారు. చరిత్రనూ మార్చేసి, విలువలనూ మార్చేసి, వారు కోరుకుంటున్న ఒక రాజ్యాన్ని నిర్మించుకోవటానికి చేస్తున్న సన్నాహాలివి. పార్లమెంటును ప్రారంభించడానికి ఈరోజును యెంచుకోవడంలోనూ వారిదైన పథకం సుస్పష్టం. స్వాతంత్ర్యోద్యమం నుండి తప్పుకుని, బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు క్షమాపణలు చెప్పి, వారి సేవకుడుగా చరిత్రలో నిలిచిన కరుడుకట్టిన హిందూత్వవాది వి.డి. సావర్కర్ జయంతి నాడు మన ప్రజాస్వామ్య భవనం ఆవిష్కృతమవ్వడమంటే అది ఏ రకమైన రూపం తీసుకోబోతోంది అనే విషయం తేటపడాలి.

ఇక రామాయణంలో పిడకల వేటలాగా రాజదండం కథను ఒకదానిని తీసుకువచ్చి ప్రారంభోత్సవ కథలో కలిపి వండి వడ్డిస్తున్నారు. చోళరాజుల కాలంలోకీ వెళ్లారు. నిజమే మరి రాచరికపు ఆనవాళ్లనన్నింటినీ తెచ్చి తిరిగి ఆ వ్యవస్థను ప్రతిష్ఠించటమే వీరికి కావలసింది. వాస్తవంగా స్వాతంత్ర్యం వచ్చాక రాజదండాన్ని అప్పటి వైస్రాయ్ మౌంట్‌బాటెన్ నెహ్రూకు అందించిందే లేదు. కేవలం నెహ్రూకు ఒక బహుమతిగా వచ్చిన ఓ రాచరిక చిహ్నం చుట్టూ కథలల్లి ప్రచారం చేస్తున్నారు. అంటే రాజుల కాలం నాటి సాంస్కృతిక జీవన ఆవరణంలోకి జనాన్ని తీసుకుపోయే ప్రయత్నం చేస్తున్నారు. అందులోనూ అబద్ధాలను, అసత్యాలను ప్రచారం చేసి.

ఏది ఏమైనా కర్నాటకలో తీవ్రంగా దెబ్బతిన్న తర్వాత, దాని నుండి బయటపడటానికి ఇవన్నీ ఉపకరిస్తున్నాయి. ప్రజలను కూడా మరో చర్చకు పురికొల్పినట్టయింది. అయినా కాని ఈ సమస్య దేశంలోని ప్రతిపక్షాలన్నింటినీ ఐక్యం చేయటానికి తోడ్పడుతోందని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రధాని తీసుకుంటున్న నియంతృత్వ చర్యలు, మతతత్వ విధానాలు, ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రజలు నిరసిస్తున్నారు. ప్రతిపక్షాలూ ఐక్యమవుతున్నాయి. ప్రధాని మోడీ ఇదేరీతిగా విధానాలను కొనసాగిస్తే మరింత ప్రతిఘటన పెరిగే అవకాశం ఉంది. ప్రజాస్వామిక స్ఫూర్తిని, రాజ్యాంగ విలువలను లెక్కచేయకుండా కేవలం భవనాలు నిర్మిస్తే ఏ ప్రయోజనమూ ఉండదు. భవిష్యత్తూ వెలుగొందదు.

ఇక రామాయణంలో పిడకల వేటలాగా రాజదండం కథను ఒకదానిని తీసుకువచ్చి ప్రారంభోత్సవ కథలో కలిపి వండి వడ్డిస్తున్నారు. చోళరాజుల కాలంలోకీ వెళ్లారు. నిజమే మరి రాచరికపు ఆనవాళ్లనన్నింటినీ తెచ్చి తిరిగి ఆ వ్యవస్థను ప్రతిష్ఠించటమే వీరికి కావలసింది. వాస్తవంగా స్వాతంత్ర్యం వచ్చాక రాజదండాన్ని అప్పటి వైస్రాయ్ మౌంట్‌బాటెన్ నెహ్రూకు అందించిందే లేదు. కేవలం నెహ్రూకు ఒక బహుమతిగా వచ్చిన ఓ రాచరిక చిహ్నం చుట్టూ కథలల్లి ప్రచారం చేస్తున్నారు.

రాష్ట్రపతిని విస్మరించి రాజదండ ప్రతిష్ఠ



తెలకపల్లి రవి

దేశ ప్రతిష్ఠకు ప్రతీకగా నిలవాల్సిన పార్లమెంటు భవన సముదాయం ప్రారంభోత్సవాన్ని ఏకపక్ష వ్యవహారంగా మార్చడం ప్రధాని నరేంద్రమోడీకే చెల్లింది. ఇరవైకిపైగా ప్రతిపక్షాలు హాజరు కాబోమని ప్రకటిస్తే కనీసం సంప్రదింపులకు కూడా ప్రయత్నించని అప్రజాస్వామిక పోకడలు దేశం ఎప్పుడూ చూసివుండదు. ఈ మధ్యనే లోక్‌సభ మాజీ కార్యదర్శి పిడిటి చారి ప్రసంగాన్ని అనువాదం చేసినప్పుడు ఆయనో మాట చెప్పారు. నెహ్రూ హయాంలోనూ తర్వాత చాలా కాలం కూడా పార్లమెంటులో ఉద్రిక్తత వస్తే ప్రతిపక్ష నాయకులను పిలిచి చర్చించి ఏదో ఒక పరిష్కారం చేసేవారట. ఎందుకంటే సభ జరిగేలా చూడటం ప్రభుత్వాధినేత అయిన ప్రధాని బాధ్యత. కర్తవ్యం కూడా. మోడీ హయాంలో పార్లమెంటు ఒక తంతులాగా మార్చి పెత్తనం చేయడమే గాని ఎన్నడూ రాజ్యాంగం సంప్రదాయం రీత్యా వ్యవహరించింది లేదు. కీలకమైన కాశ్మీర్ అంశం లాంటిదాన్ని కూడా హఠాత్తుగా తెచ్చి మమ అనిపించడం తప్ప ముందుగా చర్చించే సాహసం ప్రజాస్వామ్య స్పృహ లేవు. నోట్లరద్దు, ఎన్ఆర్‌సీ వంటివాటిపై చర్చలకే అవకాశమివ్వని నిరంకుశత్వం ఈ సర్కారుది. అదే ఇప్పుడూ ప్రత్యక్షమవుతున్నది. అసలు న్యూ విస్టా పేరుతో నూతన భవన సముదాయాన్ని కట్టాలన్న నిర్ణయమే ఏకపక్షమైంది. దేశమంతా కరోనాలో కలవరపడుతున్నప్పుడు తీసుకున్నది. చారిత్రకంగా కొనసాగుతున్న గొప్ప నిర్మాణాల స్థానంలో తన ముద్ర కోసమే అవసరం లేకున్నా లూట్యాన్స్ ఢిల్లీని మోడీస్ ఢిల్లీగా మార్చడమే ఏకైక లక్ష్యంగా ఈ తతంగం తలపెట్టారు. కోర్టులలో కేసులూ నడిచాయి. సాంకేతిక కారణాలతో అనుమతి సంపాదించి పూర్తి చేశారు. నూతన భవనంపై జాతీయ చిహ్నమైన మూడు సింహాల ప్రతిష్ఠాపన కూడా ఇలాగే హఠాత్తుగా ఒంటరిగా కానిచ్చేశారు. ఆ సింహాలు గతంలో వలె గంభీర ప్రసన్నంగా గాక క్రోధంగా ఉండటం మరో చర్చకు దారితీసింది. దానిపై విమర్శల తర్వాత పూర్తిస్థాయి ప్రారంభోత్సవానికైనా పునరాలోచించి అందరినీ కలుపుకు పోయేబదులు దీనికీ తనే ఏకైక కర్త, కర్మ, క్రియగా కానిచ్చేయడం మోడీకే చెల్లింది!


రాష్ట్రపతి రాజ్యాంగ పాత్ర

పార్లమెంటు అంటే అన్నిపార్టీల సభ్యులూ ఉండే వేదిక. రాజ్యసభ అయితే రాజ్యాంగ పరంగా రాష్ట్రాల సభ. కాని మోడీ సర్కారు ఇది కేవలం ప్రభుత్వ వ్యవహారంగా మార్చేసింది. కాని ఇప్పుడు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంపై విమర్శ వచ్చింది ప్రతిపక్షాల గురించి కాదు. రాష్ట్రపతి గురించి. భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం పార్లమెంటు ఉభయ సభల ఏర్పాటుకు ప్రారంభానికి వాయిదాకు ఎన్నికలకూ కర్త రాష్ట్రపతి. రాజ్యాంగంలో 3, 111, 274 అధికరణాలు రాష్ట్రపతి అధికారాలను స్పష్టంగా పేర్కొంటున్నాయి. 79వ అధికరణం ప్రకారం రాష్ట్రపతి, సభ్యులు కలిస్తేనే పార్లమెంటు. పార్లమెంటు ఏర్పాటు, గడువు ముగిసిన తర్వాత లేదా ప్రభుత్వం కోరితే పడిపోతే మళ్లీ కొత్త సభ ఏర్పాటుకు ఎన్నికల కమిషన్‌కు అనుమతి నివ్వడం రాష్ట్రపతి ద్వారానే జరుగుతుంది. ఎన్నికైన సభ్యుల జాబితాను తనకే అందజేస్తారు. 78వ అధికరణం మేరకు పార్లమెంటు ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి సంతకం చేస్తేనే శాసనాలవుతాయి. కాబట్టి రాష్ట్రపతికీ పార్లమెంటుకూ మధ్య సంబంధం విడదీయరానిది. అలాంటి రాష్ట్రపతి లేకుండా కనీసం ఆహ్వానించకుండా పార్లమెంటు నూతన భవనాన్ని ప్రారంభించాలనుకోవడం ఎలాంటి ప్రజాస్వామ్య సంప్రదాయం? ఎలాంటి రాజ్యాంగ గౌరవం? పైగా ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును తొలి ఆదివాసి మహిళ ఎన్నికగా గొప్పగా ప్రచారం చేసుకున్న మోడీ ప్రభుత్వం ఎందుకు ఆమెను గౌరవించడం లేదు? ఈ మాట అనగానే అయితే ప్రతిపక్షాలు ఎందుకు ఆమెపై అభ్యర్థిని పెట్టాయని కొందరు ఎదురు దాడి చేయడం మరీ విడ్డూరం. ఆ స్థానంలో ఎవరుంటే వారు రాజ్యాంగ రీత్యా ఆ గౌరవానికి అర్హులు తప్ప ఎన్నికల్లో పోటీ పెట్టడం ఇక్కడ సమస్య కానేకాదు. ఇంకా కొంతమంది ఉదాహరణకు తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాల గవర్నర్‌గా ఉన్న తమిళిసై సౌందరరాజన్ వంటివారు సచివాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి కేసీఆర్ తనను ఆహ్వానించలేదని పోటీ వాదన తెస్తున్నారు. సచివాలయానికి గవర్నర్‌కు మధ్య అలాంటి పాత్ర ఉన్నట్టు రాజ్యాంగం ఎక్కడైనా చెప్పిందా? తలా తోక లేని వాదన తప్పు! ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, మహారాష్ట్ర మాజీ గవర్నర్‌ల నిర్వాకాలను సుప్రీం కోర్టు తప్పు పట్టిన తర్వాత కూడా బీజేపీ నియమిత వ్యక్తుల తీరు మారలేదనడానికి ఇదో ఉదాహరణ మాత్రమే.

తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాల గవర్నర్‌గా ఉన్న తమిళిసై సౌందరరాజన్ వంటివారు సచివాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి కేసీఆర్ తనను ఆహ్వానించలేదని పోటీ వాదన తెస్తున్నారు. సచివాలయానికి గవర్నర్‌కు మధ్య అలాంటి పాత్ర ఉన్నట్టు రాజ్యాంగం ఎక్కడైనా చెప్పిందా? తలా తోక లేని వాదన తప్పు! ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, మహారాష్ట్ర మాజీ గవర్నర్‌ల నిర్వాకాలను సుప్రీం కోర్టు తప్పు పట్టిన తర్వాత కూడా బీజేపీ నియమిత వ్యక్తుల తీరు మారలేదనడానికి ఇదో ఉదాహరణ మాత్రమే.

ఐక్యనిరసనలో ఏపీ అపశ్రుతి

20కి పైగా ప్రతిపక్షాలు కొత్త పార్లమెంటు ప్రారంభ వేడుకను బహిష్కరించాలని నిర్ణయించడం ప్రతిపక్ష ఐక్యతకూ బీజేపీ నిరంకుశ మతతత్వ రాజకీయాలపై పెరుగుతున్న వ్యతిరేకతకూ అద్దం పట్టింది. ఇటీవలే కర్నాటక ఎన్నికలలో ఘోరపరాజయం పాలైన ఆ పార్టీ జాతీయ స్థాయిలోనూ తీవ్ర వ్యతిరేకతకు గురవుతున్నట్టు స్పష్టమైంది. అయితే మరోవైపున పార్లమెంటు భవనం అనేది రాజకీయాలకు అతీతమైన విషయమన్నట్టు దాన్ని బహిష్కరించడం అపచారమన్నట్టు ఒక పల్లవి లంకించుకున్నారు. ప్రభుత్వాధినేత అయిన ప్రధాని ప్రారంభిస్తే తప్పేమిటని కొందరు మీడియా వ్యాఖ్యాతలు కూడా వంతపాడుతున్నారు. ముందే చెప్పినట్టు రాష్ట్రపతిని దేశాధినేతఅనీ ప్రధానిని ప్రభుత్వాధినేత అనీ అంటారు. దేశ గౌరవానికి సంబంధించిన సందర్భాలలో రాష్ట్రపతిని ముందు నిలపడం ఆనవాయితీ. ఎందుకంటే ఆయనను లేదా ఆమెను పార్లమెంటు ఉభయ సభలూ ఎన్నుకుంటాయి. అన్ని రాష్ట్రాల ఎంఎల్ఎలు ఓటింగులో పాల్గొంటారు. ఎన్నికైన సభ్యులందరూ పాల్గొనే ఈ ఎన్నిక దేశసమైక్యత కోణంలో కీలక పాత్ర వహిస్తుంది. కనుకనే రాష్ట్రపతిని గౌరవించడం రాజ్యాంగాన్ని గౌరవించడమవుతుంది. ఆ మర్యాద పాటించని మోడీ ప్రభుత్వాన్ని వదిలేసి బహిష్కరిస్తున్న ప్రతిపక్షాలపై దాడి ఎక్కుపెట్టడం తలకిందులు తర్కం. ఈ సమయంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుల వైసీపీ, టీడీపీ పార్టీలు రెండూ మోడీకి వత్తాసు నివ్వడం హాస్యాస్పదం. జాతీయ రాజకీయాలపై ఎప్పుడూ పెదవి మెదపని జగన్ ఈ విషయంలో మాత్రం తలకెత్తుకుని ఇలాంటి సందర్భాన్ని రాజకీయ భేదాలకు అతీతంగా అన్ని పార్టీలూ పాలుపంచుకోవాలని ప్రతిపక్షాలకు ఉచిత సలహా ఇవ్వడం గమనించదగింది. ఇటీవలే మోడీ విజన్‌ను విధానాలను పొగిడి తరించిన చంద్రబాబు కూడా డిటోగా ప్రశంసలు కురిపించారు. ఈ విధంగా అధికారం కోసం పోటీ పడే రెండు ప్రధాన పార్టీలు బీజేపీకి మద్దతు పలకడం వారి స్వామి భక్తినే చెబుతుంది. ఇక ఉత్తరప్రదేశ్‌లో గతంలో చాలాసార్లు అవకాశవాదంగా వ్యవహరించిన బిఎస్‌పి మాయావతి, కర్నాటకలో లోగడ జట్టుకట్టిన జేడీఎస్ దేవగౌడ కూడా కోరికోరి హాజరవుతున్నారు. ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వంటివారు ఎప్పుడూ అదే మాటతో ఉన్నారు. ఇలాంటి వైఖరి లౌకిక విలువల కోసం జరిగే రాజ్యాంగ గౌరవం కోసం జరిగే పోరాటంలో ఒక అపశ్రుతి.



ఎక్కడిదీ రాజదండం?

మిగిలిన అనేక మతతత్వ పోకడలు నిర్ణయాలు పక్కన పెట్టి ఈ ప్రారంభోత్సవంలోనూ మోడీ ప్రభుత్వం మతరాజకీయాలనే ప్రదర్శిస్తుంది. హిందూత్వ సిద్ధాంత కర్త గాడ్సే గురువు సావార్కర్ జయంతి నాడు ఈ ప్రారంభోత్సవం పెట్టడం వ్యూహాత్మక సంకేతమే. రాజదండం (సెంగోల్) ఉదంతం ఒక ఉదాహరణ. గతంలో ఎన్నడూ పెద్దగా చెప్పుకోని ఈ రాజదండం కథను తవ్వితీయడం ద్వారా బీజేపీ హిందూత్వ సిద్ధాంతానికి పెద్దపీట వేస్తున్నది. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వారి నుంచి భారతీయులకు అధికార మార్పిడి జరిగేప్పుడు తమిళనాడులోని తిరువాదుతరై అదీనం అనే మఠం నుంచి ఈ రాజదండం కానుకగా సమర్పించబడిన మాట నిజమే. దాన్ని ఆ ఆశ్రమ ప్రతినిధులు ప్రధాని నెహ్రూకు అందిస్తున్న చిత్రాలు కూడా ఆనాడు వచ్చాయి. అయితే అదేదో స్వాతంత్ర్య సాధనకు అధికార మార్పిడికి సంకేతంగా ఇచ్చినట్టు పేర్కొనే ఆధారాలే లేవు. అలా చూసిన చెప్పిన సందర్భాలూ లేవు. హోంమంత్రి అమిత్ షా అకస్మాత్తుగా దీన్ని ప్రస్తావించినప్పుడు నాయకులూ పాత్రికేయులూ కూడా ఆశ్చర్యపోయారు. అధికార మార్పిడికి ఏదైనా లాంఛనప్రాయమైన సంకేతం ఉంటుందా అని మౌంట్‌బాటన్ అడిగితే నెహ్రూ మొదటి గవర్నర్ జనరల్ రాజాజీని సంప్రదించినట్టు ఆయన తమ స్వరాష్ట్రమైన మద్రాసు నుంచి దాన్ని తెప్పించినట్టు అమిత్‌షా కథ చెబుతున్నారు. ఈ రాజదండాన్ని మొదట మౌంట్‌బాటన్‌కు ఇచ్చి తర్వాత నెహ్రూకు అందజేశారని కథ చెబుతున్నారు. దాన్ని పార్లమెంటు భవనంపై శాశ్వతంగా ప్రతిష్ఠించుతామని కూడా కేంద్రం ప్రకటించింది. బ్రిటిష్ చక్రవర్తితో సహా దేశదేశాల రాజులు పట్టాభిషేకాల సమయంలో ఈ తరహా దండం ఒకటి రాజగురువు నుంచి తీసుకునే పద్ధతి ఉంది. కాని అది ప్రజాస్వామంలో ప్రజల ఆమోదం తప్ప అలాంటి ఆచారాలేమీ ఉండవు. పైగా లౌకిక విధానం తీసుకున్న భారతదేశంలో అసలే అవకాశం లేదు. భిన్న మతాలతో కూడిన ఈ దేశంలో ఒక మతానికి సంబంధించిన చిహ్నమే ఎలా ప్రభుత్వ చిహ్నమవుతుంది? అంటే ఇది కూడా బీజేపీ మార్కు మత రాజకీయాలలోనూ తమిళనాడును సంతోషపెట్టే వ్యూహంలోనూ భాగమనుకోవాలి. కర్నాటక దెబ్బ తర్వాత దక్షిణాదిలో పూర్తిగా ఖాళీ అయిన బీజేపీ ఆ కోణంలోనూ ఈ పని చేస్తుండవచ్చు. దీనికి ఆధారాలేమంటే ఆనాడు వెలువడిన ప్రత్యేక సంచికలలో ఉందంటున్నారు. తీరాచూస్తే వాటిలోనూ ఆ మఠం ప్రతినిధులుచెప్పిందే ఉంది. కనక ఇది కల్పితమనేది సుస్పష్టం. రాజ్యాంగం పార్లమెంటుకు ఇచ్చిన ప్రాతినిధ్య స్వభావాన్ని, దానిలో భాగంగానూ రాజ్యాధినేతగానూ రాష్ట్రపతి స్థానాన్ని మోడీ సర్కారు అగౌరవం పాలు చేసింది. రాజ్యాంగంలో ఏ ప్రస్తాన లేని ఒక రాజదండాన్ని ఆ స్థానంలో ప్రతిష్ఠించడాన్ని రాజరిక స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. మోడీ ఏకపక్ష నిరంకుశత్వానికి నిదర్శనమవుతుంది.

కర్నాటక దెబ్బ తర్వాత దక్షిణాదిలో పూర్తిగా ఖాళీ అయిన బీజేపీ ఆ కోణంలోనూ ఈ పని చేస్తుండవచ్చు. దీనికి ఆధారాలేమంటే ఆనాడు వెలువడిన ప్రత్యేక సంచికలలో ఉందంటున్నారు. తీరాచూస్తే వాటిలోనూ ఆ మఠం ప్రతినిధులుచెప్పిందే ఉంది. కనక ఇది కల్పితమనేది సుస్పష్టం. రాజ్యాంగం పార్లమెంటుకు ఇచ్చిన ప్రాతినిధ్య స్వభావాన్ని, దానిలో భాగంగానూ రాజ్యాధినేతగానూ రాష్ట్రపతి స్థానాన్ని మోడీ సర్కారు అగౌరవం పాలు చేసింది. రాజ్యాంగంలో ఏ ప్రస్తాన లేని ఒక రాజదండాన్ని ఆ స్థానంలో ప్రతిష్ఠించడాన్ని రాజరిక స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. మోడీ ఏకపక్ష నిరంకుశత్వానికి నిదర్శనమవుతుంది.

రిపోర్టర్స్ డైరీ

సీఎంల గోల తర్వాతగానీ...బీ అలర్ట్

'అలూ లేదు... సూలూ లేదు కొడుకుపేరు సోమలింగం అన్నడంట' ఎన్కటికి ఒకడు. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ నేతల తీరు గట్లనే ఉన్నది. 'ఐక్యమత్యమే మహాబలం' అని కర్నాటకలో కాంగ్రెస్ నేతలు నమ్మారు. ఏడాదిన్నరగా నియోజకవర్గాల్లోనే ఎక్కడిక్కడ పాగా వేశారు. నేతలంతా ఒక్కమాటపై నిలబడి అధికారంలోకి తీసుకొచ్చారు. గిది మాత్రం ఇక్కడి కాంగ్రెస్ నేతల బుర్రకెక్కడం లేదు. పైగా, కర్నాటకలో అధికారంలోకి వచ్చినం... తెలంగాణ లోనూ సానుకూల పవనాలు వీస్తున్నయని సంకలు గుద్దుకుంటున్నారు. అప్పుడే అధికారంలోకి వచ్చినట్టు... తమకు తామే సీఎం అయినట్టు అనుచరులతో జేజేలు కొట్టించుకుంటూ పగటి కలలు కంటున్నరు. ఎన్నికలకు ఇంకా ఆరు నెలల టైం కూడా లేదు నియోజకవర్గంలో రోజూ తిరుగుతూ జనంలో ఉండాలనే సోయినే మరిచారు. దశాబ్దకాలంగా పక్కనబెట్టారు... ఈసారి ప్రజలే తమకు ఓట్లేస్తారనే భ్రమల్లో మునిగి తేలుతున్నరు. ఒకరిద్దరు ముఖ్యనేతలు యాత్రలు చేస్తున్నా ఎవరికవారే యమునా తీరే అన్నట్టుగా అవి కొనసాగుతున్నాయి. జనమేమో వీళ్ల ఇక మారరు బై అనుకుంటున్నరు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఓడించేటందుకు వేరే వాళ్ల అవసరం లేదు... ఆ పార్టీ అభ్యర్థులను వాళ్లే ఓడించుకుంటరని బాహాటంగానే చెప్పుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు అలర్ట్ అయ్యి జనంలో మెదలాడకపోతే... ఆశలు అడియాశలై... పదవులకు మరో ఐదేండ్లు దూరమై... అని పాట పాడుకోవాల్సిందే. సీఎంల గోల తర్వాతగానీ కలిసి పనిచేయండి కాంగ్రెస్ నేతల్లారా. బీ అలర్ట్.

- అచ్చిన ప్రశాంత్

ఇన్సూరెన్స్ కథనేనా..!

జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారం భాగంలోగా... 'వర్షాల్లో బైకులు కొట్టుకుపోయిన వారికి బైకులు కోనిస్తాం... కార్లు ఆగమైనోళ్లకు కార్లు కొనిస్తాం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని స్థాయిలో ఎంపీ బండి సంజయ్ ఊదరగొట్టిండు. అరె కుషాలుకొద్దీ పోరలు ముగ్గురు కలిసి బైకుల మీద పోతే చలాన్లు వేస్తరా? అవన్నీ రద్దు చేయిస్తామని కూడా చెప్పేశాడు. బాధితులు నిజమో కాబోలు అనుకున్నరు. గిదే విషయంపై మీడియా వాళ్ల బైకులు ఎట్ల కోనిస్తరు... కార్లెట్ల కొనిస్తరు అని గుచ్చిగుచ్చి అడిగితే... 'అరె దానిదేముంది ఇన్సూరెన్స్ ఉంటది కదా! దాని ద్వారా ఇప్పిస్తం' అని నలుగురిలో నవ్వుల పాలైన విషయం తెలిసిందే. ఇగ గది ఒడ్సిపోయిన ముచ్చటైంది. గిప్పుడేమో ఉచితాల జపం అందుకున్నడు. తెలంగాణలో అధికారంలోకి తీసుకొస్తే 'ఉచిత విద్యనందిస్తాం..ఉచిత వైద్యం అందిస్తాం...' అంటూ గల్లీల్లో చిరువ్యాపారులు అరిసినట్టు అరుస్తున్నడు. అరె గిదేంది? కేంద్రంలో అధికారంలో ఉన్నది వీళ్లే కదా! దేశమంతటా ఉచిత వైద్యం..ఉచిత విద్య అందిస్తమని చట్టం చేస్తే అయిపోతది గదా. సబ్బండ వర్గాలు ఆనందపడ్తయి గదా. గిది అయ్యే పనేనా. గా పార్టీకి వెన్నుదన్నుగా నిలిచే కార్పొరేట్లు ఊరుకుంటరా? తమ ధన బలంతోని పువ్వుపార్టీని నలిపేస్తరుగదా! గీ దానిపై బండి అవగాహన లేదనుకోవాలా? లేదు ఉండే ఉంటది. ఎన్నికల తర్వాత ఉచిత వైద్యం.. ఉచిత విద్య ఏది అని ప్రజలు అడిగితే ఇన్సూరెన్స్ కథ చెప్తడేమో. అవును సారు మీ మోడీ సారూ ఉచితాలు వొద్దంటున్నడు గదా? ఏందో ఏమో బండి ఏది మాట్లాడినా అన్నీ ధర్మ సందేహాలే.

- గుడిగ రఘు

వెళ్లిపోతున్నా...!

'వెళ్తున్నా... వెళ్తున్నా... దూరంగావెళ్తున్నా... వెళ్లిపోతున్నా..ఇక నేనెళ్లిపోతున్నా..!', అయ్యో బాలి..బాలి.. నేనున్న బ్యాంకు మరిచి..నేను పడుకున్న లాకర్ మరిచి పోతున్న బాలి..బాలి' అంటూ సోషల్‌మీడియాలో మీమ్స్ తెగ వైరల్ అవుతున్నాయి. ఇంతకు దేని గురించి అనుకుంటున్నారా? గదే రెండువేల రూపాయల నోటు గురించి. నల్లధనాన్ని అరికట్టేందుకు అంటూ మోడీ సర్కారు 2016లో నోట్లను రద్దుచేసింది. పెద్దనోట్లతోనే అవినీతికి ఎక్కువ ఆస్కారం ఉందంటూ ఊదరగొట్టింది. సామాన్యులను అరిగోస పెట్టించింది. చావులకూ కారణమైంది. ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. మరోవైపు పరికించి చూస్తే పెద్దనోట్ల రద్దు కార్పొరేట్లకు ఎంతో ఉపయోగ పడింది. నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి దోహదపడింది. ఇలా నోట్ల రద్దు ఓ ప్రవాసనంగా మారింది. దేశ ఆర్థిక వ్యవస్థకే పెను నష్టదాయకం చేసింది. పెద్దనోట్ల రద్దుతో మొదలైన సామాన్యుల ఆర్థిక కష్టాలు రోజురోజుకీ పెరిగిపోతూనే ఉన్నాయి. ఇందులో టిస్టేంటంటే... ఏడేండ్ల కిందట చిన్న నోట్లను రద్దుచేసి పెద్ద నోటును తీసుకొచ్చారు... ఇప్పుడేమో గ పెద్ద నోటునే రద్దుచేశారు. అసలు ప్రవేశపెట్టుడేంది..రద్దు చేసుడేంది! జనానికేం సమజైతలేదు!


- నిరంజన్ కొప్పు

ముంచుకొస్తున్న ముప్పు 'కాస్ట్ ఆఫ్ లివింగ్'

ప్రపంచం ఒక కుగ్రామంగా మారింది. మనుషులు పెట్టుబడి చదరంగంలో పావులుగా ఉపయోగించ బడుతున్న సందర్భంలో... వాస్తవాలను అందించే అంతర్జాతీయ నివేదికలు, రిపోర్టులు అత్యంత ప్రాధాన్యతను సంతరించు కుంటున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో అన్వేషించి వివిధ దేశాల, ప్రాంతాల, జాతుల వాస్తవ పరిస్థితులను బహిర్గతం చేసే ప్రయత్నాలు చేస్తున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం, ఆక్స్‌ఫామ్ సంస్థ అందరి మన్ననలను పొందుతున్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యు.ఇ.ఎఫ్) తాజాగా వెలువరించిన నివేదిక 'గ్లోబల్ రిస్క్ రిపోర్ట్ 2023' పలు ఆసక్తికర, ఆందోళనకర అంశాలను ప్రపంచం దృష్టికి తెచ్చింది. రానున్న రెండేళ్లలో ప్రపంచాన్ని అత్యంత ఎక్కువగా కుదిపేసేది జీవన వ్యయం ('కాస్ట్ ఆఫ్ లివింగ్') అని, రానున్న దశాబ్ద కాలంలో జీవన ప్రమాణాలను అత్యంత ప్రభావం చేసేది పర్యావరణ మార్పులు అని సోదాహరణలతో రిపోర్టులో పేర్కొన్నది. ఈ అంశాన్ని ఒకసారి నిశితంగా పరిశీలించి భారతదేశ ప్రజల సంపాదనలకు పోల్చి చూసినప్పుడు కొన్ని విషయాలు అర్థమవుతాయి.

ఈ మధ్యకాలంలో కార్ల కంపెనీలకు సంబంధించిన రిపోర్టు ఒకటి వెలువడింది. దాని ప్రకారం చిన్న కార్లు, తక్కువ ధరకు లభించే కార్లకు గిరాకీ బాగా పడిపోయిందని, మధ్యతరగతి పైన అనగా ఎస్‌యువి (స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్) రేంజ్ కార్ల గిరాకీ పెరిగిందని తెలిసింది. ధనవంతులు ధనవంతులుగా, పేదలు పేదలుగా మారే ప్రక్రియకు ఇది చక్కటి ఉదాహరణ. అనగా బాగా సంపాదిస్తున్న వారి సంపాదనలో విపరీతమైన పెరుగుదల ఉంటే, తక్కువ సంపాదిస్తున్న వారి సంపాదనలో తగ్గుదల ఉంది-అని నిరుడు ఆక్స్‌ఫామ్ సంస్థ ఇచ్చిన రిపోర్టును ఇది ధృవీకరిస్తున్నది. నిజానికి ఆర్థిక వ్యవస్థ సమతుల అభివద్ధి సాధిస్తే చిన్న కారుల గిరాకీ పెరగాలి. తద్వారా పారిశ్రామిక అభివృద్ధి కూడా మరింత పెరుగుతుంది. అలా కాకుండా విలాసవంతమైన వస్తువుల వినియోగం పెరిగితే అది విశాల అభివద్ధికి సూచిక కాదు. కోవిడ్ అనంతరం భారతదేశంలో గ్రామ స్థాయిలో ఆహార వస్తువుల వినియోగం పెరిగింది. దీనికి ప్రధాన కారణం వలసలు. పట్టణాల నుండి గ్రామాలకు తిరిగి వెళ్లడంతో అక్కడ ఆహార వస్తువుల వినియోగం పెరిగింది. అందుచేత వరల్డ్ ఎకనామిక్ ఫోరం అభిప్రాయ పడినట్లు రాబోయే రోజుల్లో కాస్ట్ ఆఫ్ లివింగ్ పెరిగే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తున్నది.

ఇక 30ఏండ్ల నుండి అనేక దఫాలుగా అంతర్జాతీయ వేదికలపై వాగ్దానాలు కురిసినప్పటికీ పెరుగుతున్న కార్బన్ ఉద్గారాలను తగ్గించే తక్షణ చర్యలు అభివృద్ధి చెందిన దేశాలలో ఏమాత్రం కనిపించడం లేదు. అందుచేత విపరీతమైన పర్యావరణ మార్పుతో ప్రధానంగా ప్రభావితమయ్యేది ఆఫ్రికా, ఆసియా ఖండాల ప్రజలు. ఎందుకంటే వాతావరణ మార్పులు పారిశ్రామిక ఉత్పత్తులపై ప్రభావం చూపడమే కాకుండా ప్రజల ఆహార వినియోగం ప్రకృతి స్వావలంబన, సమైక్య జీవన విధానంపై కూడా ఎక్కువగా ప్రభావం చూపేవి ఈ ప్రదేశాలలోనే. ఉపాధి సంబంధిత అంశాలపై ఆసక్తి గొలిపే రిపోర్టు ఇది. రానున్న ఐదేండ్లలో ప్రపంచంలోని మొత్తం ఉపాధుల్లో 23శాతం మార్పులు చోటు చేసుకుంటాయని డబ్ల్యుఇఎఫ్ అభిప్రాయపడింది. అనగా సగటున 23శాతం ఉద్యోగాల్లో ఒడిదుడుకులు, తొలగింపులు, వేతన తగ్గింపులు, ఉపాధి సంబంధిత కాంట్రాక్టుల్లో మార్పులు వంటివి సంభవిస్తాయని తెలిపింది. అయితే ఈ రిపోర్టు వెలువడక ముందే గత ఏడాది ప్రపంచ దిగ్గజ సంస్థలు అనేకమంది ఉద్యోగులను రాత్రికి రాత్రి తొలగించాయి. లేదా పీస్ రేట్ సిస్టమ్ అనే విధానంతో పనులు పూర్తి చేయించుకునేలా అంగీకారాలు కుదుర్చు కోవడం మనం చూశాం. మరో ఆసక్తికరమైన అంశం ఏమంటే రానున్న కాలంలో 6.9 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించ బడతాయని, 8.3కోట్ల ఉద్యోగాలు తొలగించబడతాయని రిపోర్టు తెలుపుతోంది. దీన్ని చదివినప్పుడు ఒకింత గందర గోళంగా అనిపిస్తుండవచ్చు. కానీ వాస్తవం ఏమంటే మారుతున్న సాంకేతిక ఇతరత్రా కోణాల దృష్ట్యా ఇప్పుడున్న ఉద్యోగులు చేసే పనికి సరితూగే అవకాశం లేనందువల్ల 8.3కోట్ల మందిని సంస్థలు తొలగించ నున్నాయన్నమాట. వారి స్థానంలో 6.9కోట్ల మందిని నియమించుకోనున్నారు. తొలగించ బడనున్న ఈ 8.3కోట్ల మంది, కుదిరితే తక్కువ స్థాయి ఉద్యోగాలను ఎంచుకోవడం లేదా మరోరకంగా కష్టపడటమే దారిగా కనిపిస్తున్నది. ఇది ఒక ఎత్తయితే రానున్న ఐదేండ్లలో మార్కెట్లోకి ఉపాధి వెతుక్కుంటూ వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నప్పటికీ కేవలం 6.9కోట్ల మందికి మాత్రమే ఉపాధి లభించే అవకాశం ఉందని తెలుస్తుండటం ఆందోళన కలిగించే అంశం.



దశాబ్దం కిందట మన దేశంలో 10లక్షల పైన ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు ఉంటే ఇప్పుడిది ఆరు లక్షలు ఉన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, డిఫెన్స్, రైల్వే ఉద్యోగాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. గత రెండు దశాబ్దాల కిందట విపరీతమైన ఆశావాహంతో ప్రవాహంలా దూసుకొచ్చిన సాఫ్ట్‌వేర్ రంగంలో నియామకాలు ఇప్పుడు బాగా తగ్గిపోయాయి. ఒక్క టిసిఎస్ కంపెనీ గత ఏడాది నాలుగు లక్షల ఉద్యోగులను నియమించుకుంటే ఈ ఏడు కేవలం ఎనభై వేల నియామకాలు మాత్రమే చేపట్టింది. "పెట్టుబడి-లాభదాయకమైన రిటర్న్" అనే కాన్సెప్ట్ అంతర్జాతీయంగా పెరిగింది. మానవాభివృద్ధిపై ఇన్వెస్ట్‌మెంట్ చేయడం లేదు. ఇటువంటి విధానాల వల్ల, ప్రత్యామ్నాయ ఉపాధి ఏర్పాట్లను దేశాల ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. అందుకే ఈ రకమైన ఉపాధి లేమి సమస్య అన్ని దేశాలను పట్టి పీడించే అవకాశం ఉందని రిపోర్టు అభిప్రాయపడింది.

కోవిడ్ మహమ్మారి మిగిల్చిన అభద్రత, అంతం లేకుండా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచ ఆహార, చమురు ధరలను స్థిమితం లేకుండా చేస్తున్నాయి. దాని ప్రభావం వల్ల అనేక దేశాలు రక్షణాత్మక చర్యలకు పాల్పడుతున్నాయని, ఇలాంటి రక్షణాత్మక చర్యల వలన సామాన్య ప్రజల జీవన స్థితి సన్నగిల్లి, ఆర్థిక అసమానతలు మరింత పెరుగుతాయని రిపోర్టు సోదాహరణంగా వివరించింది. రక్షణాత్మక చర్యలతో పాటు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ ఇతరుల ఎదుగుదలను అడ్డుకునే ప్రయత్నాలు ప్రపంచ దేశాల్లో రానున్న రోజుల్లో మరింత ముమ్మరం అవుతాయని ఈ రిపోర్టు తెలిపింది. వీటిని గమనిస్తే ప్రస్తుతం అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ వంటి అనేక దేశాల వ్యవహారాలు మనకు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. ఈ నివేదికను అర్థం చేసుకున్న ప్రభుత్వాలు ప్రధానంగా దృష్టి పెట్టవలసింది ప్రత్యామ్నాయ ఉపాధి ఏర్పాట్లపై. కొత్త స్టార్టప్‌లు, స్వయం ఉపాధి మార్గాలతో పాటు వృత్తి విద్యా విధానాలు అవలంభించడంతో దీన్ని అధిగమించే అవకాశం ఉంది.

దశాబ్దం కిందట మన దేశంలో 10లక్షల పైన ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు ఉంటే ఇప్పుడిది ఆరు లక్షలు ఉన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, డిఫెన్స్, రైల్వే ఉద్యోగాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. గత రెండు దశాబ్దాల కిందట విపరీతమైన ఆశావాహంతో ప్రవాహంలా దూసుకొచ్చిన సాఫ్ట్‌వేర్ రంగంలో నియామకాలు ఇప్పుడు బాగా తగ్గిపోయాయి. ఒక్క టిసిఎస్ కంపెనీ గత ఏడాది నాలుగు లక్షల ఉద్యోగులను నియమించుకుంటే ఈ ఏడు కేవలం ఎనభై వేల నియామకాలు మాత్రమే చేపట్టింది. "పెట్టుబడి-లాభదాయకమైన రిటర్న్" అనే కాన్సెప్ట్ అంతర్జాతీయంగా పెరిగింది. మానవాభివృద్ధిపై ఇన్వెస్ట్‌మెంట్ చేయడం లేదు.

- జి. తిరుపతయ్య

బహిరంగంగా మాట్లాడుకుందాం...

అన్య విగ్... చిన్నప్పటి నుంచి ఉద్యోగం, ఇల్లు, బయట పనులు చూసుకుంటూ ఎప్పుడూ బిజీగా ఉండే తన తల్లిని చూస్తూ పెరిగింది. ఏదో సాధించాలనే కోరికలను మనసులోనే అదిమిపెట్టడం గమనించింది. తాను బాల్యం నుండి యుక్తవయసుకు వచ్చిన తర్వాత ఈ ప్రపంచం మహిళలను చూసే విధానాన్ని అర్థం చేసుకుంది. ఈ సమాజానికి మహిళల సామర్థ్యాల పట్ల అవగాహన లేదని గ్రహించింది. లింగ వివక్ష, మూస పద్ధతులు, శారీరక అడ్డంకుల వల్ల మహిళలు కూడా తమలోని సామర్థ్యాన్ని పూర్తిగా గుర్తించలేక పోతున్నా రనుకుంది. దీనికి రుతుస్రావం ఒక ముఖ్య కారణమని గ్రహించింది. అందుకే దీనిపై అవగాహన కల్పించేందుకు ఒక మిషన్‌ను ప్రారంభించింది. ఈ రోజు రుతు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఆమె చేస్తున్న కృషి గురించి తెలుసుకుందాం...



అన్య తన స్నేహితురాలు సౌమ్య సింఘాల్‌తో కలిసి లింగ సమానత్వం, మహిళా సాధికారత కోసం పనిచేసే 'హర్ హక్' (ఆమె హక్కు) అనే స్వచ్ఛంధ సంస్థను ఢిల్లీలో ప్రారంభించింది. "స్త్రీలను నేను ఏవిధంగా అయితే చూస్తున్నానో ప్రపంచం కూడా అలాగే చూసేలా చేయాలనుకుంటున్నాను. దానికోసమే హర్ హక్ పుట్టింది" అని అన్య చెప్పారు.

యువజన సంఘం ప్రారంభించి

తాను చేసే పని సమాజంపై కొంతైనా ప్రభావం చూపాలని కోరుకుంది అన్య. లాయర్, జర్నలిస్ట్, పోలీసు అధికారి ఇలా ఎన్నో అవ్వాలని ఆమె కలలు కనేది. అయితే కాలక్రమేణా ఈ రంగాల్లో పని చేయకుండానే సమాజంలో తాను కోరుకున్న మార్పును తీసుకురాగలనని ఆమె భావించింది. 2018లో ఢిల్లీ యూనివర్శిటీలోని లేడీ శ్రీ రామ్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో చేరింది. అప్పుడే మహిళల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే తన కలను నెరవేర్చుకోవడం ప్రారంభించింది. అతి తక్కువ సమయంలోనే ఐక్యరాజ్యసమితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2019లో 'గర్ల్స్ అప్ రైజ్ ఇనిషియేటివ్' అనే యువజన సంఘం ప్రారంభించింది.

పీరియడ్స్‌పై అవగాహన లేదు

'గర్ల్స్ అప్ రైజ్ ఇనిషియేటివ్' మహిళల్లో రుతుక్రమ పరిశుభ్రతను ప్రోత్సహించడంపై దృష్టి సారించింది. రుతు పరిశుభ్రత, దాని గురించి అవగాహన పెంపొందించే విషయంలో అమ్మాయిలకు ఆసక్తి లేకపోవడం గుర్తించింది. దానికి కారణం రుతుపరిశుభ్రతకు అనుగుణమైన విద్య లేకపోవడం అని ఆమె గ్రహించింది. "దేశంలో రుతుస్రావ పేదరికం తీవ్రంగా ఉంది. కానీ అది చర్చకు రావడం లేదు. ఇక్కడ సమస్య కేవలం రుతుక్రమ ఉత్పత్తులు అందుబాటులో లేకపోవడమే కాదు, పీరియడ్స్ గురించి అవగాహన లేకపోవడం కూడా" అని అన్య చెప్పారు.

మూడు అంశాలపై కేంద్రీకరించారు

అన్య సెప్టెంబర్ 2022 వరకు రుతుశుభ్ర ప్రోగ్రామ్ కోసం పని చేశారు. అయితే ఆ తర్వాత ఆమె యూత్ కలెక్టివ్‌ను పూర్తి స్థాయి ఎన్‌జీఓగా మార్చాలని, దాని పని మరిన్ని ప్రాంతాలకు విస్తరింపజేయాలని భావించింది. ఇదే 'హర్ హక్' ను స్థాపించడానికి దారితీసింది. ఇప్పుడు 'హర్ హక్' మూడు అంశాలపై పనిచేస్తుంది. అవే రుతు పరిశుభ్రత నిర్వహణ, చట్టపరమైన, ఆర్థిక అక్షరాస్యత. రుతు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడానికి ఎన్‌జీఓ ఢిల్లీ అంతటా ఆఫ్‌లైన్ వర్క్‌షాప్‌లను నిర్వహిస్తుంది. ఈ వర్క్‌షాప్‌లో పీరియడ్స్ సమయంలో పరిశుభ్రత కోసం మహిళలు ఏమి ఉపయోగించాలి, పీరియడ్స్ చుట్టూ ఉన్న అపోహలు, కళంకం, PCOS, ఎండోమెట్రియోసిస్ వంటి పునరుత్పత్తి సమస్యల గురించి చర్చిస్తారు.



రుతు విద్యను అందిస్తున్నాం

"మేము ఈ వర్క్‌షాప్‌లను సరదాగా నడిపించడం కోసం వారి వయసుకు తగ్గట్టు ఆసక్తికరమైన ఆటలను కూడా చేర్చాము" అని అన్య చెప్పారు. గర్ల్ అప్ రైజ్ కింద 8 మార్చి 2021న ప్రారంభించబడిన వారి #SpotTheStigma ప్రచారం కింద వారు మహిళలకు శానిటరీ ప్యాడ్స్, రుతుక్రమ విద్యను అందించారు.

ఇప్పటి వరకు 10 వేలకు పైగా శానిటరీ న్యాప్‌కిన్లు పంపిణీ చేశామన్నారు. 18 ఏండ్లకే సంపాదించడం ప్రారంభించిన అన్య మహిళలు ఆర్థిక వ్యవహారాలను స్వతంత్రంగా నిర్వహించడం, వారి చట్టపరమైన హక్కుల గురించి తెలుసుకోవడం చాలా అవసరమని అభిప్రాయపడ్డారు.

అడ్డంకులు కూడా ఉన్నాయి

అన్య రుతు పరిశుభ్రత గురించి పని చేయడం ప్రారంభించినప్పుడు ప్రజలు ఎన్నో రకాలుగా స్పందించారని ఆమె గుర్తుచేసుకున్నారు. "కొంతమంది మేము చెప్పే విషయాలను స్వీకరించేవారు, రుతుస్రావం గురించి చర్చించడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే కొంత మంది నుండి ప్రతి ఘటనను కూడా ఎదుర్కొన్నాను. నేను వెళ్ళిన కొన్ని పాఠశాలలు పీరియడ్‌లను బహిరంగంగా చర్చించాల్సిన అంశంగా భావించలేదు. వర్క్‌షాప్‌లు తీసుకోవడానికి ఒప్పుకోలేదు" అని అన్య చెప్పారు. అంతే కాదు కొంత మంది ఆమెను నిరుత్సాహ పరిచారు. అయితే ఈ అడ్డంకులేవీ ఆమెను ఆపలేకపోయాయి.

ఆర్థిక అవగాహన కూడా...

"పన్నులు ఎలా ఫైల్ చేయాలి, నా డబ్బును ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి, ఫిక్స్‌డ్ డిపాజిట్ అంటే ఏమిటి, నా భవిష్యత్తును ఎలా ప్లాన్ చేసుకోవాలి వంటి ప్రాథమికమైన వాటిని ఎవరూ నాకు చెప్పలేదు. మహిళలు ఈ పనులను చేయడానికి భర్తలపైనే ఎక్కువగా ఆధారపడతారు. అయితే మహిళలు తమ సంపాదనపై మరింత నియంత్రణ కలిగి ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. దీనివల్ల వారు తమ భవిష్యత్తును ప్లాన్ చేసుకోవచ్చు" అంటారు అన్య.

వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ...

హిళల్లో చట్టపరమైన, ఆర్థిక అక్షరాస్యతను వ్యాప్తి చేయడానికి సంస్థ ఆఫ్‌లైన్ వర్క్‌షాప్‌లను కూడా నిర్వహిస్తోంది. అలాగే వ్యక్తిగత ఆర్థిక, బడ్జెట్, పన్ను ప్రణాళిక, సైబర్ నేరాలు, లైంగిక వేధింపుల చట్టాలతో సహా వివిధ అంశాలపై వర్క్‌షాప్‌లను నిర్వహించడానికి నిపుణులను తీసుకువస్తుంది. వారు విద్యార్థుల రుణాలు, స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేయడానికి సంబంధించిన సెమినార్‌లను కూడా నిర్వహిస్తారు. 80 మందికి పైగా వాలంటీర్లతో పాటు సుమారు 500 మంది నిపుణులు బయట నుండి వచ్చి వర్క్‌షాప్‌లో అవగాహన కల్పిస్తారు. ఈ ఏడాది మార్చి నెలలో ఎన్‌జీఓ ఢిల్లీలోని యునైటెడ్ స్టేట్స్ ఎంబసీ సహకారంతో POSH వర్క్‌షాప్ నిర్వహించింది.

దెబ్బతినేందుకు సిద్ధంగా ఉండండి

"మీరు గాజు పైకప్పును పగలగొట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లయితే, గాజు కూడా పడిపోతుంది. కాబట్టి దెబ్బతినడానికి సిద్ధంగా ఉండండి. అంటే మనం కనిపించని సంకెళ్ళను తెంచేందుకు పూనుకుంటే సమాజం దానికి పూర్తి మద్దతు ఇవ్వదు. కాబట్టి కొన్ని ఎదురు దెబ్బలు తప్పవు. వాటిని భరించడానికి సిద్ధంగా ఉంటేనే అనుకున్న లక్ష్యం చేరగలం' అని ఆమె అంటుంది. ఈ రోజు రుతు పరిశుభ్రత దినోత్సవం కాబట్టి అన్య ఢిల్లీలో ఆఫ్‌లైన్ డ్రైవ్ నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చింది. కనీసం 800 శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. "ప్రతి స్త్రీకి వినిపించే ఆదర్శవంతమైన ప్రపంచాన్ని నేను సృష్టించాలనుకుంటున్నాను. ఆ కలను నిజం చేయడానికే 'హర్ హక్' వేస్తున్న ఒక చిన్న అడుగు" అంటూ ఆమె తన మాటలు ముగించింది.





- సలీమ

జూన్ 26 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్

(మొదటిపేజీ తరువాయి)

అవకాశముందని తెలిపారు. జులై 12న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. అదేనెల 12 నుంచి19వ తేదీ వరకు ఫీజు చెల్లింపు, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. జులై 21 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. అదేనెల 21,22 తేదీల్లో ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ వంటి ప్రక్రియను చేపట్టేందుకు అవకాశముందని వివరించారు. అదేనెల 23న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. జులై 21 నుంచి 24వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియను చేపట్టాలని కోరారు. అదేనెల 28న రెండో విడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. అదేనెల 28 నుంచి 31వ తేదీ వరకు ఫీజు చెల్లింపుతోపాటు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

ఆగస్టు 2 నుంచి తుదివిడత కౌన్సెలింగ్

ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఆగస్టు రెండో తేదీ నుంచి తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియను చేపడతామని నవీన్ మిట్టల్ తెలిపారు. అదేనెల మూడో తేదీన ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, నాలుగో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. ఆగస్టు ఏడో తేదీన తుదివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. అదేనెల ఏడు నుంచి తొమ్మిదో తేదీ వరకు ఫీజు చెల్లింపుతోపాటు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. ఆయా తేదీల్లోనే అభ్యర్థులకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. అదేనెల ఎనిమిదో తేదీన స్పాట్ అడ్మిషన్ల కోసం మార్గదర్శకాలను విడుదల చేస్తామని తెలిపారు. గతేడాది ఏ ర్యాంకు వారికి ఏ కాలేజీలో సీటు వచ్చిందన్న వివరాలను www.://tseamcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. వచ్చేనెల 21 నుంచి పూర్తిస్థాయి నోటిఫికేషన్‌తోపాటు తాజా మార్గదర్శకాలు ఆ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. అభ్యర్థులు, తల్లిదండ్రులు కౌన్సెలింగ్‌కు అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని కోరారు.

సిలబస్ నుంచి తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

యూనివర్శిటీ ఉప కులపతి ప్రొఫెసర్ యోగేశ్ సింగ్ మాట్లాడుతూ దేశ విభజనకు పునాది వేసినవారి గురించి సిలబస్‌లో ఉండకూడదన్నారు. 1,014వ అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి, ఇక్బాల్‌పై అధ్యాయాన్ని తొలగించాలని నిర్ణయించినట్టు తెలిపారు. అకడమిక్ కౌన్సిల్ మెంబర్ ఒకరు వార్తా సంస్థతో మాట్లాడుతూ ఢిల్లీ యూనివర్శిటీ ఉప కులపతి చేసిన ప్రతిపాదనను అకడమిక్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినట్టు తెలిపారు. అండర్‌గ్రాడ్యుయేట్ కరికులం ఫ్రేమ్‌వర్క్, 2022 క్రింద వివిధ కోర్సుల్లో 4వ, 5వ, 6వ సెమిస్టర్ల సిలబస్ కోసం ఈ సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్, తదితరుల గురించి బోధించాలని తెలిపారు. పొలిటికల్ సైన్స్ సిలబస్ నుంచి ఇక్బాల్‌పై పాఠాన్ని తొలగించాలని నిర్ణయించినట్టు తెలిపారు. స్టాండింగ్ కమిటీ సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. దేశ విభజన, హిందుత్వం, గిరిజనులపై అధ్యయనాలకు ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను కూడా ఆమోదించినట్లు తెలిపారు. దేశ విభజనపై అధ్యయనానికి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ఐదుగురు కౌన్సిల్ సభ్యులు వ్యతిరేకించినట్టు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో దారుణం

(మొదటిపేజీ తరువాయి)

మిల్లుకు వెళ్లేందుకు డ్రైవర్ రివర్స్ తీశాడు. ఈ క్రమంలో అక్కడే పడుకున్న మొండయ్యపై తాడిపత్రి ఉండటంతో కనిపించక అతని పైనుంచి ట్రాక్టర్ వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన మొండయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఎల్ఎండి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రైతు కుమార్తె రాయినిపట్ల లలిత ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ ఉప్పులేటి పోచయ్య, యజమాని రాజు, ఐకేపీ ఇన్‌చార్జి మనోహర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

కలిసి పనిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ, పియూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, నారాయణ్ రాణె, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ 2047లో వికసిత్ భారత్‌ను సాధించేందుకు ఉమ్మడి దృక్పథాన్ని రూపొందించే ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఆదర్శ్ అమృత్ కాలాన్ని నిర్ధారించడానికి కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు టీమ్ ఇండియాగా కలిసి పనిచేయాల్సిన అవసరముందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య సమాన భాగస్వామ్యానికి నిటి ఆయోగ్ ఒక వేదికను అందిస్తుందని, తద్వారా దేశంలో సహకార, పోటీ సమాఖ్యవాదాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. కోఆపరేటివ్ ఫెడరలిజాన్ని బలోపేతం చేసేందుకు నిటి ఆయోగ్ ఆకాంక్షాత్మక జిల్లాల కార్యక్రమం (ఏడీపీ) వంటి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఏడీపీ లో చురుగ్గా పాల్గొన్నందుకు రాష్ట్రాలను కూడా ఆయన అభినందించారు. ఆకాంక్షాత్మక జిల్లాల కార్యక్రమం విజయవంతం కావడంతో నిటి ఆయోగ్ ఆకాంక్షాత్మక బ్లాక్ (ఏబీపీ)ల కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ప్రేరేపించిందని మోడీ పునరుద్ఘాటించారు.

అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంలో భాగంగా మిల్లెట్ కార్యక్రమంలో రాష్ట్రాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. శ్రీ అన్న అనేది పర్యావరణ అనుకూల పంట, రైతుకు అనుకూలమైన ఒక సూపర్ ఫుడ్ అని అన్నారు. దేశ అవసరాలను తీర్చడానికి దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించి, చమురు ఉత్పత్తిలో ఆత్మనిర్భర్‌గా మారవలసిన అవసరాన్ని ప్రధాని మోడీ తెలిపారు. రాష్ట్రాలు 50 వేల పైబడి అమృత్ సరోవర్లను నిర్మించడాన్ని ప్రధాని మోడీ ప్రశంసించారు. రాష్ట్రాలు ఆర్థికంగా పటిష్టంగా మారేందుకు, ప్రజల కలలను నెరవేర్చే కార్యక్రమాలను అందజేయడానికి వీలుగా రాష్ట్రాలు ఆర్థికంగా వివేకవంతమైన నిర్ణయాలు తీసుకోవాలని మోడీ కోరారు. దాదాపు 1,600 లేయర్‌ల డేటాతో గతి శక్తి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్టార్‌లో సాక్ష్యం-ఆధారిత విధాన రూపకల్పనను నిర్ధారిస్తుందనీ, ఇది సమర్థవంతమైన సామాజిక-ఆర్థిక ప్రణాళిక, ప్రాంత అభివృద్ధి విధానాన్ని అనుసరించడాన్ని కూడా నిర్ధారిస్తుందని తెలిపారు.

పది రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైర్హాజరు

(మొదటిపేజీ తరువాయి)

రామయ్య (కర్నాటక), పినరయి విజయన్ (కేరళ), నవీన్ పట్నాయక్ (ఒరిస్సా), భగవంత్ మాన్ (పంజాబ్), అశోక్ గెహ్లాట్ (రాజస్థాన్), ఎంకె స్టాలిన్ (తమిళనాడు), మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్) గైర్హాజరు అయ్యారు. ముందస్తుగా నిర్ణయించిన కార్యక్రమాల నేపథ్యంలో తాను సమావేశానికి రాలేనని బీహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, తెలంగాణ సీఎం కేసీఆర్ తెలిపారు. నవీన్ పట్నాయక్‌కు అక్కడ ముందస్తు కార్యక్రమాలు ఉన్నాయనీ, అందుకే ఆయన సమావేశానికి హాజరు కావడం లేదని ఒరిస్సా సీఎంఓ తెలిపింది. ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసులు, బదిలీల విషయమై కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిన నేపథ్యంలో నిటి ఆయోగ్ నిర్వహించే సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. దేశంలో సహకార సమాఖ్య వ్యవస్థ ఒక పరిహాసంగా మారిందని ఆయన విమర్శించారు. సమావేశానికి తాను రాలేనని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. అయితే, తమ రాష్ట్రం తరపున రాష్ట్ర ఆర్థిక మంత్రి, చీఫ్ సెక్రటరీని పంపించేందుకు అనుమతినివ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

ఈ అభ్యర్థనను కేంద్రం తిరస్కరించింది. నిధుల కేటాయింపు విషయంలో పంజాబ్ పై కేంద్రం వివక్ష చూపిస్తోందని ఆరోపిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఈ సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అనారోగ్య కారణాల రీత్యా నిటి ఆయోగ్ సమావేశానికి రావట్లేదని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ప్రకటించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సింగపూర్, జపాన్ పర్యటనలో ఉన్నారు. దీంతో ఆయన కూడా సమావేశానికి హాజరుకాలేదు. కర్నాటకలో నేడు క్యాబినెట్ విస్తరణ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హాజరు కాలేదు. కేరళ సీఎం పినరయి విజయన్ కూడా ఈ భేటీకి హాజరుకాలేనని ప్రకటించారు.

నేడు కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ్ సింగ్, మాజీ ప్రధాని హెచ్ డి దేవగౌడ, సీనియర్ మంత్రులు పాల్గొంటారు. పూజా కార్యక్రమాలు పూర్తికాగానే అందరూ కలిసి లోక్‌సభ, రాజ్యసభ ప్రాంగణాలను పర్యవేక్షిస్తారు. ఉదయం ఏడింటికి హెూమం, ఆ తరువాత సర్వ మత ప్రార్థనలు జరుగుతాయి. ఉదయం 9:30 గంటల కల్లా తొలి విడత ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తవుతుంది. అనంతరం హెూమం వేదిక వద్దే తమిళనాడు తంజావూరు శైవ మత పెద్దలు చోళుల రాజదండమైన సెంగాల్‌ని ప్రధాని నరేంద్ర మోడీకి అందజేస్తారు. లోక్‌సభ ఛాంబర్‌లో స్పీకర్ కుర్చీ వద్ద రాజదండాన్ని (సెంగాల్) ప్రతిష్ఠిస్తారు. మధ్యాహ్నం రెండో విడత కార్యక్రమం మొదలవుతుంది. మధ్యాహ్న కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ ప్రసంగం ఉంటుంది. రాజ్యసభ చైర్మెన్ జగ్దీప్ ధన్‌కర్ తరపున అభినందన సందేశాన్ని ఆయన చదివి వినిపిస్తారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లిఖితపూర్వక సందేశాన్ని కూడా ఇదే సందర్భంగా సభలో వినిపిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రూ.75 నాణేన్ని, ఒక స్మారక తపాలా బిళ్లను ప్రధానమంత్రి విడుదల చేస్తారు. ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే 20 పార్టీలు బహిష్కరించాయి. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో పాటు వైసీపీ, టీడీపీ, ఎస్ఏడీ, జేడీఎస్, బీఎస్పీ తదితర పార్టీలు పాల్గొంటాయి.

దేశాధ్యక్షురాలు ద్రౌపది ముర్ము, ఉపాధ్యక్షుడు జగదీప్ ధంఖర్, మాజీ దేశాధ్యక్షుడు రామ్‌నాథ్ కోవింద్ లకు ఆహ్వానం అందలేదు. గిరిజన, దళిత నేతలైన తాజా, మాజీ దేశాధ్యక్షులు ద్రౌపది ముర్ము, రామ్ నాథ్ కోవింద్‌లను ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ఆహ్వానించలేదు.

కేరళ రబ్బరు రైతుల రాజ్‌భవన్ మార్చ్

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి డాక్టర్ విజూ కృష్ణన్, రిసెప్షన్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వి జాయ్, ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి వాల్సన్ పనోలి తదితరులు ప్రసంగించారు. ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల రబ్బరు, ఇతర వాణిజ్య పంటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆసియన్ దేశాలతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల రబ్బరు, ఇతర వాణిజ్య పంటల రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారని చెప్పారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక రబ్బరు బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంటగా రబ్బరు గుర్తించాలని, కిలోకు రూ.300 కనీస ధరగా నిర్ణయించాలని కోరారు. పన్నులు లేని రబ్బరు దిగుబమతులను నిలిపివేయాలని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని, రబ్బరు వ్యవసాయానికి సబ్సిడీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు వ్యతిరేకంగా ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్న భారీ టైర్ తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.

హద్దులు దాటుతున్న కేంద్రం ఆగడాలు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికైన ఆప్ ప్రభుత్వంపై లెఫ్టినెంట్ గవర్నర్‌ను పెట్టి... ఊపిరాడకుండా చేస్తున్నారని కేసీఆర్ విమర్శించారు. ఈ విషయంలో కూడా కేజ్రీవాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందనీ, సీజేతో కూడిన ఐదుగురు సభ్యుల మెజార్టీ బెంచ్... ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం కిందనే అధికారులు పని చేయాలంటూ స్పష్టమైన తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. గెలిచిన ప్రభుత్వాన్ని పని చేయనివ్వకపోవటం, లెఫ్టినెంట్ గవర్నర్‌ను తీసుకొచ్చి కూర్చోబెట్టటం నియంతృత్వమని విమర్శించారు. సుప్రీం తీర్పునకు సైతం అతీగతీ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ, దానికి వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్ చేసిన ఉద్యమాలను ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. ఢిల్లీలో తెచ్చిన ఆర్డినెన్సును తక్షణం ఉపసంహరించుకోవాలని కేసీఆర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తామందరం కేజ్రీవాల్ తరపున నిలబడతామనీ,ఆయనకు మద్దతునిస్తామని స్పష్టం చేశారు. ఆర్డినెన్సు బిల్లు రూపంలో ముందుకొచ్చినప్పుడు లోక్‌సభ, రాజ్యసభల్లో బీఆర్ఎస్‌కు ఉన్న శక్తినంతా ఉపయోగించి దాన్ని పాస్ కాకుండా అడ్డుకుంటామని తేల్చి చెప్పారు. రైతుల పోరాటంతో నల్ల చట్టాలను వాపస్ తీసుకున్నట్టుగానే ఇప్పటి ఆర్డినెన్సును కూడా ఉపసంహరించుకోవాలనీ, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని మోడీ సర్కార్‌ను హెచ్చరించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం : భగవత్‌మాన్‌సింగ్

కేసీఆర్ చెప్పినట్టుగా దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం చేయాలని పంజాబ్ సీఎం భగవత్‌మాన్‌సింగ్ తెలిపారు. గవర్నర్ వ్యవస్థను బీజేపీ పూర్తిగా దుర్వినియోగం చేస్తోందని చెప్పారు. రాజ్‌భవన్లు బీజేపీ ఆఫీసుల్లాగా మారిపోయాయని ఎద్దేవా చేశారు. గతంలో కేంద్రం తెలంగాణ బిల్లును ఆపింది.. ఇప్పటి మోడీ సర్కార్ గవర్నర్ చేత మా బిల్లులను నిలుపుదల చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆర్డర్ తీసుకున్న తర్వాతే తాము బడ్జెట్‌ను ప్రవేశపెట్టగలిగామనీ, అంతటి దుస్థితిలో దేశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాలన్నీ కలిసి కట్టుగా పోరాడటం ద్వారా సమాఖ్య వ్యవస్థను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇది యావత్ దేశ సమస్య : కేజ్రీవాల్

(మొదటిపేజీ తరువాయి)

సైతం గౌరవించటం లేదని అన్నారు. అలాంటప్పుడు న్యాయం కోసం ఎవరి దగ్గరికెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రజలకు న్యాయం జరిగేంత వరకూ పోరాడుతామని చెప్పారు. ప్రతిపక్ష ప్రభుత్వాలు అధికారంలో ఉన్న చోట ఈడీ, సీబీఐలను ప్రయోగించటం బీజేపీకి ఆనవాయితీగా మారిందన్నారు. దేశంలో మోడీ సర్కార్ నియంతృత్వం కొనసాగుతోందనీ, అందుకే రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా మద్దతు కోరుతున్నామని అన్నారు. రాజ్యసభలో బీజేపీకి మెజార్టీ లేదనీ, విపక్షాలన్నీ కలిసి ఆర్డినెన్సును, దాని తర్వాత వచ్చే బిల్లును పాస్ కాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. తమ పోరాటానికి మద్దతు ప్రకటించిన కేసీఆర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రోళ్లు పగిలేలా...

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రోహిణి కార్తెలో రోళ్లు పగిలేలా ఎండలు మండిపోతున్నాయి. ఈ వారం రోజులు మరింత పెరిగే అవకాశముంది. వడగాల్పులు కూడా ఎక్కువయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల గాలిలో తేమ శాతం తక్కువైపోతున్నది. చాలా ప్రాంతాల్లో గాల్లో తేమ 50 శాతం లోపే ఉంటుండటంతో ఉబ్బరం ఎక్కువ అనిపిస్తున్నది. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్, ప్లానింగ్ సొసైటీ(టీఎస్‌డీపీఎస్) నివేదిక ప్రకారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో 46.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం ఈ ఏడాది ఇప్పటిదాకా ఇదే అత్యధికం. 45 డిగ్రీలు ఉష్ణోగ్రతలు దాటిన ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే. సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, కొమ్రంభీం అసిఫాబాద్, ఖమ్మం జిల్లాలు రెడ్ అలర్ట్ జోన్‌లో ఉన్నాయి. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలున్న ప్రాంతాల్లో ఎక్కువ సేపు ఎండకు గురికావడం, పనులు చేయడం వలన అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశముందని వాతావరణ శాఖ సూచించింది.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై విద్యార్థుల్లో అవగాహన

- గవర్నర్‌తో రఘురాం భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనివర్సిటీ విద్యార్థులకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరముందని కిమ్స్-ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీసెస్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ రఘురాం తెలిపారు. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్‌ను ఆయన కలిశారు. విశ్వవిద్యాలయాల్లో అవగాహనా కార్యక్రమాలకు అవకాశమివ్వాలని కోరగా, గవర్నర్ సమ్మతించారు. ఈ సందర్భంగా రఘురాం పింక్ కనెక్షన్ 33వ త్రైమాసిక సంచికను గవర్నర్‌కు అందజేశారు. ఫౌండేషన్ చేస్తున్న సేవలను గవర్నర్ కొనియాడారు.

యోగా మహోత్సవ్‌లో...

అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 25 రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమాల పరంపరలో శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్, కేంద్ర ఆయూష్ మొరార్జీ దేశాయ్ పాల్గొన్నారు.

బదిలీలు,పదోన్నతులపై సీఎం కేసీఆర్ జోక్యం చేసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. హైకోర్టులో ఉన్న స్టేను ఎత్తేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. జూన్ 12లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ అంశాలకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఆయన దీక్ష చేపట్టారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు చేపట్టిన ఈ దీక్షకు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరమైనా పాఠశాల విద్య ఉత్తేజంగా ఉన్నతంగా ముందుకు పోతుందని భావించామని చెప్పారు. కానీ ప్రకటించిన బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ హైకోర్టు స్టే వల్ల ఆగిపోయిందన్నారు. ఇది చాలా విచారాన్ని కలిగించిందని అన్నారు. షెడ్యూల్ ప్రకటించిన అధికారులు వెంటనే అవసరమైన చర్యలు తీసుకుని బదిలీలు, పదోన్నతులపై స్టేను ఎత్తేసేందుకు ప్రయత్నించి పూర్తి చేయాలని కోరారు. కానీ తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. దానికి నిరసనగానే దీక్ష చేపట్టానని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని హైకోర్టులో ఉన్న స్టేను ఎత్తేయించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూళ్లు ఏర్పాటై పదేండ్లవుతున్నదని చెప్పారు. ఎక్కడ పనిచేసే వారు అక్కడే ఉన్నారని అన్నారు. సగానికి ఎక్కువ ప్రిన్సిపాల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వాటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పూర్తి చేయాలని కోరారు. ఒక ఉపాధ్యాయుడు లేదా ఉద్యోగి దశాబ్దానికిపైగా ఒకే దగ్గర పనిచేస్తే స్తబ్ధత వస్తుందన్నారు. కలెక్టర్, ఎస్పీ, ఎస్సైలను మూడేండ్లకే బదిలీ చేస్తారని గుర్తు చేశారు. బదిలీలు, పదోన్నతులు బడులు బాగుపడేందుకేనని అన్నారు. ఇది పాఠశాల విద్య అభివృద్ధి చెందడానికే ఉపయోగపడుతుందని, ఉపాధ్యాయుల సమస్య మాత్రమే కాదని వివరించారు. పీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, జీతం ప్రతినెలా ఒకటో తేదీన రాకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, గెస్ట్ లెక్చరర్లకైతే ఐదారునెలలుగా జీతాలు పెండింగ్ లో ఉంటున్నాయని అన్నారు. ఎయిడెడ్ టీచర్లకు మార్చి, ఏప్రిల్ జీతాలు ఇంకా రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీతాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఒకటో తేదీన జీతాలను చెల్లించాలని కోరారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఈనెల 31లోగా చెల్లింపులు పూర్తి చేయాలని సూచించారు. 475 కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కనీస వేతనాల్లేవని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి మినిమం బేసిక్ పే ఇవ్వాలని కోరారు. కేజీబీవీల్లో కేర్‌టేకర్‌ను నియమిస్తే నైట్‌డ్యూటీలుండబోవని స్పష్టం చేశారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, వచ్చే విద్యాసంవత్సరమైనా ఉత్తేజంగా, ఉన్నతంగా, ఉత్సాహంగా ముందుకెళ్లేందుకు తోడ్పడాలని ఆకాంక్షించారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు : ఉపాధ్యాయ సంఘాల నేతలు

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదని ఉపాధ్యాయ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి వారు సంఘీభావం ప్రకటించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఈ సెలవుల్లోనే విద్యాశాఖ చర్యలు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, నాయకులు పి మాణిక్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ల సంఘం అధ్యక్షులు పి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, ఎంఎస్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శి మహేశ్, తెలంగాణ పౌర స్పందన వేదిక నాయకులు రవికుమార్, సురేష్, ఎంఎకె దత్తు, మస్తాన్‌రావు, బీటీఎఫ్ నాయకులు యాదగిరి, సీఐటీయూ నాయకులు ప్రసాద్ డిమాండ్ చేశారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టకపోయినా, ఖాళీ పోస్టులు భర్తీ చేయక పోయినా ప్రభుత్వ విద్యారంగం ఉనికి కోల్పోయే ప్రమాదముందన్నారు. ఆ రంగాన్ని కాపాడుకునేందుకు సంఘాలన్నీ ఏకమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం వర్సెస్ మాజీ సీఎం

త్రిపుర బీజేపీలో ఆధిపత్య పోరు

- విప్లవ్ దేవ్, మాణిక్ సాహాల మధ్య విభేదాలు
- అధికార పార్టీకి తలనొప్పిగా తాజా పరిస్థితులు

అగర్తల : ఈశాన్య రాష్ట్రం త్రిపురలో అధికార బీజేపీకి కొత్త తల నొప్పి ఎదురైంది. బీజేపీ సీనియర్ నాయకుడు, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్, ప్రస్తుత సీఎం మాణిక్ సాహాల మధ్య పొసగటం లేదు. వారి మధ్య విభేదాలు బీజేపీలో సంక్షోభాన్ని తీసుకొచ్చే పరిస్థితులు కనిపిస్తున్నా యని రాజకీయ విశ్లేషకులు తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీ తన బలాన్ని పెంచుకోవాల ని ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ఇప్పుడు ఈ ఇద్ద రి నేతల మధ్య పెరుగుతున్న విభేదాలు బీజేపీకి తీవ్ర నష్టం కలిగించొచ్చని పరిశీలకు లు భావిస్తున్నారు. 2018లో అప్పటి త్రిపుర ముఖ్యమంత్రిగా ఉన్న విప్లవ్‌కుమార్ దేవ్.. మాణిక్ సాహాను కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి చేర్చుకున్నారు. అనంతరం వీరిద్ద రు సన్నిహిత మిత్రులుగా మెలిగారు. ఆ తర్వాత మాణిక్ సాహా.. విప్లవ్‌దేవ్‌కు విధేయుడిగా కొనసాగారు. అనంతరం పార్టీ శ్రేణుల ద్వారా ఎదిగి.. 2022 మేలో విప్లవ్‌ను బీజేపీ అధిష్టానం సీఎం కుర్చీ నుంచి అకస్మాత్తుగా దించి ఆయన స్థానాన్ని మాణిక్ సాహాతో భర్తీ చేయించే స్థాయికి వచ్చారు. అప్పటి నుంచి వేగంగా మారిన రాజకీయ పరిణామాలు మాణిక్ సాహాకు అనుకూలంగా మారాయి. ఉప ఎన్నికల్లో విజయాల ద్వారా ముఖ్యమంత్రి పదవిని సాహా సుస్థిరం చేసుకున్నారు. 2023 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నేతృత్వంలో పార్టీ విజయం సాధించటం ద్వారా అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడి గా ఎదిగాడని విశ్లేషకులు వివరించారు.

ఇద్దరి మధ్య మాటల యుద్ధం

రాజ్యసభ సభ్యుడిగా, హర్యానా పార్టీ యూనిట్ ఇంచార్జీగా విప్లవ్ దేవ్ త్రిపురకు దూరంగా ఢిల్లీ, హర్యానాలో ఉండాల్సిన పరిస్థితులు వచ్చాయి. అయితే ఈనెల 10న త్రిపురలోని గోమతి జిల్లాలో జరిగిన సంస్థాగత సమావేశంలో సీఎం మాణిక్ సాహా మాట్లాడుతూ.. "ప్రభుత్వం వచ్చే ఐదేండ్లు మాత్రమే కాదు.. చాలా కాలం పాటు అధికారంలో కొన సాగాలి. నేను లేకుండా త్రిపుర నడవదు అనుకోవడం మూర్ఖత్వం. 4-5 ఏండ్ల ముఖ్యమంత్రి ఎలా అదృశ్యమయ్యారో మనం చూశాం" అని ఆయన అన్నారు. అయితే, ఇది విప్లవ్ దేవ్‌ను ఉద్దేశించి అన్న మాటలుగా విశ్లేషకులు భావించారు. ఆ తర్వాత కొన్ని రోజులకు స్పందించిన విప్లవ్ దేవ్.. " 'బాహ్య ప్రభావం'తో ఒక వర్గం 'బయటి వ్యక్తులు' త్రిపురలో బీజేపీని బలహీనపరుస్తున్నారు. పరిస్థితిని పార్టీ హైకమాండ్‌కు తెలియజేశాను" అని అన్నారు. సీఎంకు కౌంటర్‌గానే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని విశ్లేషకులు తెలిపారు. త్రిపుర బీజేపీలో ఇద్దరు కీలక నాయకుల మధ్య నెలకొన్న మాటల యుద్ధం, ఆధిపత్యపోరు రానున్న రోజుల్లో ఆ పార్టీకి తీవ్ర నష్టాన్ని తీసుకొస్తుందని అంచనా వేస్తున్నారు.

ఉపకారవేతనం 15 శాతం పెంపు.. టీజూడా కృతజ్ఞతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హౌస్ సర్జన్లు, పీజీలు, సీనియర్ రెసిడెంట్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి ఉపకార వేతనాన్ని 15 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2023 జనవరి 1 నుంచి ఈ పెంపు వర్తిస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సలహాదారు డాక్టర్ ఎం.రాజీవ్, అధ్యక్షులు డాక్టర్ కౌశిక్, నాయకులు డాక్టర్ అఖిల్, డాక్టర్ కర్ణిణి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ మద్దతుదారులను అభినందించారు.

చదువు మరింత భారం..!



ఈ ఏడాది 20శాతం పెరిగిన నోట్‌బుక్స్ ధరలు

- లాంగ్ నోట్ బుక్స్ కేజీ రూ.140
- ఒక్కొక్క స్మాల్ నోట్ బుక్‌పై రూ.10-12 పెరుగుదల
- సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు షాక్..
- వచ్చే విద్యా సంవత్సరంలో ఫీజు చెల్లింపులూ పెనుభారమే..
- ప్రభుత్వ విద్యార్థులకు లభించనున్న ఊరట
- పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌బుక్స్ అందజేత

చదువు ఏటేటా భారమవుతోంది.. ఏయేటికాయేడు పెరుగుతున్న ఫీజులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ధరలతో విద్యార్థుల తల్లిదండ్రులు పరేషాన్ అవుతున్నారు. ఈ ఏడాది నోట్‌బుక్స్ ధరలు దాదాపు 20శాతం పెరిగాయి. కరోనాకు ముందుతో పోల్చి చూస్తే ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్ వంటి స్టేషనరీ ధరలు పెరగడంతో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, ధరలు పెరిగి ఇబ్బందులు పెడుతున్న వేళ.. స్కూల్ స్టేషనరీ రేట్లు పెరగడం తల్లిదండ్రులకు మరింత భారంగా మారింది. మరోవైపు ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు సర్కారు ఉచితంగా నోట్‌బుక్స్ అందించేందుకు కసరత్తు చేస్తుండటంతో వారికి ఊరట లభించనుంది. ప్రభుత్వ స్కూల్స్‌లో 24 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ అందజేయనున్నట్టు పాఠశాల విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలియజేసిన విషయం విదితమే.

నవతెలంగాణ- సిటీబ్యూరో

అడ్డగోలుగా ఫీజు దోపిడీ

రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 30,049, ప్రయివేటు స్కూళ్లు 10549 ఉన్నాయి. వీటిల్లో 58.10లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఫీజులతోపాటు బుక్స్ ధరలు పెరుగుతుండటం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థికభారం అవుతోంది. పాఠశాలలు గతేడాది కంటే ఈసారి 20శాతం నుంచి 30శాతం వరకు ఫీజులు పెంచుతున్నాయని తెలుస్తోంది. నగరానికి చెందిన రమణ అనే వ్యక్తి.. తమ బాబుకి ఓ మిషనరీ స్కూల్‌లో ఒకటో తరగతిలో అడ్మిషన్ తీసుకోగా.. అతనికి ఏడాది ఫీజు రూ.47వేలు, డోనేషన్‌కి రూ.5వేలు, స్కూల్ యూనిఫామ్స్‌కి రూ.3వేలు, బుక్స్‌కి రూ.4600, రెండు జతల షూస్‌కు రూ.1500, బ్యాగ్‌కు రూ.1000, ట్రాన్స్‌పోర్టు కోసం నెలకు రూ.2వేల వరకు ఖర్చు అవుతున్నట్టు చెప్పారు.

ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ వంటి వాటిల్లో సైతం ఫీజుల మోత మోగుతోంది. ఆయా యాజమాన్యాలు నిర్ణయించిన ఫీజులే ఫైనల్‌గా చెబుతున్నారు. లేదంటే మరో స్కూల్లో అడ్మిషన్ తీసుకోవాలని సూచిస్తున్నట్టు పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. స్కూల్ ఫీజుల నియంత్రణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అవి గడపదాటడం లేదు. కమిటీలు వేస్తున్నా అవి ఇచ్చిన నివేదికలను ప్రభుత్వం చర్చించి ఆమోదించే పరిస్థితి కనిపించడం లేదు. అంతా ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్ ఇష్టారాజ్యంగా మారింది. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ పెంచి ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్ల ఆగడాలకు చెక్‌పెట్టాలని తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నోట్‌బుక్స్ ప్రియం..

వచ్చే నెల 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. నోట్ బుక్స్‌తో పాటు ఇతర స్టేషనరీ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని షాపు నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో చాలామంది ముందుగానే నగరంలోని కోఠి, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, పారిశ్రామిక వాడల్లో బుక్ స్టోర్స్‌తోపాటు చోటా, మోటా స్టేషనరీ షాపులకు పరుగులు తీస్తున్నారు. పాఠశాలలు ప్రారంభానికి ముందు కొంటే తక్కువ ధరలకు వస్తాయనుకుంటున్న ప్రజల బలహీనతలను సొమ్ముచేసుకుంటూ వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి అమ్ముకుంటున్నారు. ఇదేందని అడిగితే కరోనాకు ముందు పేపర్ రేట్ రూ.70 నుంచి 100 లోపే ఉండేదని, ఇప్పుడది రూ.200 ఎగబాకిందని చెబుతున్నారు. ఫలితంగానే 20శాతం మేర ధరలు పెరిగాయని వివరిస్తున్నారు. దీంతో లాంగ్ నోట్‌బుక్స్ ధరలు గతేడాది కిలో రూ.100-110, కరోనాకు ముందు రూ.80వరకు ఉండేది. పేపర్ రేట్ పెరగడంతో ఈసారి ప్రస్తుతం కేజీకి రూ.140కి పెరిగిందని, మరో నాలుగైదు రోజుల్లో మరో 20 రూపాయలు పెరగనుందని వ్యాపారులు చెబుతున్నారు.

కేజీకి 300 పేజీల బుక్స్ తూకం వేస్తే రెండు మాత్రమే వస్తుండగా.. 200 పేజీలవి మూడు, 100 పేజీలవి నాలుగు వరకు వస్తున్నాయి. ఈ లెక్కన పదోతరగతి విద్యార్థికి దాదాపు 20 నోట్ పుస్తకాల అవసరం ఉంటుందని ఓ స్కూల్ హెచ్ఎం తెలిపారు. వీటి కొనుగోలు కోసం ఒక్కో విద్యార్థి కనీసం గతం కంటే నాలుగైదు వేల రూపాయాలు అదనంగా ఖర్చు చేయాల్సిందే. ఇక స్మాల్ సైజ్ పుస్తకాల ధరలు చూస్తే.. 160 పేజెస్ నోట్‌బుక్ రూ.50 ఉండగా.. గతేడాది రూ.45 ఉన్నది. 152 పేజెస్ నోట్‌బుక్ రూ.45 ఉంటే అప్పుడు రూ.40 వరకు ఉంది. ఇలా అన్ని రకాల నోట్ బుక్స్ ధరల్లో కంపెనీలను బట్టి రూ.5-10 వరకు పెరిగింది. ఓ మోస్తరు స్కూల్ బ్యాగ్ ధర రూ.500-800కుపైమాటే. ఇలా అన్నింటిల్లో విపరితంగా ధరలు పెరిగాయి. పాఠ్యపుస్తకాల ధరలు కూడా భారీగా పెరిగాయి. గతేడాది పదో తరగతి సెట్ మొత్తం రూ.1100 ఉండగా.. ఈసారి రూ.1530 అవుతోంది. ఆరో తరగతి పాఠ్యపుస్తకాల సెట్ ధర లాస్ట్ ఇయర్ రూ.693 ఉండగా.. ఈసారి 800పైనే ఉంది. మొత్తంగా నోట్ బుక్స్, పాఠ్యపుస్తక ధరలు 20శాతం పెరగ్గా.. ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్ల అదనపు దోపిడీ మరోలా ఉంది.

ప్రభుత్వ విద్యార్థులకు ఊరట

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తోంది. ఈసారి నోట్‌బుక్స్ కూడా ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతియేటా స్కూళ్ల ప్రారంభంలో ప్రయివేటు విద్యార్థుల మాదిరిగానే ప్రభుత్వ విద్యార్థులకు కూడా నోట్‌బుక్స్ కోసం సుమారు రూ.2-3వేలకు పైనే ఖర్చు అయ్యేది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు చేయూతనిచ్చే పనులు చేపడుతోంది. నోట్‌బుక్స్ ఉచితంగా అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.1000 నుంచి 1500 వరకు ఆదా చేయనుంది.

మిషనరీ స్కూల్.. ఒకటో తరగతి చదివే విద్యార్థి ఖర్చు ఇలా..	
మొత్తం ఏడాది ఫీజు	రూ.47000
డొనేషన్ ఫీజు	రూ.5000
యూనిఫామ్(డ్రెస్సులు 2)	రూ.3000
టెక్స్, నోట్ బుక్స్	రూ.4600
టై,బెల్ట్	రూ.350
బ్యాగు	రూ.1000
స్టేషనరి	రూ.500
షూస్	రూ.1500
ట్రాన్స్‌పోర్టు	రూ 2000
మొత్తం	రూ.64,950

బడ్జెట్ స్కూల్.. పదో తరగతి చదివే విద్యార్థి ఖర్చు ఇలా..	
ఏడాది ఫీజు	రూ.40వేలు
టెక్స్, నోట్ బుక్స్	రూ.9500
బెల్ట్	రూ.200
బ్యాగ్	రూ.500
షూస్	రూ.900
డ్రెస్‌కు	రూ.1500
మొత్తం	రూ. 52600

బడ్జెట్ స్కూల్.. పదో తరగతి చదివే విద్యార్థి ఖర్చు ఇలా..	
సర్కారు బడి	
స్కూల్ ఏడాది ఫీజు	(నో)
యూనిఫామ్స్ 2 జతలు	(ఫ్రీ)
టెక్స్ బుక్స్	(ఫ్రీ)
నోట్ బుక్స్	(ఫ్రీ)
బ్యాగు	రూ.500-600
స్టేషనరి	రూ.300
చెప్పులు	రూ.250-350
టై,బెల్ట్	(నో)
కా. ఫీజు	(నో)
ట్రాన్స్‌పోర్టు	(నో)
ఇతర బుక్స్	(నో)

పార్లమెంట్ ఎదుట మహిళా సమ్మాన్ మహాపంచాయత్

గళం విప్పనున్న మహిళలు

- ఢిల్లీ సరిహద్దుల్లో, ఢిల్లీ లోపల భారీస్థాయిలో బారికేడ్లు
- కేంద్ర బలగాలతో కట్టుదిట్టమైన భద్రత

న్యూఢిల్లీ : నేడు కొత్త పార్లమెంటు ఎదుట దేశ మహిళా క్రీడాకారులు తలపెట్టిన మహాపంచాయతీకి సన్నాహాలు పూర్తి అయ్యాయి. దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్ల పిలుపు మేరకు నేడు జరగనున్న మహిళా సమ్మాన్ మహాపంచాయత్ నేపథ్యంలో కేంద్రం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఢిల్లీ సరి హద్దుల్లో, ఢిల్లీ లోపల భారీస్థాయిలో బారికేడ్ల ఏర్పాటు చేశారు. ఏ ఒక్కరిని పోలీసులు అనుమతించటం లేదు. మరోవైపు ఢిల్లీ పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మహిళా సమ్మాన్ మహాపంచాయత్‌ను శాంతియుతంగా, క్రమ శిక్షణతో నిర్వహిస్తామని రెజ్లర్లు స్పష్టం చేశారు. 11:30 గంటలకు మహిళా సమ్మాన్ మహాపంచాయత్ కోసం మార్చ్ శాంతియుతంగా ప్రారంభమవుతుందని తెలిపారు. కాగా, మహాపంచాయత్‌కు అనుమతి ఇవ్వలేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు. పార్లమెంట్ ప్రారంభోత్సవానికి బ్రిజ్ భూషణ్ హాజరైతే.. దేశంలో నెలకొన్న పరిస్థితుల గురించి ప్రజలకు స్పష్టమైన సందేశం వెళ్తుందని రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అన్నారు. 'ఆయనకు ఎవరు మద్దతు పలికినా వారు మాకు వ్యతిరేకమే. ప్రభుత్వంలో అంతర్గతంగా ఏం జరుగుతుందో మాకు తెలియదు కానీ.. కొంతమంది ఆయనను రక్షించడానికి ప్రయత్నిస్తున్నారు. అది సరికాదు. ఆయన దేశంలోని ఆడబిడ్డలకు హాని చేస్తున్నారు' అన్నారు.

అంతర్జాతీయ సంఘీభావం

బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళన శనివారం 35వ రోజు కొనసాగింది. రెజ్లర్ల ఆందోళనకు మద్దతు పెరుగుతున్నది. వారికి అంతర్జాతీయ సంఘీభావం లభించింది. టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, మూడుసార్లు ప్రపంచ ఛాంపియన్ జపాన్‌కు చెందిన రిసాకో కవాయ్ రెజ్లర్లకు మద్దతుగా ప్రకటించారు.

రెజ్లర్లకు యోగా గురువు రామ్‌దేవ్ బాబా మద్దతు

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలంటూ స్టార్ రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు ప్రముఖ యోగా గురువు రామ్ దేవ్ బాబా స్పందించారు. కుస్తీ యోధులకు తన మద్దతు ప్రకటించారు. రెజ్లర్లు ఆందోళన చేసే పరిస్థితి రావడం సిగ్గుచేటని, వేధింపులకు పాల్పడే వ్యక్తుల్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ కోర్టుకు పోలీసులు స్టేటస్ రిపోర్టు అందజేత

డబ్ల్యూఎఫ్ఐ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ లైంగిక వేధింపుల ఆరోపణలపై మహిళా రెజ్లర్లు దాఖలు చేసిన దరఖాస్తుపై ఢిల్లీ పోలీసులు శనివారం స్టేటస్ నివేదికను దాఖలు చేశారు. ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేసిన దాదాపు రెండు వారాల తరువాత ఇది జరిగింది. అంతేకాకుండా, సెక్షన్ 164 కింద బాధితుల వాంగ్మూలాన్ని కూడా నమోదు చేసినట్టు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

సిద్ధూ కేబినెట్‌లో మరో 24 మంది మంత్రులు

కీలక శాఖలు సీఎం వద్దే

- పరమేశ్వరకు హోం

బెంగళూరు : కర్నాటక కేబినెట్‌లో శనివారం మరో 24 మంది మంత్రులుగా చేరారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ వీరితో ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో చర్చలు జరిపిన అనంతరం నూతన మంత్రుల పేర్లను కాంగ్రెస్ నాయకత్వం ప్రకటించింది. తాజా విస్తరణతో కర్నాటక కేబినెట్‌లో మొత్తం మంత్రుల సంఖ్య 34కు చేరింది. నూతన మంత్రులకు శాఖలు కూడా కేటాయించారు. కేబినెట్ కూర్పుపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి విడివిడిగా పార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లి ఖార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. వారు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్ సుర్జేవాలాతో కూడా సమాలోచనలు జరిపారు. కాగా సిద్ధరామయ్య కీలకమైన ఆర్థిక, కేబినెట్ వ్యవహారాలు, సిబ్బంది-పాలనా సంస్కరణలు, ఇంటెలిజెన్స్, సమాచార శాఖలను తన వద్దే ఉంచు కున్నారు. శివకుమార్‌కు నీటిపారుదల, బెంగళూరు అభివృద్ధి శాఖలు కేటాయించారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీ పరమేశ్వరకు హోం శాఖ, మల్లిఖార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గేకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు ఇచ్చారు. నూతన మంత్రు లలో ఎక్కువమంది శివకుమార్ సన్నిహితులేనని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అన్ని సామాజిక వర్గాలకూ కేబినెట్‌లో స్థానం లభించిందని ఆ వర్గాలు వివరించాయి. రాష్ట్ర కేబినెట్‌లో 8 మంది లింగాయతులు, ఏడుగురు ఎస్సీలు, ఐదుగురు ఒక్కలిగులు, ఇద్దరు ముస్లింలు, ముగ్గురు ఎస్టీలు, ఆరుగురు ఓబీసీలు ఉన్నారు. నూతన మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో హెచ్‌కే పాటిల్, కృష్ణ బైరెగౌడ, ఎన్ చెలువరాయస్వామి, కే వెంకటేష్, హెచ్‌సీ మహదేవప్ప, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ ఖండ్రే, పీసీసీ మాజీ అధ్యక్షుడు దినేష్ గుండూరావు ఉన్నారు.

ఇమ్రాన్ కుటుంబంపై దాడి అమానుషం

- వారిని వెంటనే అరెస్టు చేయాలి :స్వేచ్ఛ జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నర్సాపూర్ పట్టణంలో ఇమ్రాన్ కుటుంబంపై మూకుమ్మడి దాడి అమానుషమనీ, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ టి.రమేష్, కో కన్వీనర్లు వహిద్, పి.శంకర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సాపూర్‌లో బాధిత ఇమ్రాన్ కుటుంబాన్ని పరామర్శించి దాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పోలీసులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు రమేష్, వహిద్ ,పి.శంకర్‌లు మాట్లాడుతూ ఈ నెల 5 న గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో జరిగిన వివాదాన్ని సాకుగా చూపి హనుమన్ స్వాములు మూకుమ్మడి దాడి చెసి ఇమ్రాన్‌ను ఇంటినుండి బయటకు లాగి ఊరేగింపుగా తీసుకెళ్ళి అంబేద్కర్ చౌరస్తాలో చెప్పులతో కొట్టి అవమానించారని తెలిపారు.

ఆ తర్వాత హత్యాయ త్నానికి పాల్పడ్డారని అరోపించారు. గర్భిణిని అజియాపై వికలాంగురాలు ఫాతి మాపై, వృద్ధ మహిళపై సామూహిక దాడికి పాల్పడ్డారని తెలిపారు. హనుమన్ స్వామిమాల వేసుకున్న వ్యక్తిపై దాడి చేశారనే సాకుతో మతాన్ని అడ్డు పెట్టుకుని దుండగులు దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మత విద్వేషాలు రెచ్చగొట్టారనే తెలిపారు. బాధితుడి ఇమ్రాన్‌పైనె కేసులు నమోదు చేసి అక్రమంగా అరెస్టు చెసి జైలుకు పంపడం అన్యాయమని పేర్కొన్నారు.

దాడి చేసిన వారిని నేటికీ అరెస్టు చేయకుండా పోలీసులు పక్షపాతం వహిస్తున్నారని తెలిపారు. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

25 పాలిటెక్నిక్ కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 25 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లోని పలు కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. మరో నాలుగు కాలేజీల్లో ఎన్‌బీఏ నిపుణుల కమిటీ తనిఖీలు నిర్వహించింది. గుర్తింపు ప్రక్రియ పురోగతిలో ఉన్నది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, జాయింట్ డైరెక్టర్ సి శ్రీనాథ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 25 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు రావడం శుభ పరిణామమని వివరించారు. ఈ కాలేజీల్లో మౌలిక వసతులు మెరుగ్గా ఉండడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందనడానికి ఇదే నిదర్శనమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అధిక నిధులు పొందడానికి దోహదపడుతుందని వివరించారు. అయితే ఒక్కో కాలేజీలో ఒక్కో రకమైన కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు వచ్చిందని వివరించారు. మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈఈఈ), కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ వీడియో ఇంజినీరింగ్, ఆటో మొబైల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మైనింగ్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ వంటి కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు.

'ఉత్తమ ఇంజినీరింగ్ కాలేజీ, బ్రాంచి ఏది?'..నేడు సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉత్తమ ఇంజినీరింగ్ బ్రాంచి, కాలేజీ ఏది? అనే అంశంపై ఎంసెట్-2023 విద్యార్థుల కోసం సదస్సును నిర్వహిస్తున్నారు. నవతెలంగాణ స్పాన్సర్ చేస్తున్న ఈ సదస్సు హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మే 28 (ఆదివారం) సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానున్నది. కెరీర్ కౌన్సెలర్ అండ్ సైకాలజిస్ట్ మహీపతి శ్రీనివాస్ రావు విద్యార్థులకు అవసరమైన సమాచారాన్ని అందించనున్నారు.

డీఎస్సీ-2003 టీచర్లకు ఓపీఎస్ అమలు చేయాలి

- మంత్రి హరీశ్‌రావుకు పీఆర్టీయూ తెలంగాణ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాత పెన్షన్ విధానా (ఓపీఎస్)న్ని అమలు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ కోరింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావును ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి బిక్షంగౌడ్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అసెంబ్లీ ఆమోదం మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నూతన హెల్త్ స్కీంను అమలు చేయాలని కోరారు. ఆర్థిక శాఖలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులన్నింటినీ విడుదల చేయాలని తెలిపారు. త్వరలోనే సంఘాల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి హెల్త్ స్కీం విధివిధానాలను నిర్ణయిస్తామని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం అంజిరెడ్డి, గౌరవాధ్యక్షులు పర్వతి సత్యనారాయణ, కోశాధికారి చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ లేని ఉత్పత్తులే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కల్తీలేని నూనె ఉత్పత్తులు ప్రజలకు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. విజయ బ్రాండ్ నుంచి నాణ్యమైన వంట నూనెల ఉత్పత్తులు రావాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో 'విజయ బ్రాండ్ వేరుశెనగ గానుగ నూనెను మంత్రి మార్కెట్లోకి విడుదల చేశారు. నాణ్యమైన వంటనూనెల తయారీపై ఆయిల్‌ఫెడ్ దృష్టి సారించిందన్నారు. వేరుశెనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు, కొబ్బరి, రైస్‌బ్రాన్, పామాయిల్ వంటి ఉత్పత్తుల నుంచి గానుగ నూనెలు తీస్తున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు విజయ బ్రాండ ఉత్పత్తులను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని అన్ని రైతుబజార్లల్లో, అన్ని జిల్లా కేంద్రాల్లో ఔట్ లెట్ల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మెన్ కంచెర్ల రామకృష్ణారెడ్డి, ఎండీ సురేందర్ తదితరులు ఉన్నారు. అనంతరం ఉద్యాన శాఖ ఉప సంచాలకులు ప్రేమ్‌సింగ్ నాయక్, సవిత దంపతుల కుమారుడు సివిల్స్ 35వ ర్యాంకర్ సంకేత్ కుమార్‌ను మంత్రి సన్మానించారు.

'బీసీలకు గుట్టల్లో ఆత్మగౌరవ భవనాలా?'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అగ్రవర్ణాలకు అనువైన భూములిచ్చి, వెనుకబడ్డ వర్గాలను గుట్టలకు పరిమితం చేస్తారా?అంటూ బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పద్మశాలీ ఆత్మగౌరవ భవన కార్యక్రమం బీఆర్ఎస్ సభగా మారిందని తెలిపారు.కుల పెద్దలకు ప్రాధాన్యత ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎన్నికల స్టంట్‌గా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని విమర్శించారు. అగ్ర వర్ణాలకు మాదాపూర్ , జూబ్లీ హిల్స్ వంటి ఖరీదైన భూములను కట్టబెట్టి, బీసీలకు గుట్టలలో భూములిచ్చి ప్రభుత్వం బీసీలను అవమాన పరిచిందని పేర్కొన్నారు.

మోడీ పాలనలో నిరుద్యోగం రెట్టింపు

- ఏటా 2 కోట్ల ఉద్యోగాల ఊసేలేదు
- డీవైఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏఏ రహీం, హిమాగ్నరాజ్ భట్టాచార్య
- హైదరాబాద్‌లో కేంద్ర కమిటీ సమావేశాలు ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని మోడీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం రెట్టింపయ్యిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జాతీయ అధ్యక్షులు ఏఏ రహీం, ప్రధాన కార్యదర్శి హిమాగ్నరాజ్ భట్టాచార్య విమర్శించారు. నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపడం లేదన్నారు. రెండురోజులపాటు జరగనున్న డీవైఎఫ్ఐ కేంద్రకమిటీ సమావేశాలు హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రపతి లేకుండా పార్లమెంటు నూతన భవనాన్ని ప్రారంభించటం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను బీజేపీ ప్రభుత్వం పరిష్కరించడం లేదన్నారు. దీంతో కోట్లాది మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల కాలంలో దేశంలో రోజురోజుకు నిరుద్యోగం మరింత పెరుగుతున్నదని వివరించారు. కార్పొరేట్ అనుకూల విధానాలే ఇందుకు ప్రధాన కారణమని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ



ఆశ కల్పించిన మోడీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని తెలిపారు. జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు తదితర ప్రజా వ్యతిరేక విధానాల మూలంగా కోట్లాదిమంది నిరుద్యోగులుగా మారారని పేర్కొన్నారు. కొత్త ఉద్యోగాలు సృష్టించకపోగా ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టే విధంగా బీజేపీ విధానాలున్నాయని విమర్శించారు. విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాల గురించి మాట్లాడకుండా మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కులను హరిస్తున్నదని పేర్కొన్నారు. విద్యారంగంలో మతతత్వ భావాలను చొప్పిస్తూ చరిత్ర పాఠ్యాంశాలు మార్చేందుకు ప్రయత్నిస్తున్నదని వివరించారు. జాతీయ ఉద్యమంలో వీరోచితంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను తొలగిస్తూ, ఆర్ఎస్ఎస్ అనుకూలమైన వారి అంశాలను చరిత్ర పాఠ్యాంశాలుగా చేర్చుతున్నదని తెలిపారు. జీవపరిణామ క్రమ సిద్ధాంతమైన డార్విన్ సిద్ధాంతాన్ని తీసేసి మూఢవిశ్వాసాలు అంధవిశ్వాసాలతో విద్యారంగాన్ని కలుషితం చేస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, వివిధ రాష్ట్రాల నుంచి పలువురు కేంద్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి బాలభవన్

సృజనాత్మకత, నైపుణ్యత పెంపునకు మెళకువలు

సంగీతం, చిత్రలేఖనం వంటి వాటికి ప్రోత్సాహం

పిల్లల్లో ఉల్లాసం నింపుతున్న సమ్మర్ క్యాంపులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చదువుల్లో రాణిస్తే చాలు. ర్యాంకులు వస్తే తమ పిల్లల కన్నా గొప్పోళ్లు లేరు. తమలాగా పిల్లలను బాగా చదివించే తల్లిదండ్రులు లేరు... అనే భావన సర్వత్రా వ్యాపించింది. అదే సమయంలో పిల్లలను పుస్తకాల పురుగులుగా మారుస్తుంటే వారి సహజసిద్ధమైన వికాసం ఆగిపోతుందని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు. పిల్లల ఎదుగుదలకు చదువుతో పాటు మానసిక ఉల్లాసం కూడా చాలా ముఖ్యమని సూచిస్తున్నారు. దానికి భిన్నంగా తల్లిదండ్రులు తమ పిల్లలతో విద్యా సంవత్సరమంతా పుస్తకాలతో కుస్తీ పట్టించింది...సరిపోదన్నట్టు వేసవి, ఇతర సెలవుల్లోనూ ప్రత్యేక తరగతులు, ట్యూషన్లంటూ వారిపై భారం మోపుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు పిల్లలను ఇతర యాక్టివిటీస్‌లో ప్రోత్సహిద్దామని భావించినప్పటికీ, కళలు, క్రీడలంటూ వేలాది రూపాయలను ఫీజు అడుగుతుండటంతో పేద తల్లిదండ్రులకు అవి భారంగా మారాయి.

ఇలాంటి వారి కోసం 1960వ దశకంలోనే నాటి ప్రభుత్వం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో జవహర్ బాలభవన్‌తో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో జిల్లాకొకటి చొప్పున బాల కేంద్రాలను ఏర్పాటు చేసింది. పబ్లిక్ గార్డెన్‌లో విశాలమైన ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ భవనంలో పిల్లల కేరింతలు వినిపిస్తుంటాయి. బాలభవన్, బాల కేంద్రాల్లో సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, జానపదం, శాస్త్రీయ విజ్ఞానం, హస్తకళలు, గ్రంథాలయం తదితర అంశాలుండటంతో పిల్లలు ఉల్లాసంగా పాల్గొంటున్నారు. బాలభవన్‌లో ప్రభుత్వ గురుకుల, మోడల్, వికలాంగులకు సంబంధించిన పాఠశాలలకు చెందిన చిన్నారులు ఆయా ప్రక్రియల్లో శిక్షణ పొందుతున్నారు. ఏడాదికి రూ.50 నామమాత్రపు రుసుం చెల్లిస్తే సరిపోతుంది.

ఇక్కడి ప్రక్రియల్లో తొలి అడుగులు వేస్తున్న చిన్నారులు అక్కడితో ఆగిపోవడం లేదు. వాటిలో మరిన్ని మెళకువలను నేర్చుకుంటూ ముందుకెళు తున్నారు. విద్యాసంవత్సరంలో చదువులకు ఇబ్బంది కలగకుండా సెలవు రోజులను ఉపయోగించుకోవడంతో పాటు వేసవిలో పూర్తి కాలాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఆయా ప్రక్రియల్లో శిక్షణ పొందిన వారు ప్రభుత్వ ప్రయివేటు సంస్థల్లో మంచి ఉద్యోగవకాశాలను పొందడం గమనార్హం. ఈ వేసవి సెలవుల్లో కూడా శిక్షణ పొందుతున్న చిన్నారులతో బాలభవన్ కళకళలాడుతున్నది. అయితే ప్రభుత్వ ఉదాసీనత, నిధుల కొరత, సిబ్బంది లేమి, అరకొర వసతులు ఇటు హైదరాబాద్‌లోని జవహర్ బాలభవన్‌తో పాటు అటు జిల్లాల్లోని బాల కేంద్రాలను వేధిస్తున్నాయి. ప్రభుత్వ పర్యవేక్షణ మరింత పెరగాల్సిన అవసరముంది.

ప్రతిపాదనలు పంపించాం....రమణకుమార్



జవహర్ బాలభవన్ అభివృద్ధికి ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు పంపించినట్టు ఆ సంస్థ డైరెక్టర్ రమణకుమార్ తెలిపారు. అవి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్టు వెల్లడించారు. పిల్లల్లో మానసిక వికాసానికి ఉపయోగపడే విషయాలపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. సృజనాత్మకతకు ఉపయోగపడుతున్న కళలు, క్రీడల్లో పిల్లలను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఆసక్తిని గుర్తించాలి.....కప్పారి కిషన్



పిల్లలు ఎలాంటి ఆసక్తి కలిగి ఉన్నారనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని క్రియేటివ్ ఆర్ట్ సెక్షన్ ఉపాధ్యాయులు కప్పారి కిషన్ సూచించారు. ఆసక్తి, పిల్లల్లో లేని ప్రతిభకు సంబంధించిన విషయాలు నేర్చుకోవాలని బలవంతంగా చేయడం సరికాదన్నారు. బాలభవన్‌లో ఆయా అంశాలు ఆసక్తితో నేర్చుకున్న పిల్లలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజేతలుగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సినిమా ఫక్కీలో

నకిలీ ఐటీ అధికారుల దోపిడీ

- బంగారు దుకాణంలోకి చొరబడిన ఐదుగురు
- ట్యాక్స్ చెల్లించనందున సీజ్ చేస్తున్నామంటూ హడావుడి
- 1.7కిలో బంగారంతో ఉడాయింపు
- మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-బేగంపేట్/సిటీబ్యూరో

సికింద్రాబాద్ పరిధిలోని మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ ఐటీ అధికారులు హల్‌చల్ చేశారు. సినిమా తరహాలో పట్టపగలు భారీ చోరీకి పాల్పడటం సంచలనం రేపింది. డీసీపీ చందనా దీప్తి తెలిపిన వివరాల ప్రకారం..

శనివారం మధ్యాహ్నం ఐదుగురు వ్యక్తులు రద్దీగా ఉండే మోండా మార్కెట్‌లోని హర్ష జ్యూవెలరీ దుకాణానికి వచ్చారు. తాము ఐటీ అధికారులమంటూ లోనికెళ్లారు. దుకాణంలో ఉన్న బంగారం మొత్తం తనిఖీ చేయాలని సిబ్బందిని పక్కన కూర్చోబెట్టారు. షాపులో ఉన్న 1700 గ్రాముల బంగారానికి ఎలాంటి ట్యాక్స్ చెల్లించలేదనీ, బంగారం సీజ్ చేస్తున్నామనీ నమ్మించారు. ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా అక్కడి నుంచి బంగారంతో ఉడాయించారు. ఆలస్యంగా తేరుకున్న దుకాణందారులు విషయాన్ని ఆ ప్రాంతంలో ఉన్న మిగతా జ్యూవెలరీ షాపుల యజమానులకు చెప్పారు. అయితే, ఐటీ అధికారులు తనిఖీలు చేయరనీ, నోటీసులు ఇస్తారనీ వారు చెప్పడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బంగారంతో ఉడాయించిన వారు దొంగలుగా తేల్చారు. సీసీ ఫుటేజీని పరిశీలించారు. దోపిడీ తర్వాత నిందితులు సికింద్రాబాద్ నుంచి ఉప్పల్ వైపు పరారైనట్టు గుర్తించారు.

ఐదు ప్రత్యేక బృందాలు : డీసీపీ

బంగారం చోరీ ఘటనలో నిందితులను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు ఉత్తర మండల డీసీపీ చందనా దీప్తి తెలిపారు. సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించి ఆరుగురికి ఈ ఘటనతో ప్రమేయం ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన రివెన్ మధుకర్ బవర్ అనే వ్యక్తి నాలుగు నెలల కిందటే మోండా మార్కెట్‌లో బంగారం షాపు పెట్టుకున్నారన్నారు. మధుకర్ సొంతూరు వెళ్లడంతో అతని బావమరిది వికాస్ ఖేదర్ బాలాజీ గోల్డ్ షాప్‌లో తయారీ పని చూసుకుంటున్నాడని తెలిపారు. వికాస్ ఖేదర్ దిల్‌సుఖ్‌నగర్‌లో మరో గోల్డ్ షాపు నిర్వహిస్తున్నాడని చెప్పారు. చోరీ జరిగిన సమయంలో షాపులో మొత్తం ముగ్గురు పనివాళ్లు ఉన్నారని, ఆ సమయంలో వచ్చిన దుండగులు ఐటీ అధికారులమంటూ ఐడీ కార్డులు చూపించి దుకాణంలోని 17 బంగారం బిస్కట్లు (ఒక్కోటి 100 గ్రాములు) ఎత్తుకెళ్లినట్టు అనుమానిస్తున్నామన్నారు.

పెండింగ్‌ను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం

- ప్రకృతి వైపరీత్యాలను సైతం ప్రతిపక్షాలు ప్రభుత్వానికి అంటగడుతున్నాయ్..
- వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు



నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

గత పాలకుల హయాంలో పెండింగ్ ఉన్న ప్రాజెక్టులను బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి పూర్తి చేశామని వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, టీడీపీల ఏలుబడిలో ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు, వలసలు తప్ప ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. శనివారం జడ్చర్ల పట్టణంలో 30 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలను సైతం ప్రభుత్వాలకు ఆపాదించడం దుర్మార్గమన్నారు. విలువలు కోల్పోయి మాట్లాడుతున్న బీజేపీ నేత బండి సంజయ్, కాంగ్రెస్ అధ్యక్షులు రేవంత్ రెడ్డికి వచ్చిన పదవులు కేసీఆర్ పెట్టిన భిక్ష అన్నారు. 2018లో లక్ష్మారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేశారని, కరోనా వల్ల కొంత ఆలస్యమైనా.. అన్ని సౌకర్యాలతో ఆస్పత్రిని ప్రారంభించుకోవడం సంతోషం అన్నారు. మహబూబ్‌నగర్‌కు మెడికల్ కాలేజీ తెచ్చిన ఘనత లాక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌కు దక్కుతుందన్నారు. కాంగ్రెస్ వాళ్ల ఒక్క మెడికల్ కాలేజీ అన్నా తెచ్చారా అని ప్రశ్నించారు. 100 పడకల ఆస్పత్రులు మేము ఎన్ని పెట్టినం.. మీరెన్ని తెచ్చారో చెప్పాలని సవాల్ విసిరారు. కొడంగల్‌లో రేవంత్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఒక్క ఆస్పత్రి తేలేదని, లక్ష్మారెడ్డి అక్కడా రెండు 50 పడకల ఆస్పత్రులు పెట్టారని చెప్పారు. పాలమూరు ప్రజలకు మీరు ఇచ్చిన బహుమానం కరువు.. వలసలు. ఆకలి చావులు తప్ప చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో పచ్చని పైర్లతో పాలమూరు రూపుదిద్దుకోవడం చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. గతంలో మన పాలమూరు వాళ్లు సుదూర ప్రాంతాలకు వలస వెళ్లే వారని, ఇప్పుడు ఇక్కడ వ్యవసాయ పనులకు కర్నూలు, బీహార్, కర్నాటక ప్రాంతాల నుంచి కూలీలు వలస వస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బండారి భాస్కర్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న ప్రతి సాగుదారుకూ హక్కు పత్రం ఇవ్వాలి

- టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాబురావు, సచిన్

నవతెలంగాణ-ఆదిలాబాద్

పోడు భూములపై హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ పట్టా ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీగా గిరిజనులు, ఇతర పేదలు పోడు చేసుకుంటున్నారని, జూన్ 24 నుంచి 30 వరకు పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. గతంలో ఇదే అంశంపై అసెంబ్లీలో స్పందించిన సీఎం కేసీఆర్ 11లక్షల ఎకరాలకుపైగా పట్టాలిస్తామని ప్రకటించారన్నారు. తెలంగాణలో సుమారు 11 జిల్లాల్లో పోడు భూములు అధికంగా ఉన్నాయని తెలిపారు. మిగతా జిల్లాల్లోనూ పోడు వ్యవసాయం చేస్తున్న వారున్నారన్నారు. హరితహారం పథకంతో అటవీ భూముల్లో ప్రభుత్వం మొక్కల పెంపకం చేపడుతోందని, ఫలితంగా అటవీ అధికారులు, పోడు వ్యవసాయం చేసే రైతులకు మధ్య వివాదం నడుస్తోందని పేర్కొన్నారు. భూ హక్కు పత్రాలు ఉన్న భూములను వదిలేసి మిగతా ప్రాంతాల్లో మొక్కలు నాటుతామని అధికారులు చెబుతున్నా పోడు చేసుకుంటున్న భూములను వదలడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 28 జిల్లాల నుంచి 2వేల 845 గ్రామ పంచాయతీల నుంచి 4లక్షల14వేల 353 దరఖాస్తులు ప్రభుత్వానికి వచ్చాయని తెలిపారు. భూమి 12లక్షల46వేల846 ఎకరాలుగా ఉందన్నారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం కసరత్తు తరువాత 1,50,224 దరఖాస్తులకు సంబంధించిన 4,01,405 ఎకరాల పోడు భూములకు పట్టాలు అందజేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారన్నారు. అంటే 2,64,129 దరఖాస్తులను మళ్లీ పెండింగ్‌లో పెట్టబోతున్నారని తెలిపారు. ఇది గిరిజన ప్రాంతంలో హక్కుపత్రం రాని పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారుల దాడులను మరింత పెంచే ప్రమాదముందన్నారు. హక్కు పత్రాల పంపిణీ బాధ్యతలు గిరిజన సంక్షేమ శాఖ, కలెక్టర్‌లకు అప్పగించిన ప్రభుత్వం భూముల సర్వే కార్యక్రమం మాత్రం ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు ఇవ్వటం వల్లనే చాలా మంది నష్టపోతున్నారన్నారు. పోడు హక్కుల పంపిణీని ప్రభుత్వం హడావిడిగా ముగించకుండా హక్కులు వారికి గిరిజన, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల ద్వారా రీ సర్వే చేసి సాగులో ఉన్న ప్రతి ఒక్కరికీ హక్కులు ఇవ్వాలని టీఏజీఎస్ కోరుతోందని పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌లో రూ.9.67 లక్షల విదేశీ కరెన్సీ పట్టివేత ... మహిళ అరెస్ట్





నవతెలంగాణ-శంషాబాద్

అనుమతులు లేకుండా విదేశీ కరెన్సీని హైదరాబాద్ నుంచి విదేశాలకు అక్రమంగా తీసుకెళ్తున్న మహిళను శంషా బాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అధికారులు శనివారం తెల్లవారు జామున అడ్డుకున్నారు. బిహే వియర్ డిటెక్షన్, సిఐఎస్‌ఎఫ్/ జిడి సిఐడబ్ల్యు స్టాఫ్ మాజీ ఏఎస్ఐ సంపత్ రావు, సిటీ/జీడి షేక్ జానీ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ జహనుమ ప్రాంతానికి చెందిన మహిళ జిల్ ఆల్నిసా మహ్మద్ ఖమర్ అల్దీన్ హైదరాబాద్ ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విమానంలో షార్జా వెళ్లడానికి ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. ఎయిర్ పోర్ట్‌లో ఆమెను పరిశీలించిన అధికారులు బ్యాగును తనిఖీ చేశారు. ఆ బ్యాగులో విదేశీ కరెన్సీ కనిపించింది. విదేశీ కరెన్సీని బయటకు తీసి లెక్కించారు. ఆమె యునైటెడ్ ఎమిరేట్స్ దిరమ్స్ 44,480ను 54 నోట్ల కట్టలుగా మార్చుకుని బ్యాగులో దాచారు. వాటి విలువ భారత కరెన్సీ ప్రకారం రూ.9 లక్షల 67వేల 440 ఉంటుందని అంచనా వేశారు. కరెన్సీని స్వాధీనం చేసుకున్న అధికారులు మహిళను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

31న తెలంగాణ బ్రాహ్మణ సదన్ ప్రారంభం

పాల్గొననున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ బ్రాహ్మణ సదన్ భవనాన్ని ఈనెల 31న ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రారంభించనున్నారు. హైదరాబాద్ గోపనపల్లిలో తొమ్మిదెకరాల విస్తీర్ణంలో ఈ నిర్మాణం పూర్తిచేసుకుంది. దీనిపై సీఎం కేసీఆర్ శనివారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. ప్రారంభోత్సవం సందర్భంగా చండీయాగం, సుదర్శనయాగం నిర్వహించాలనీ, ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే బ్రాహ్మణ సంఘాల నాయకులు, పీఠాధిపతులు, అర్చకులు, వేద పండితులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమీక్షా సమావేశంలో బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు డాక్టర్ కేవీ రమణాచారి, ఉపాధ్యక్షులు వనం జ్వాలా నరసింహారావు, సభ్యులు డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, వీ మత్యుంజయ శర్మ, పురాణం సతీష్, మరుమాముల వెంకటరమణశర్మ, బోర్పట్ల హనుమంతా చారి, అష్టకాల రామ్మోహన్, భద్రకాళి శేషు, సుమలతా శర్మ, సువర్ణ సులోచన, జోషి గోపాల శర్మ, పరిషత్ సభ్య కార్యదర్శి వి. అనిల్ కుమార్, పాలనాధికారి రఘు రామశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ అర్చక, పౌరోహిత్యమే జీవనాధారం చేసుకునే బ్రాహ్మణ సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సభ్య సమాజం మీద వున్నదని అన్నారు.

సీపీఐ(ఎం) నాయకులు, మహిళలపై అక్రమ కేసులను ఎత్తేయాలి

- దాడి చేసిన ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి డిమాండ్



నవతెలంగాణ -మోతె

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపెల్లి సైదులు, మండల కార్యదర్శి ముల్కూరు గోపాల్ రెడ్డి, మహిళా కార్యకర్తలపై అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. అర్హులకు ఇండ్లు ఇవ్వాలని, కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని నిరసన తెలిపిన వారిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. మండల కేంద్రంతో పాటు విభాలపురం, అప్పన్నగూడెం గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులకు ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అనేక పర్యాయాలు కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందించలేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై అనర్హులకు ఇండ్లు ఇచ్చారని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టి పెల్లి సైదులు, మండల కార్యదర్శి మలుకూరు గోపాల్ రెడ్డితో పాటు మహిళా కార్యకర్తలపై మోతె ఎస్ఐ దాడి చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎస్ఐ మహేష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తక్షణమే కలగజేసుకొని అర్హులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు దక్కేవరకు సీపీఐ(ఎం) వారికి అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీఐ వీర రాఘవ మాట్లాడుతూ.. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం డిటి సూరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరి, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, నాయకులు నాగం మల్లయ్య, కిన్నెర పోతయ్య, బూడిద లింగయ్య, కె.గోపయ్య, సోమ గాని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ కంపెనీలా రాష్ట్ర సర్కార్

- 111జీవో రద్దు హైదరాబాద్‌కు ముప్పు: కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ కంపెనీలా మారిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 30 వేల ఎకరాలను అమ్మటానికి కేసీఆర్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణకు కేంద్రం చేసిన సాయంపై చర్చకు సిద్ధమా? అని సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. పొద్దునలేస్తే కేంద్రాన్ని విమర్శించే అలవాటు మానుకోవాలని హితవు పలికారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దళిత సీఎం, మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇండ్లు, ఇలా వందల హామీలను కేసీఆర్ విస్మరించారని విమర్శించారు. దళితున్ని సీఎం చేయనందుకు కేసీఆర్ మెడ నరుక్కోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో దేశవ్యాప్తంగా డబ్బులు పంచడం కోసమే 111 జీవో రద్దు చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నేతలకు 111 జీవో పరిధిలో వందలాది ఎకరాలున్నాయన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు కలసి మాట్లాడుకుని కార్యాలయాలకు భూములు తీసుకున్నారని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబానికి భూ దాహం, అప్పుల దాహం తీరటం లేదని విమర్శించారు.

నిటిఅయోగ్ సమావేశానికి సీఎం కేసీఆర్ హాజరుకావపోవటం తెలంగాణకు తీవ్ర నష్టం అన్నారు. 111 జీవో రద్దుతో ఎప్పటికైనా హైదారాబాద్‌కు ముప్పు తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై కేసీఆర్ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 135 ఏండ్ల చరిత్ర కలిగిన వరంగల్ జైలు భూములు తాకట్టు పెట్టారని వార్తలొస్తున్నాయనీ, నీ తెలంగాణ.. నా తెలంగాణ కాదు.. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమని కేసీఆర్ గుర్తుంచుకోవాలని అన్నారు. ఇంట్లో కూర్చుంటే గుణాత్మకమైన మార్పు ఎలా వస్తుందని ప్రశ్నించారు. కేంద్రాన్ని, ప్రధానిని ఆడిపోసుకోవటం తప్ప కేసీఆర్ చేసిందేమీ లేదని విమర్శించారు. మహారాష్ట్రలో తలకమాసిన వాళ్ల మాత్రమే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారనీ, వారి వల్ల ఒరిగేదేమీ ఉండదని చెప్పారు. రైతులకు తెలంగాణ ప్రభుత్వం 50 వేల కోట్లు బకాయిలు చెల్లించాలనీ, కేసీఆర్ హయాంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని విమర్శించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యం

వెంకట్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-హుజూర్ నగర్‌టౌన్

దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణ కేంద్రంలో శనివారం సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పులిచింతల వెంకటరెడ్డి మృతదేహాన్ని తమ్మినేని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేసిన వెంకట్‌రెడ్డి ఆకస్మిక మృతిచెందడం తీరని లోటన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కాలానుగుణంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో దేశంలో తాత్కాలికంగా కమ్యూనిస్టులు కొంతమేర బలహీనపడినా చివరికంటూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేది కమ్యూనిస్టులే అని చెప్పారు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి శాస్త్రీయత ఉన్నదని, మానవ మనుగడకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో ఇటీవల సీపీఐ, సీపీఐ(ఎం) ఉమ్మడిగా సమావేశం జరిపి ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రజా ఉద్యమాలకు సంబంధించి రానున్న కాలంలో మరిన్ని పరిణామాలు ఏర్పడనున్నాయని తెలిపారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు..

పులిచింతల వెంకట్‌రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి రాష్ట్ర నాయకులు నంద్యాల నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు.

ఆయకట్టు ప్రాంతంలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జరిగిన ప్రతి ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర మరువలేనిన్నారు.

పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపులో ముందు వరుసలో నిలబడి పనిచేశారని కొనియా డారు. అనంతరం వెంకట్‌రెడ్డి అంతిమయాత్రలో వారు పాల్గొన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నాగారపు పాండు, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, పల్లా వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, వట్టెపు సైదులు, షేక్.యాకోబ్, డి.రవి నాయక్, బుర్రి శ్రీరాములు, పారేపల్లి శేఖర్‌రావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను, కౌన్సిలర్ త్రివేణి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సైదిరెడ్డి సంతాపం

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మన వెంట జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు చిట్యాల అమర్‌నాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్, సీనియర్ నాయకులు అట్లూరి హరిబాబు ఉన్నారు. బీఆర్‌ఎస్, సీపీఐ, న్యూ డెమోక్రసీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు వెంకటరెడ్డి అంతిమయాత్రలో పాల్గొని సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ రాష్ట్ర నాయకులు పశ్య పద్మ, ఎల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, ఒక్క వంతుల కోటేశ్వరరావు, ఎలక వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తగులపెట్టి నిరసన

ధాన్యాన్ని ఎగుమతి చేయడం లేదని రైతుల ఆగ్రహం • సమస్య పరిష్కరిస్తామని అధికారుల హామీ



నవతెలంగాణ-శాయంపేట

ఆరుగాలం శ్రమించి అప్పులు తెచ్చి సాగు చేసి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురాగా రవాణా కొరతతో తూకం వేయకుండా వారాలు వారాలు జాప్యం చేస్తుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యానికి నిప్పు పెట్టారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో శనివారం జరిగింది. ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 15న వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకముందు నుంచి పంట కోసిన రైతులు అక్కడే ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి 4 లారీల్లో 3600 ధాన్యం బస్తాలను నిర్వాహకులు రైస్ మిల్లులకు ఎగుమతి చేశారు. రాంపూర్‌లోని సూర్యతేజ రైస్ మిల్లు యాజమాన్యం ధాన్యంలో తాలు ఉందని దిగుమతి చేసుకోవడం లేదని రవాణా కాంట్రాక్టర్ రైతులకు తెలియపరిచారు. శనివారం పెద్ద సంఖ్యలో కొనుగోలు కేంద్రానికి చేరుకున్న రైతులు ధాన్యంలో తాలు ఉందన్న నేపంతో రైస్‌మిల్లర్లు, సివిల్ సప్లయ్ అధికారులు కుమ్మక్కై ధాన్యాన్ని తిరిగి పంపిస్తున్నారని ఆగ్రహంలో వడ్ల బస్తాలను తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి 4 లారీల ధాన్యం మాత్రమే రవాణా చేశారని, ఇంకా 50 వేల బస్తాల ధాన్యం రవాణాకు సిద్ధంగా ఉందని తెలిపారు. ప్యాడి క్లీనర్‌తో ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టితే 200 బస్తాలకు మించికావని, మండుటెండలో ఎలా పట్టాలని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో 40 శాతం పంట నష్టపోగా, 60 శాతం మాత్రమే దిగుబడి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం కూడా రాళ్ల వర్షానికి నేలమట్టమైన ధాన్యానికి మాత్రమే పరిహారం చెల్లించిందని మిగతా వారికి పరిహారం చెల్లించలేదని ఆగ్రహించారు. వర్షాలు కురిస్తే పంట తడిసి ముద్ద అయిపోతుందని, కొనుగోలు కేంద్రాలలో పంటను రక్షించుకుంటూ నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రానికి చేరుకున్న ఏపీఎం శ్రీధర్ రెడ్డి, సీసీ విజయ్‌తో రైతులు వాగ్వివాదానికి దిగారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యానికి నిప్పు పెట్టి నిరసన తెలిపారన్న విషయం తెలుసుకున్న పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి గంగాజమున, డిప్యూటీ తహసీల్దార్ భద్రు నాయక్ వచ్చి రైతులతో మాట్లాడారు. ధాన్యంలో తాలు ఉందన్న సాకు చెబుతూ లారీని తిరిగి పంపిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన సీఐ శ్రీనివాసరావు రవాణా కాంట్రాక్టర్ రాజేశ్వరరావుతో మాట్లాడి ధాన్యాన్ని రైస్ మిల్లులో దిగుమతి చేసేలా చూడాలని సూచించారు. రైతులకు నచ్చజెప్పి శాంతింపజేశారు.

వినూత్న రూపాల్లో వీఓఏల నిరసన

బోనమెత్తి.. వంటావార్పు

నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 39 రోజులుగా సమ్మె చేస్తున్న ఐకేపీ వీఓఏలు శనివారం పలు రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. బోనాలు చేశారు. సిద్ధిపేట జిల్లాలో వివిధ పద్ధతిలో ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మండలంలో వివోఏలు వంటావార్పు చేశారు. దౌల్తాబాద్‌లో వీవోఏలు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ఆధ్వర్యంలో గజ్వేల్‌లో వీవోఏలు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య కొండపాకలో అంబేద్కర్ చౌరస్తాలో వీవోఏలు బతుకమ్మ ఆడారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు బోనమెత్తి నిరసన తెలిపారు.

యాదానాయక్ తల్లి మృతికి సీఐటీయూ సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదానాయక్ తల్లి కురుసోత్(81) మృతికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈ మేరకు శనివారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కురుసోత్‌కు ఇద్దరు కుమారులు, తొమ్మిది మంది మనుమలు, మనుమరాండ్లు ఉన్నారు.

'హస్తినాపురం అభివృద్ధికి నిధులు మంజూరు'



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీల అభివృద్ధికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి సహకారంతో రూ 3 కోట్ల 15 లక్షల నిధులు మంజూరయ్యాయని కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్‌కు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్‌లో గల హనుమాన్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ40 లక్షలు, అనుపమ నగర్ సీసీ రోడ్ నిర్మాణానికి రూ 30లక్షలు, వందనపురి కాలనీ, బాలాజీ నగర్, శ్రీ బాలాజీ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ద్వారకా నగర్ కాలనీల్లో సీసీ రోడ్ నిర్మాణానికి రూ 86 లక్షలు, సాయి గణేష్ నగర్ నుండి న్యూ దత్త నగర్ కాలనీల వరకు సీసీ రోడ్ల పునరుద్ధరణ కోసం రూ 1 కోటీ 59 లక్షల నిధులు మంజూరైనట్లు సుజాతా నాయక్ తెలిపారు.

శ్రీనివాస కాలనీలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-హయత్‌నగర్

కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు డివిజన్‌లోని శ్రీనివాస కాలనీలో శనివారం స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ కావడం వలన తరచూ డ్రైనేజీ నిండి కాలనీ రోడ్ల పై మురుగు నీరు ప్రవహిస్తుందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ జలమండలి అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా డ్రైనేజ్ మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపడుతామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మాణిక్ రెడ్డి , క్రిష్ణ , ధర్మ రెడ్డి, జలమండలి సూపర్‌వైజర్ బాలు నాయక్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని కలిసిన ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి



నవతెలంగాణ -నాగోల్

నాగోలు డివిజన్ బండ్లగూడలోని రాజీవ గృహ కల్పలో సహభావన టౌన్‌షిప్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రోడ్లు, భవనాల శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి విజయేందిర బోయిని కోరారు. శనివారం సహభావన టౌన్‌షిప్ సభ్యులతో కలిసి ఆయన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సహభావన టౌన్షిప్‌లోని భవనాలను కొన్ని ఏండ్ల కిందట నిర్మించినట్లు తెలిపారు. దీంతో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బ తినడంతో లీకేజీలు ఏర్పడ్డాయని వివరించారు. అంతేకాదు సెల్లార్‌లో ఉన్న పైప్‌లైన్లు జాయింట్‌ల వద్ద లీకేజీలు ఏర్పడి సెల్లార్ మొత్తం పాచితో నిండి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు టౌన్షిప్ వెనక భాగంలో ఉన్న జీఎస్ఐ ప్రహరి గోడ కూలిపోయిందని దీంతో పాములు ఇతర జంతువులు అపార్ట్మెంట్లోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకా ఎస్టీపి ప్లాంట్, సోలార్ ఫెన్సింగ్, ఓపెన్ జిమ్, అదనపు లైట్లు, అపార్ట్మెంట్ బయట రెండు వైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఒక కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగోలు డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, వట్నాల విశ్వేశ్వర రావు, రాధాకృష్ణ, యాదగిరి, వెంకటేశ్వర్లు ,కృష్ణ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే అసత్య ఆరోపణలు

బీఆర్ఎస్ బోడుప్పల్ నాయకుడు యాదగిరి



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కొంతమంది తనపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దానగళ్ల యాదగిరి అన్నారు. శనివారం రాజీవ్ నగర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోడుప్పల్‌లో ఎలాంటి పదవులు లేకుండానే వీకర్ సెక్షన్ కాలనీల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశానని తెలిపారు. పేదలు నివాసం ఉండే కాలనీల అభివృద్ధి కోసం గత ఇరవై సంవత్సరాల మమేకమై ఉంటున్నానని అలాంటి తనపై కొంత మంది మీడియా ముసుగులో బ్లాక్ మెయిల్ చేస్తూ పేదలను ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. తన భార్య దానగాళ్ల అనిత కార్పొరేటర్‌గా ఎన్నికైన నాటి నుండి నేటి వరకు వీకర్ సెక్షన్ కాలనీల అభివృద్ధి కోసం పనిచేస్తుందని, తనను రాజకీయంగా ఎదుర్కోలేకనే డబ్బులు వసూలు చేశానని, ప్రభుత్వ భూములను కబ్జా చేశానంటూ అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఆధారాలు ఉంటే రుజువు చేయాలని డిమాండ్ చేశారు. తనపై ఆరోపణలు రుజువు చేయని పక్షంలో క్రిమినల్ కేసులు పెట్టి, పరువు నష్టం కేసులు వేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు గోపు రాములు, బీ.మల్లేశ్, బీ.భగవాన్, సుధాకర్, స్వామి, శంకర్, ఎల్లక్క, లక్ష్మి శారదా, పద్మ, నాగిని, శ్రీజా, జీ.పద్మా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్' కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా 16, 25, 26 డివిజన్లలో శనివారం మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీల్లోని బహిరంగ ప్రదేశాల్లో పెరుకు పోయిన చెత్తాచెదారాన్ని మున్సిపల్ సిబ్బందితో తొలగించారు. పిచ్చి మొక్కలు, రోడ్ల పక్కన ఉన్న పొదలు, శిథిలావస్థకు చేరిన భవనాలు, రోడ్లపై వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు, నాలాల్లో బురదను తొలగించాలని సూచించారు. మూగజీవాల దాహార్తిని తీర్చడం కోసం నగర పరిధిలో తాగునీటి సౌలభ్యతను కల్పించేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి తొట్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు తాగునీరు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులకు, ప్రజలకు సూచించారు. అనంతరం నగర



పరిధిలో మేరా లైఫ్ - మేరా స్వచ్ఛ షెహర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ రెడ్యూస్, రీ యూజ్, రీ సైక్లింగ్ పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాస్, శానిటేరి ఇన్‌స్పెక్టర్ జానకి, నాయకులు పప్పుల అంజిరెడ్డి రెడ్డి, బండి సతీష్ గౌడ్, మల్లం వెంకటేష్ గౌడ్, సీనియర్ అసిస్టెంట్ జగన్ మోహన్, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16 నెలలు గడుస్తున్నా పూర్తికాని ఎస్ఎన్‌డీపీ నాలా పనులు

- **బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి**



నవతెలంగాణ -నాగోల్

ఎస్ ఎన్‌డీపీ నాలా పనులను ఆరు నెలల్లో మంత్రి కేటీఆర్ పూర్తిచేస్తానని చెప్పారని..కానీ 16 నెలలు గడుస్తున్నా ఆ పనులు నేటికీ పూర్తికాలేదని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అసంపూర్తిగా మధ్యలోనే ఆగిపోయిన నాగోలు డివిజన్లోని వెంకటరమణ, మమతా నగర్ కాలనీలలో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, ఆయా కాలనీల వాసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడు మార్చిలో నాగోల్ డివిజన్లో రూ.49 కోట్ల వ్యయంతో ఎస్ ఎన్‌డీపీ నాలా పనులకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీల కింద తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నిధులను ఏర్పాటు చేస్తే..ఆ నిధులతోనే పనులను ప్రారంభించి తామే చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ చేపట్టిన పనులను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తుందని ఎద్దేవా చేశారు. అసంపూర్తి పనుల వల్ల వచ్చే వర్షాకాలంలో బండ్లగూడ చెరువు దిగువ భాగాన ఉన్న కాలనీలు నీట మునుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీ బాత కాని పెట్టే స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి నిలిచిపోయిన నాలా పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కనిపించడం లేదా అని సామరంగా రెడ్డి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వస్పరి మల్లేష్, రావుల శ్రీనివాస్ గౌడ్, నరేందర్ సింగ్, ఆయా కాలనీల వాసులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న రాము చౌహాన్‌కు ఆత్మీయ వీడ్కోలు



నవతెలంగాణ-సంతోష్ నగర్

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా సీబీ 15 బ్రాంచ్ మేనేజర్ రాము చౌహాన్ పిఠాపురం బ్రాంచ్‌కు బదిలీ పై వెళ్తున్న క్రమంలో శనివారం ఆత్మీయ, వీడ్కోలు సమావేశాన్ని ఎల్ఐసీ సీబీ 15 కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులు, మిత్రులు, అభిమానులు, డివోస్, ఏజెంట్లు, అధికారులు, సిబ్బంది మధ్య నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు పలువురు ప్రత్యేక మెమొంటో అందజేస్తూ శాలువతో ఘనంగా సన్మానించారు. అంకిత భావంతో విధులు నిర్వహించి, తనకు సహకరించిన సిబ్బందికి చౌహాన్ ధన్యవాదాలు తెలిపారు. నూతన బ్రాంచ్ మేనేజర్ నరసయ్యకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. సమాజంలో ప్రజలకు విశిష్ట సేవలు అందించారన్నారు. ప్రతి ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమని, బదిలీ కావడంతో ఆత్మీయలను దూరం చేసుకున్నట్లుగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ నాసరయ్య, అధికారులు రాధిక రాణి, దివ్య రమ్య, వినోదిని రెడ్డి, పద్మావతి, చంద్రశేఖర్, రఘురామన్, రవీందర్రావు, లియాఫీ 1964, ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీ ఎస్. బి శ్రీనివాస్ చారి, డివిజన్ అధ్యక్షులు సి. వెంకట్ రెడ్డి, బ్రాంచ్ డివిజన్ ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి, బ్రాంచ్ అధ్యక్షులు బాలస్వామి, బ్రాంచ్ జనరల్ సెక్రెటరీ అల్లం శ్రీనివాసులు, ట్రెజరర్ విశ్వ ప్రసాద్, అధికారులు, సిబ్బంది, డివోస్, ఏజెంట్స్, అభిమానులు, బంధువు, స్నేహితులు, మిత్రులు, తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ అవతరణ దశాబ్ది

ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహించాలి

- **రాష్ట్ర కార్మిక ,ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి**



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర కార్మిక , ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర దశాబ్ది వేడుకలపై శనివారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, కూకట్పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, కె.పి.వివేకానంద్గౌడ్, సుభాష్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నందారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, పాటు ఆయా శాఖల జిల్లా అధికారులతో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై ఆయా శాఖలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్ళలోకి అడుగుపెడుతున్న శుభతరుణంలో ఈ ఉత్సవాన్ని పండగ వాతావరణంలో 21 రోజుల పాటు రోజుకొక శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జూన్ 2వ తేదీ నుంచి 21 రోజుల పాటు ఆయా శాఖలకు కేటాయించిన తేదీల్లో వారు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశ వివరాలను రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి అనంతరం జిల్లా కలెక్టరేట్లోని ప్రజావాణి హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ తెలిపిన రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల వివరాలను మేడ్చల్ నియోజకవర్గంలోని సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, మేయర్లు, మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ కౌన్సిలర్లకు ఇరవై ఒక్క రోజుల పాటు చేపట్టబోయే ఆయా కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నందారెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ బెస్త వెంకటేశ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా సమావేశాలు నిర్వహించాం మేడ్చల్

: మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు సంబంధించి జిల్లా యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో ఇప్పటికే అప్రమత్తం చేశామని ఈ విషయంలో ఆయా శాఖలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై గతంలో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశామన్నారు. జిల్లా కలెక్టరేట్ ఛాంబర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ శరత్చంద్రారెడ్డి, కూకట్ పల్లి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేలు కృష్ణారావు, సుభాష్రెడ్డి, వివేకానంద్తో పాటు జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్తో కలిసి కలెక్టర్ అమోయ్ కుమార్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు ఇప్పటికే జిల్లాలోని అన్ని శాఖల వారికి వారు చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివరించామని అన్నారు. ఈ సందర్భంగా జూన్ 2వ తేదీ నుంచి 21వ రోజుల పాటు అంటే జూన్ 22వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకలకు సంబంధించి ఆయా రోజుల్లో నిర్వహించే రోజు వారి కార్యక్రమాల వివరాలను జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ వివరించారు.

'అగ్నివీర్'లుగా ఎన్‌సీసీ క్యాండెట్స్





నవతెలంగాణ-హయత్ నగర్

భారత సైన్యం లో 'అగ్నివీర్'లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ ఎన్‌సీసీ క్యాడెట్స్‌గా కంచర్ల జిగ్నేష్ జగన్ మోహన్ (B.Sc డేటా సైన్స్ మూడో సంవత్సరం) ఇండియన్ నేవీకి క్యాడెట్ గొడుగు వంశీ (బీఏ రెండో సంవత్సరం) ఇండియన్ ఆర్మీకి అగ్నివీర్‌లుగా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. జ్యోత్స్నప్రభ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాడెట్స్‌ల యొక్క కఠోర శ్రమ, అంకితభావం వలనే అగ్నివీర్‌లుగా వారు ఎంపికైనట్లు కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆఫీసర్ సబ్ లెఫ్టినెంట్ డాక్టర్ ధన్ రాజ్ తెలిపారు. కోచింగ్ ఏఎన్ఓ ఇచ్చిన సలహాలు, శిక్షణ ప్రోత్సాహం వలనే అగ్నివీర్‌లుగా ఎంపికైనట్లు క్యాడెట్స్ ఆనందం వ్యక్తం చేశారు. క్యాడెట్ వంశీ మద్రాస్ ఇంజనీరింగ్ గ్రూప్, బెంగళూరులో, క్యాడెట్ జిగ్నేష్ ఐఎన్ఎస్ చిలుక, ఒరిస్సా లో శిక్షణ పొందనున్నారు. అనంతరం అగ్నివీర్‌లుగా ఎంపికైన క్యాడెట్స్‌ను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖీ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, కోక్యాడెట్స్ తదితరులు అభినందించారు.


'ఎస్‌కేడీ నగర్ ఫ్రీడమ్ పార్క్ పనులు పూర్తి'



నవతెలంగాణ -వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ కే డీ నగర్ ఫ్రీడమ్ పార్క్ పనులు పూర్తైనట్లు ఆ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి తెలిపారు. కాలనీ వాసులతో కలిసి పూర్తైన పార్క్ పనులను శనివారం కార్పొరేటర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లోని కాలనీలో అభివృద్ధిలో భాగంగా ఎస్ కే డీ నగర్ ఫ్రీడం పార్క్ పనులు పూర్తి కావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. కాలనీవాసులు ఈ పార్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలనీలోని ప్రతి సమస్యనూ త్వరలోనే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి ముడుపు సందీప్ రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, అడ్వైజర్ వెంకటేశ్వరరావు, సుధాకర్, హనుమాన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఐవీఎఫ్‌టీఎస్ ఎడ్యుకేషన్ కమిటీ చైర్మన్‌గా రాజశేఖర్



నవతెలంగాణ- నాగోల్

ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ గా రాచకొండ రాజశేఖర్ ను నియమించారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాదులోని నారాయణగూడ కుబేర టవర్స్ లోని ఐవీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు గంజి రాజమౌళి గుప్త, తెలంగాణ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్తల చేతుల మీదుగా రాచకొండ రాజశేఖర్ కు నియామక పత్రాన్ని అందజేశారు.

ఐఎస్ సదన్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



నవతెలంగాణ - సంతోష్ నగర్


ఐఎస్ సదన్ డివిజన్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి అన్నారు. శనివారం ప్రభుత్వ ప్రెస్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. డివిజన్ పరిసరాల ప్రాంతాల్లో డ్రయినేజీ, మంచినీరు సరఫరా, రోడ్డు రవాణా స్థానిక సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదే అన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కాలనీ పరిశ్రమ ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్ రెడ్డి, కాలనీవాసులు రవీందర్ రెడ్డి, విజయకుమార్, మహేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, ప్రకాష్ మోహన్ రెడ్డి, కాలనీ సభ్యులు సీనియర్ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై సమావేశం

నవతెలంగాణ - సంతోష్ నగర్

బాలల హక్కుల పరిరక్షణపై సైదాబాద్ మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల చదువు, బడిబాట కార్యక్రమం, పిల్లల సామర్థ్యం, పిల్లలు మద్యానికీ ఎలా అలవాటుపుతున్నారో దాని నుండి పిల్లలను ఎలా కాపాడాలో తదితర అంశాలపై మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక హైదరాబాద్ కార్యదర్శి, కన్వీనర్ లక్ష్మీనారాయణ, కృష్ణగౌడ్, సైదాబాద్ మండల కన్వీనర్, కార్యదర్శి షేక్.మహమూద్, అలివేలు, మదుగౌడ్ తల్లుల సంఘం నాయకురాలు సాయిలక్ష్మి, ఎంవీ ఫౌండేషన్ సంతోష, విజయ, సల్మాన్, రఫీ, జమాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ది కోసం అభివృద్ధి పనులు అడ్డుకుంటున్నారు'



నవతెలంగాణ - హయత్ నగర్

రాజకీయ లబ్ది కోసం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను కొందరూ అడ్డుకుంటున్నారని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ లోని బాలాజీ నగర్ -పద్మావతీ నగర్, చంద్రపురి కాలనీ, చిత్రసీమ కాలనీ, సెంట్రల్ బ్యాంక్ కాలనీలో తరచుగా డ్రయినేజీ పొంగి ఆయా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వాటర్ వర్క్స్ ఎండీ దానకిషోర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రీ-మాడలింగ్ డ్రయినేజీ పనుల కోసం శనివారం రూ.53.40 లక్షలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.53.40లక్షల భూగర్భ డ్రయినేజీ పునరుద్ధరణ పనుల్లో భాగంగా చిత్రసీమ కాలనీ, చంద్రపురి కాలనీలో పనులు చేపట్టి డ్రయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని చెప్పారు. పద్మావతీ నగర్, బాలాజీ నగర్ కాలనీల మధ్యన 450ఎంఎం డయా సిమెంట్ పైపులు వేయాల్సిన తరుణంలో ఆ పైపులను టెస్టింగ్ కు పంపడం ద్వారా పనులు చేయడం ఆలస్యం అయిందని అన్నారు. దీంతో అధికారాన్ని అధికార పార్టీ నాయకత్వం అడ్డం పెట్టుకొని చేస్తున్న పనులను ఆపించడం ప్రజలను ఇబ్బందులు పెట్టడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. గతంలో వివేకానందనగర్ కాలనీలో రిటేయినింగ్ ప్రహరీ గోడ, భూగర్భ డ్రయినేజీ పనులు, విజయశ్రీ కాలనీ - జడ్జస్ కాలనీలో సంక్షేమ భవన నిర్మాణ పనులు మొదలు పెట్టలేదా అని గుర్తు చేశారు. అధికార పార్టీ నాయకత్వానికి ఒక్క ఫైల్ అభివృద్ధి పనులు మంజూరు చేయించాలంటే దాని వెనక ఎంత కష్టం ఉంటుందో అభివృద్ధి పనులు ఆపిన వారికి తెలియదా అని గుర్తుచేస్తూ మంజూరు చేయించిన పనులను ఆధారాలతో సహ పెట్టడం జరిగిందని తెలిపారు.

సాయి బాబా ఆలయ మాజీ చైర్మన్‌కు నివాళి



నవతెలంగాణ - ఎల్బీనగర్

దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా టెంపుల్ మాజీ చైర్మన్, ట్రేడర్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగాల హనుమంతరావు గౌడ్ శనివారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మల్ రెడ్డి రాంరెడ్డి, చెలమల కృష్ణారెడ్డిలు ఆయన ఇంటికి వచ్చి పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, నర్సింహా యాదవ్, లింగాల కిషోర్ గౌడ్, పన్యాల జైపాల్ రెడ్డి, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ధృవపత్రాలతో బ్యాంక్‌కు టోకార

బ్యాంకు నుంచి రూ.25 లక్షల లోన్ తీసుకున్న ఓ మహిళ

నవతెలంగాణ - వనస్థలిపురం

లింగోజిగూడ హెూటల్లో పనిచేస్తున్న మహిళ హెూటల్ తనదేనని నకిలీ ధ్రువపత్రాలతో బ్యాంకును మోసం చేసిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో చర్చ నియాంశంగా మారింది. హెూటల్ యజమాని పి.సురేష్, తల యజమాని చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్బీనగర్ ఆర్టీసీ కాలనీలో ప్లాట్ నెంబర్ 53ను 2005లో యజమాని కనికరం కమలాక్షి నుంచి వనస్థలిపురానికి చెందిన పి.సురేష్ లీజుకి తీసుకొని బాలాజీ మెస్ పేరిట హెూటల్ ని నడుపుతున్నాడు. 2016లో కమలాక్షి మృతి చెందడంతో ఆమె భర్త వెంగయ్య నుంచి లీజును సురేష్ పొడిగించాడు. సురేష్ వద్ద బాలాజీ హెూటల్లో గత కొన్ని సంవత్సరాలుగా భరత్ కుమార్ సూపర్ వైజర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. కరోనా కాలంలో భరత్ కుమార్ మృతి చెందడంతో 2020లో అతని భార్య పత్తిపాక శోభా ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే భర్త స్థానంలో సూపర్ వైజర్‌గా సురేష్ నియమించాడు. హెూటల్ యజమాని సురేష్ ఇతర వ్యాపారాలతో పని ఒత్తిడి కారణంగా హెూటల్ ను పట్టించుకోవడంలో అలసత్వం వహించాడు. ఇదే అదునుగా భావించిన పత్తిపాక శోభ చనిపోయిన ప్లాట్ యజమాని కమలాక్షి తనకు స్థలం 2022లో లీజుకి ఇచ్చినట్లు హెూటల్ తనదేనని నమ్మించి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి కొత్తపేటలోని ఓ జాతీయ బ్యాంకులో సుమారు రూ.25లక్షలు లోన్ తీసుకుంది. 2023 మొదటి వారంలో తన హెూటల్ పై లోను తీసుకున్నట్లు తెలుసుకున్న సురేష్ ఈ విషయంపై శోభను ప్రశ్నించాడు. కొన్ని రోజులపాటు మాట దాటివేసిన శోభను సురేష్ గట్టిగా పరిశీలించేసరికి హెూటల్ తనదేనని సురేష్ బెదిరింపులకు పాలుపడుతున్నాడని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. హెూటల్ యజమాని సురేష్, తల యజమాని కుమారుడు చంద్రశేఖర్ పూర్తి ఆధారాలతో నకిలీ ధృవపత్రాలు సృష్టించినట్లు గత నెలలోనే శోభపై ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి శోభను అరెస్టు చేయడంలో పోలీసులు శ్రద్ధ చూపలేదని, బాధితులు ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డిని సంప్రదించడంతో వెంటనే శోభను అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు బాధితులు తెలిపారు.

ఫ్లైఓవర్ పనులు పూర్తిచేయకపోవడం సిగ్గుచేటు

టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ- ఘట్కేసర్

ప్రజలను దోచుకోవడానికి డబ్బులు ఉంటాయి కానీ, ఫ్లైఓవర్ పనులు పూర్తిచేయడానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోవడం సిగ్గుచేటని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘట్కేసర్ ఫ్లైఓవర్ పూర్తి చేయాలని కోరుతూ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్లేవర్ పనులకు శంకుస్థాపన చేస్తే నేటికీ కూడా పూర్తి కాలేదని విమర్శించారు. ఈ పనులు పూర్తి చేసుకునేందుకు రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే మార్గమని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందని గప్పాలు కొట్టే టీఆర్ఎస్ ప్రభుత్వం...మేడ్చల్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిశీలిస్తే తెలుస్తుందని అన్నారు. వారి ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డిలు మూడు కోట్ల నిధుల్లో కనీసం మూడవ వంతు నిధులు కూడా ఖర్చు చేయలేని దుస్థితిలో ఉన్నాడంటే అక్కడే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. ఇలాంటి సోమరిపోతు రాజకీయ నాయకులకు రానున్న రోజుల్లో ప్రజలే కర్రు కాచి వాత పెడతారని హెచ్చరించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఆగిపోయిన కొండాపూర్ ఫ్లై ఓవర్ పనులను వెంటనే ప్రారంభించి, ఫ్లైఓవర్ పనుల్లో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఘట్కేసర్ టౌన్ నుండి కొండాపూర్ దారిలో ఉన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేయాలనే ఆలోచనతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేస్తే.. నేటి పాలకుల నిర్లక్ష్యం వలన ఘటకేసర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కాలేదని ఆరోపించారు. ఒక పర్యాయం ఎంపీగా, ఒక పర్యాయం మంత్రిగా ఉన్న మల్లారెడ్డి.. నియోజకవర్గ అభివృద్ధిలో ఎన్ని నిధులు ఖర్చు చేశారనే దానిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి కట్ట జనార్దన్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సగ్గు అనిత, మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షులు రవి, హైదరాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరలక్ష్మి, మేడ్చల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త సుశాంత్ గౌడ్, మేడ్చల్ నియోజకవర్గం ఏబి బ్లాక్ అధ్యక్షుడు, పోచయ్య, వేముల మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి'



నవతెలంగాణ - నేరేడ్ మెట్

పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని వినాయక నగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని దీన్ దయాల్ నగర్ కమ్యూనిటీ సెంటర్ లో పారిశుద్ధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. శ్రీ సాయి మహిళా సంఘం (ఎస్ ఎస్ఎంఎస్), టీఎస్ఏసీఎస్, నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ సహకారంతో ఈ మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. దీంట్లో సుమారు 60 మంది పారిశుద్ధ్య కార్మికులకు పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, దీన్ దయాల్ నగర్ కమ్యూనిటీ సెంటర్ లో ఫౌండర్ అధ్యక్షురాలు అచ్యుత, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ మున్సిపల్ కమిషనర్ శంకర్‌ను మనోజ్ ఎంక్లేవ్ కాలనీ వాసులతో కలిసి కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి బైరి నవీన్ గౌడ్, మనోజ్ ఎంక్లేవ్ ప్రెసిడెంట్ శివ రాజ్, మాజీ అధ్యక్షుడు వెంకట్ రావు, కే.రాజశేఖర్, పవన్ కుమార్, సురేశ్, ప్రభాకర్, నర్సింహా రావు, వేంకటేశ్వర రాయుడు, వివేక్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'గైనకాలజిక్ ఆంకాలజీ' పై
అంతర్జాతీయ రోబోటిక్ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్ షాప్



నవతెలంగాణ-బేగంపేట్

యశోద హాస్పిటల్స్ హైటెక్-సిటీలో గైనకాలజిక్ ఆంకాలజీలో అందుబాటులోకి వచ్చిన పురోగతులపై 2 రోజుల "అంతర్జాతీయ రోబోటిక్ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్ షాప్"ను శనివారం ప్రారంభించారు. ఈ రెండు రోజుల (అంతర్జాతీయ రోబోటిక్ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్ షాప్‌లో గైనకాలజీ వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక రోబోటిక్ వైద్య విధానాలను జాతీయ, అంతర్జాతీయ వైద్య నిపుణులతో ప్రత్యక్ష వర్క్ షాప్ అండ్ ఇంటరాక్టివ్ శిక్షణా సెషన్స్ నిర్వహించారు. ఈ లైవ్ వర్క్ షాప్‌లో జాతీయ, అంతర్జాతీయ అధ్యాపకులు రోబోటిక్ శిక్షణ, లైవ్ సర్జరీ, వీడియో ఆధారిత బోధనతో గర్భాశయ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్‌లో ప్రత్యక్ష రోబోటిక్ శస్త్రచికిత్సలను ప్రదర్శించారు. ఈ రెండు రోజుల ప్రత్యక్ష రోబోటిక్ సర్జరీ శిక్షణా కార్యక్రమంలో దేశం నలుమూలల నుండి 1000 మందికి పైగా గైనకాలజిస్టులు, సర్జన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.జి.ఎస్.రావు మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం అందించేందుకు యశోదా హాస్పిటల్స్ రోబోటిక్ వర్క్ షాప్‌ను నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. స్త్రీలలో వచ్చే క్యాన్సర్లలో 30శాతం గైనక్ క్యాన్సర్లే అన్నారు. రోబోటిక్ సర్జరీ రంగంలో తమ సర్జన్ల నైపుణ్యాన్ని పంచుకోవడం, ప్రదర్శించడం ఈ వర్క్ షాప్ ముఖ్య ఉద్దేశ్యం. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ వాల్టర్ హెచ్ గాల్టీబ్, మా బందంతో చర్చించడానికి, ఆపరేట్ చేయడానికి ఇక్కడకు వచ్చారన్నారు. అండాశయ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లపై ఈ లైవ్ వర్క్ షాప్‌లో చర్చించినట్టు తెలిపారు శస్త్రచికిత్సతో పాటు టార్గెటెడ్ థెరపీలో ఇటీవలి అందుబాటులోకి వచ్చిన పురోగతులు, కొత్త రేడియేషన్ థెరపీ పరిణామం కూడా చర్చించినట్టు తెలిపారు యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ క్లినికల్ డైరెక్టర్ అండ్ రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి మాట్లాడుతూ "రోబోటిక్ సర్జరీ" గత దశాబ్ద కాలంలో ఒక విప్లవాత్మక మార్పును తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికి భారతదేశంలోని 70 వైద్య కేంద్రాల్లో మాత్రమే రోబోటిక్ సర్జరీల ప్రాక్టీస్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గైనిక్ ఆంకో సర్జరీలో భవిష్యత్తులో అందుబాటులోకి రానున్న వైద్య విధానాలపై ఈ అంతర్జాతీయ రోబోటిక్ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్ షాప్ లో చర్చకు రానునట్టు డాక్టర్. చిన్నబాబు తెలిపారు.

మల్లాపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ కాలనీలో రూ.21 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, కేఎల్ రెడ్డి నగర్ లో రూ.38.80 లక్షలతో బీసీ రోడ్డు నిర్మాణ పనులు, ఎస్వీ నగర్‌లో రూ.24.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, వెంకటరమణ కాలనీలో రూ.13.20 లక్షలతో పార్కు పునరుద్ధరణ పనులు, బ్యాంకు కాలనీలో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, అశోక్ నగర్ లో రూ.39.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివద్దే లక్ష్యంగా మల్లాపూర్ డివిజన్‌ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే డివిజన్‌లో దశల వారీగా అభివద్ధి కార్యక్రమాలను చేపట్టి అభివద్ధి అంటే మల్లాపూర్ అనే విధంగా డివిజన్‌ని తీర్చిదిద్దినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ శంకర్, డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు పల్లా కిరణ్ కుమార్ రెడ్డి, తాండ వాసుదేవ్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యోగా మన జ్ఞానం, సంపద, జీవన విధానం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-కంటోన్మెంట్

యోగా మన జ్ఞానం, సంపద, జీవన విధానం అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. జూన్ 21వ తేదీన జరిగే ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో 25 రోజుల యోగా డే కౌంట్ డౌన్ కార్యక్రమాన్ని శనివారం ఉదయం కిషన్ రెడ్డి ప్రారంభించారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. యోగా మన దేశంలో వేల ఏండ్ల క్రితం పుట్టిందనీ, దీన్ని ప్రధాని మోదీ ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. జూన్ 21 యోగా దినోత్సవం రోజున అనేక దేశాల్లోని ప్రజలు యోగా చేస్తారన్నారు. ఆ రోజు మన దేశంలోనూ ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. ఎవరి ఇంట్లో వారు.. ఎవరి గ్రామాల్లో వారు, ఎవరి బస్తీల్లో వారు యోగా చేయాలని పిలుపునిచ్చారు. ప్రకతిని మనిషిని సంలీనం చేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే శాస్త్రీయమైన పక్రియకు సరైన గౌరవాన్నిస్తూ.. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్న వేళ.. 100 రోజులపాటు దేశవ్యాప్తంగా యోగా బ్రహ్మోత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమం మార్చి 13న ప్రారంభమైందనీ, ఇప్పటికే వివిధ ప్రాంతాలు, నగరాల్లో జరిగిందన్నారు. 100 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో 75 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమం అస్సాంలో 50 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమం, జైపూర్‌లో నిర్వహించామన్నారు. ఇప్పుడు 25 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమం హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యోగా సాధనను ప్రోత్సహించడంలో ఇది ఓ బెంచ్ మార్క్‌గా నిలిచిపోనుందన్నారు. 25 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, కేంద్ర ఆయుష్, ఓడరేవుల, షిప్పింగ్ అండ్ జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్, కార్మిక- ఉపాధి పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, కేంద్ర ఆయుష్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి ముంజపరా మహేంద్రభాయ్ కాళూభాయ్, సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.





మచ్చబొల్లారం డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి

- కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్

నవతెలంగాణ - నేరేడ్ మెట్

మచ్చబొల్లారం డివిజన్ సమగ్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్ అన్నారు. శనివారం 133 మచ్చ బొల్లారం డివిజన్ లోని మహాత్మా గాంధీ నగర్ లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చొరవతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. డివిజన్ ను అభివృద్ధిలో ఆదర్శవంతమైన డివిజన్ గా మారుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేష్, జలమండలి అధికారి సాంబయ్య, పారిశుద్ధ కార్మికుల అధికారి ప్రభాకర్, స్థానిక నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రావణ్ ముదిరాజ్, రాజేందర్ యాదవ్, వీవీ రావు, ఢిల్లీ పరమేష్, శ్రీనివాస్ గౌడ్, శోభన్, శకుంతల నాయుడు కాలనీవాసులు నరహరి, నరేందర్ సింగ్, వెంకటేష్, వీరేందర్ రావు, లక్ష్మమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



జమ్మిగడ్డ పీహెచ్‌సీ సమస్యలను పరిష్కరించాలి

- మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ - కాప్రా

జమ్మిగడ్డ పీహెచ్ సీలోని సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు వైద్యా, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఆదేశాలు జారీ చేశారు. ఈ పీహెచ్‌సిలోని రెండు పరికరాలను (టిఫ్ఫా - టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ ఫీటల్ అనోమాలిస్) స్కాన్ మెషీన్‌ను వేరే పీహెచ్‌సీకి మార్చాలని అధికారులు ఆదేశాలు జారీ చేయగా.. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో బీజేఆర్ కాలనీ ప్రెసిడెంట్ రహీమ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మేయర్ డాక్టర్ బొంతు రామ్మోహన్ గత వారం పీహెచ్ సీ కేంద్రాన్ని కార్పొరేటర్లు, బీఆర్ఎస్ స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ మేరకు మాజీ మేయర్ రామ్మోహన్ నేతృత్వంలో స్థానికులు శనివారం మంత్రి హరీశ్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఉప్పల్ నియోజవర్గం ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ లోని ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి కాప్రా, ఏఎస్ రావు నగర్,చర్లపల్లి, జవహర్‌నగర్, నాగారం, దమ్మాయి గూడ ప్రాంతాల నుంచి రోజూ 150 నుంచి 200 మంది రోగులు ఆరోగ్య పరీక్షల కోసం వస్తుంటారని వివరించారు. కావున టీఐఎఫ్ఎఫ్ఏ స్కాన్ మిషన్ (గర్భిణీ స్త్రీలకు ముఖ్యమైన యంత్రం), ఎక్స్-రే స్కాన్ పరికరాలను ఈ పీహెచ్ సీ కేంద్రం నుండి మార్చకూడదని కోరారు. అలాగే రేడియాలజీ డాక్టర్ వారం రోజుల్లో అందుబాటులో ఉంచాలని, గైనకాలజీ డాక్టర్‌ను నియమించాలని, ప్రజలకు ఉచిత అంబులెన్స్ సేవలు, జమ్మిగడ్డ పీహెచ్‌సీ సెంటర్‌లో షెడ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. షెడ్ నిర్మాణానికి సంబంధించి అంచనాలు ఇవ్వాలని జోనల్ కమిషనర్ కోరారు.

మంత్రి సానుకులంగా స్పందించి సమస్యల పరిష్కారంపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానికులు మంత్రి హరీశ్ రావును, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు స్వర్ణ రాజ్, బొంతు శ్రీదేవి యాదవ్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీజేఆర్ కాలనీ ప్రెసిడెంట్ రహీమ్, బీఆర్ఎస్ నాయకులు బాల్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ - కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని మనోజ్ ఎంక్లేవ్ కాలనీలోని డ్రయినేజీ, పార్క్, సీసీ రోడ్డు సమస్యలను పరిష్కరించాలని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి శనివారం మున్సిపల్ కమిషనర్ శంకర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి బైరి నవీన్ గౌడ్, మనోజ్ ఎంక్లేవ్ ప్రెసిడెంట్ శివ రాజ్, మాజీ అధ్యక్షుడు ఎ.వెంకట్ రావు, కే.రాజశేఖర్, పవన్ కుమార్, సురేశ్, ప్రభాకర్, నర్సింహా రావు, వేంకటేశ్వర రాయుడు, వివేక్, ఎన్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

'ప్లాస్టిక్‌ను పారదోలి.. పర్యావరణాన్ని కాపాడుకుందాం'



నవతెలంగాణ- జవహర్ నగర్

ప్లాస్టిక్ ను పారదోలి పర్యా వరణాన్ని కాపాడు కుందామని అంగన్వాడీ సూపర్ వైజర్ ధనలక్ష్మి అన్నారు. శనివారం కార్పోరేషన్లోని అంబేద్కర్ నగర్ అయ్యప్పకాలనీలో అంగన్వాడీ కేంద్రంలో మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షెహర్ కార్యక్రమంపై బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త రహిత నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని సూచించారు. బాలింతలు పోషకాలు కలిగిన ఆకుకూరలు, చిరుధాన్యాలు తినాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలింతలు, అంగన్వడీ చిన్నారులు పాల్గొన్నారు.



కాప్రా టౌన్ వికలాంగుల సమైక్య ప్రతి నిధులు రవీందర్, భాగ్య లక్ష్మి తదితర సభ్యులు శని వారం బీఎల్ఆర్ చారి టబుల్ ట్రస్ట్ వ్యవ స్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను తెలియజేశారు.

నవతెలంగాణ - కాప్రా

ఇంత దౌర్జన్యామా..?

మాపై పోలీసులు చేయి చేసుకున్నారు : స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు



నవతెలంగాణ - బేగంపేట్

అగ్నిమాపక అధికారులు, పోలీసులు మాపై మాపై దౌర్జన్యానికి పాల్పడడమే కాక చేయి కూడా చేసుకున్నారని స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ రోజు ఉదయం పోలీసులు, జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బందితో కలసి వచ్చిన అగ్నిమాపక అధికారులు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఔట్ గేట్ ను తొలగించి గోడను నిర్మించారని తెలిపారు. ఇన్ గేట్ ను కూడా తొలగించే సమయంలో అడ్డుకోడానికి ప్రయత్నించిన తమను దౌర్జన్యంగా పక్కకు నెట్టివేశారని, అంతేకాదు పోలీసులు చేయి కూడా చేసుకున్నారని ఆరోపించారు. తమ ఫోన్ లను లాక్కొని తాము రికార్డు చేసిన విడియోగలను డిలీట్ చేసారని తెలిపారు. ఫైర్ సిబ్బంది ఈ స్థలం తమదని వాదిస్తున్నారని వివరించారు. ఈ స్థలం సంబంధిత దస్తావేజులు చూపించమంటే చూపించకుండా తహసీల్దార్ ను వెళ్లి కలవమని చెబుతున్నారని అన్నారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా పోలీస్ బందోబస్తుతో వచ్చి ఇలాంటి చర్యలకు పాల్పడడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ స్థలం మదేనని ఇప్పుడు వాదిస్తున్న నీటి ట్యాంక్ పెట్టుకోడానికి అనుమతి ఇవ్వాలని ఇప్పుడు కాదు 2014లో మాకు ఎలా అర్జీ పెట్టుకున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇంతింత రమ్మంటే ఇల్లంతా నాదే అన్న చందంగా ఉంది వీరి తీరు అని ఆరోపిస్తున్నారు. 1930నుండి ఇక్కడ ఉన్న గేట్లను లేవని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. అగ్నిమాపక అధికారి మోహన్ రావును వివరణ కోరగా అధికారికంగా నేను మాట్లాడలేను పై అధికారులే మాట్లాడతారని తెలిపారు. చట్టప్రకారం, న్యాయబద్ధంగా ఉన్నాం కాబట్టే ప్రభుత్వ విభాగాలు జీహెచ్ఎంసీ, పోలీసులు అధికారులు కూడా వచ్చారని అన్నారు. కానీ వీరంతా మా స్థలం లాక్కోడానికి ప్రయత్నించడం చాలా దారుణమని స్కౌట్స్ అండ్ గైడ్స్ హైదరాబాద్ సెక్రెటరీ రమేష్, కోశాధికారి రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు.

కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో నవయుగ వైతాళికులు ప్రముఖ సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 104వ వర్ధంతి సందర్భంగా నివాళి కార్యక్రమం జరిగింది. సంస్మరణ సభ ప్రారంభంలో ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకులు పి.ఎస్.ఎన్ మూర్తి కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సింగరేణి క్యాలరీస్‌లో పనిచేసి రిటైర్ అయిన రాజమల్లు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సంస్మరణ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడుతూ 150 ఏండ్ల క్రితమే కందుకూరి వీరేశలింగం పంతులు ఉపాధ్యాయుడుగా ఉంటూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా తను ఆచరించి చూపించాడు అని చెప్పారు. వితంతు వివాహాలను చేయటమే కాకుండా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఆచరణలో గట్టిగా నిలబడి పోరాడన్నారు. మొట్టమొదట నవల రచయిత కందుకూరి వీరేశలింగం అని చెప్పారు. ప్రజల్లో శాస్త్రీయ దక్పథాన్ని కలిగించటానికి తనదైన విధానం తోటి ముందుకు నడిచారని వారు నవయుగ వైతాళికులుగా బిరుదులు పొందారన్నారు. ప్రముఖ రచయిత పి.బి చారి, పి.ఎస్ఎన్ మూర్తి ప్రసంగించారు. అనంతరం సభికులందరూ కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు ఉద్యమ నాయకులు గగన్ కుమార్, జే.చంద్రశేఖర్, శ్రీనివాసరావు, శోభ, గౌసియా, బసవ పున్నయ్య, జి.శివరామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-అంబర్‌పేట

దశాబ్దాల పాటు పెండింగ్‌లో ఉన్న తాగునీటి సమస్య తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సహకారంతో నెరవేరిందని అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ నగర్ బ్యాక్ సైడ్ నిర్మిస్తున్న వాటర్ వర్క్ పైప్లైన్ పనులను పరిశీలించి కొన్ని పైపులు తగ్గడంతో అదనపు పైపులు తెప్పించి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుంచి మౌలిక సదుపాయాలు అంతంత మాత్రం ఉండటంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సహకారంతో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు యాదగిరి రెడ్డి, రమేష్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు అతీక్, రాఫీక్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూటన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రభంజనం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఈ ఏడాది విడుదలైన పదో తరగతి ఫలితాల్లో న్యూటన్ గ్రూప్ ఆఫ్ హై స్కూల్స్ 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో 10/10 ఇద్దరు, 44 మంది 9 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పిజజనార్ధన్ రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న రమేష్, రాజేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. న్యూటన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుల ను, ఉపాధ్యాయులను అభినందించారు. అందరి కృషి పట్టుదల నూరు శాతం ఉత్తీర్ణతకు కారణమని భావిస్తూ అందరికీ పేరు పేరునా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓయూ వీసీ పాలనపై విరుచుకుపడ్డ ఓయూ జేఏసీ నాయులు

నవతెలంగాణ-ఓయూ

బహుజన విద్యార్థి సంఘాలు, ఓయూ జేఏసీ నాయకులు ఓయూ వీసీ పాలనపై విరుచుకుపడ్డారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఆవర ణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బహుజన విద్యార్థి సంఘాలు ఓయు వీసిపై ఆగ్రహంతో మండపడ్డారు. ఒక దిన ప త్రికలో అబద్దాలతో రాసిన వ్యాసంపై బహిరంగ చర్చకు రావాలని అని వీసీకి సవాల్ విసిరారు. తమ ప్రశ్నలకు వీసీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓయూలో విద్యార్థుల ఫీజులను భారీగా పెంచి వారిని ఉన్నత విద్యకు దూరం చేసినట్లు, పరిశోధన లకు గడువు పెట్టి, పరిశోధనలో క్వాలిటీ లేకుండా చేస్తున్న వారు పరిశోధనల గురించి మాట్లాడడం ఏమిటని వారు ప్రశ్నించారు. పరిశోదనలు జరగాలంటే విద్యార్థులకు ఫెలోషిప్‌లు ఇవ్వాలన్నారు. గత రెండేళ్లు గా విద్యార్థులకు నాన్‌నెట్ ఫెలోషిప్ ఎందుకు ఇవ్వ లేదని, యూనివర్సిటీలో విద్యార్థులకు ఎన్నడూ పాఠాలు చెప్పని మీరు కూడా అకాడమిక్స్ గురించి మాట్లాడటం నీ అబద్దాలకు నిద ర్శనమన్నరు. ట్రాన్సాఫామ్, ఫెర్మాఫామ్ రిఫార్మ్ అనేది ఓయూ పునర్వైభవం గురించి కాదని.. అంతా తన వైభవం తన సొంత ఏజెండా అమలు గురించి మాత్రమే అని



ఆరోపించారు. కమీషన్లకు కక్కుర్తిపడి అవసరం లేకున్నా ఓయు వీసి తన విలాసాలకు కొత్త బిల్డింగ్ నిర్మించుకోవడం, విద్యార్థులకు కనీస మౌలిక సదు పా యాలు కల్పించలేదని, విద్యార్థుల సమస్యలు పరిష్కారించకుండా ఇంకా కొత్త సమస్యలు సృష్టిస్తున్నారన్నారని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని తీవ్ర ఇబ్బందులు చేస్తూ, ఓయూలో పని చేస్తున్నా కాంట్రాక్టు ,ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అన్యాయంగా తొలగించడం దారుణమన్నారు. ఓయు భూములు కబ్జాలకు గురవుతున్న చూసిచూడనట్టు వ్యవహరించారని, ఓయూ సొమ్ముతో కొందరు పాలన అధికారులు విదేశాలలో సోకులు చేసుకుంటున్నారని, వీసీ తన తప్పులను కప్పి పుచ్చుకోవడానికి పునర్వైభవం అంటూ అబద్ధాలు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. తెలంగాణకు చెందిన 350 మంది సెక్యూరిటీ గార్డులను తొలగించి వారి స్థానంలో ఇతర రాష్ట్రాల వారిని సెక్యూరిటీ గార్డులను నియమించి పాత సెక్యూరిటీ వారికి చెల్లించే జీతాలకంటే కొత్తవారికి 50 లక్షలు అదనంగా ప్రతి నెల జీతాలుగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. వీసీ రవీందర్ తన వ్యక్తిగత అభిప్రాయాలను ఓయూపై రుద్దుతూ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాడన్నారు. ఓయూను మొత్తంగా "పునర్వైభవం" వైపుగా కాకుండా "తిరోగమనం" వైపు తీసుకెళ్తూ ఓయూ ప్రతిష్టను దిగజార్చుతున్నారన్నారు. కార్యక్రమంలో వేల్పుల సంజయ్, తిరుపతి, వేణుగోపాల్, అంబేద్కర్ విద్యార్థులు పాల్గన్నారు.

బీఎస్పీలోకి ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు కంచర్ల బద్రి

నవతెలంగాణ- ఓయూ

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బహుజన రాజ్య స్థాపనే ల క్ష్యంగా విద్యార్థి నాయకులు ముందుకు రావాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో ఓయూ జెఏసి నాయకులు కంచర్ల బద్రి శనివారం బీఎస్పీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉస్మానియాలో పోలీసు తూటాలను లెక్కచేయకుండా ఉద్యమించిన విద్యార్థి నాయకులకు సరైన గుర్తింపు లేదని విమర్శించారు. వేలాది మంది విద్యార్థి అమరుల త్యాగాల మీద ఏర్పడ్డ తెలంగాణలో కేసీఆర్ నియంత పాలన కొనసాగిస్తున్నాడని దుయ్యబట్టారు.వచ్చే ఎన్నికల్లో బీసీలకు 70 సీట్లు ప్రకటించిన ఏకైక పార్టీ బీఎస్పీనేనని తెలిపారు. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ నాయకులు



కంచర్ల బద్రి మాట్లాడుతూ. బీసీల కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ బీఎస్పీనేనని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో బి.జగన్,హరిప్రసాద్, విద్యాసాగర్,లింగం, తదితరులు పాల్గొన్నారు.

ఎండలకు అల్లాడుతున్న ప్రజలు

- కాస్త ఊరటనిస్తున్న నెహ్రూ జూలాజికల్ పార్క్

నవతెలంగాణ- ధూల్‌పేట్

ఓ పక్క మండుతున్న ఎండలు.. ఈ భానుడి భగభగలకు పట్టణ ప్రజ లు అల్లాడిపోతున్నారు. ఈ వేడికి నిత్యం ప్రజలు ఉక్కిరి, బిక్కిరి అవు తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతతో ప్రజలు ఆందోళన చెం దుతు న్నారు. బయట ఎండ వేడిమి పెరుగుతుంటే.. నెహ్రూ జూ లాజికల్ పార్క్ చల్లటి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతుంది. దీంతో సందర్శకులు ఆ అనుభూతిని ఆస్వాదిస్తున్నారు. జంతు, పక్షాదులు.. జూ లాజికల్ పార్క్‌లోని జంతు, పక్షాదులకు జూ అధికారులు చల్లటి వాతావరణాన్ని కల్పిస్తున్నారు. పులుల, పక్షుల ఎన్‌క్లోజర్ల వద్ద ఏసీలు, వాటర్ స్ప్రింక్లార్‌లు, పిచికారిలతో నీటి తుంపిరులతో చల్లదనాన్ని కల్పిస్తు న్నా రు. ఏనుగులఆటలు, పులుల





జల కాలు, పక్షాదుల కితకితలు సం దర్శ కులను ఆకట్టుకుం టున్నాయి. ప చ్చని చెట్లు పరిమ ళించిన పచ్చద నముతో సందర్శించిన సందకులు పి ల్లలతో గడుపుతూ చల్లటిని వాతావ రణాన్ని ఆస్వాదిస్తు న్నారు. జూలోని ప్రధాన ముఖ ద్వారం నుండి ప్రవేశం వరకు ఎండ దెబ్బ తగలకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

500 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం : ఎమ్మెల్యే కాలేరు

నవతెలంగాణ-అంబర్‌పేట

కాచిగూడ డివిజన్‌లోని కిషోర్ థియేటర్ వద్ద 10 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 500 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓల్డ్ సాయి కిషోర్ థియేటర్ లైన్‌లో గతంలో 315 కేవీ సామర్థ్యం గల ట్రాన్సాఫార్మర్ ఉండేది. అది ఓవర్‌లోడ్ అవుతుందని, అలాగే వేసవి కాలాన్ని దష్టిలో పెట్టుకొని 10 లక్షల వ్యయంతో 500 కేవీ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ శిరీష యాదవ్, డాక్టర్ ఓం



ప్రకాష్ యాదవ్, కాచిగూడ డివిజన్ అధ్యక్షులు ఎర్ర భీష్మదేవ్, నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, సదా నం దు, బబ్లు సింగ్, శ్రీకాంత్ యాదవ్, తదితర నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ రాజకీయాలు చేసే వారికి తగిన గుణపాఠం తప్పదు

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెడుతున్న వారి పైన ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం సాయంత్రం అంబర్ పేట డివిజన్ చెందిన బిజెపి సీనియర్ నాయకులు కూన కుమార్ స్వామి 50 మంది బిజెపి నాయకులు అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ ఇ.విజయ్ కుమా ర్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ నాయక త్వంలో తెలంగాణ ప్రభు త్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధికి అంబర్‌పేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని చేరిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని రాబోయే రోజుల్లో అం బర్‌పేట నియోజకవర్గంలో మరోసారి బిఆర్ఎస్ జెం డా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, బీఆర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు సిద్దార్థ్ ముదిరాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పులిజాల గెల్వెయ్యరాజు గోపాల్ నాయుడు, తదితర నాయకులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి నెహ్రు చేసిన సేవలు చిరస్మరణీయం

- కె.వెంకటేష్

నవతెలంగాణ - ధూల్ పేట్

భారత తొలిప్రధానిగా దేశాభివృద్ధికి పునాదులు వేసిన ఘనత పండిట్ జవహర్ లాల్ నెహ్రు కు దక్కుతుందని దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె.వెంకటేష్ అన్నారు.చార్మినార్ నియోజకవర్గం ఆధ్వర్యంలో శనివారారం నెహ్రు వర్ధంతిని లాల్ దర్వాజా మోడ్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై నెహ్రు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన వారిలో నెహ్రూకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. నవ భారత నిర్మాణానికి అయన కన్న కళలను ప్రతిఒక్కరూ మార్గదర్శకంగా తీసుకోని నెహ్రు ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.సురేష్ బాబు, జి.శ్రీనివాస్, మూసా ఖాసీం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ట్రూప్ బజార్‌లో భారీ అగ్నిప్రమాదం





నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రూప్ బజార్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఫిర్దోస్ మార్కెట్‌లో ఎల్ఈడీ లైట్ హౌస్ షాప్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విషయం గమనించిన స్థానికులు సుల్తాన్ బజార్ పోలీసులు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే గౌలిగూడ అగ్నిమాపక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాలన్నీ పొగతో నిండిపోవడంతో స్థానికులు ఊపిరి ఆడక ఇబ్బందులు పడ్డారు. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ భావిస్తున్నట్టు తెలిపారు. ఈ



ప్రమాదంలో సుమారు రూ.15-20 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని అంచనా. షాప్ నిర్వాహకుడు సునీల్ షాక్‌లో ఉన్నట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న జాంబగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, రామకఅష్ణ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

కూచిపూడి నృత్య సంగీతం నవరస ఆధారితమైనది

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



సూల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదే వరాయ తెలుగుభాషా నిలయంలో నవ్య నాటక సమితి 65 వార్షికోత్స వాలలో భాగంగా శనివారం కూచిపూడి నృత్య సంగీతంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య రీతుల పరిశోధనాత్మక ప్రసంగ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా తెలుగు విశ్వవిద్యాలయ సంగీత శాఖాధిపతి డాక్టర్ రాధా సారంగపాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూచిపూడి నృత్య సంగీతం నవరస అధారితమైనదన్నారు. ప్రముఖ నృత్యసంగీత దర్శకులు, ప్రసంగకర్త డి.ఎస్.వి శాస్త్రీ మాట్లాడుతూ కూచిపూడి నృత్యం దేశవిదేశాల్లో సైతం గుర్తింపు రావడం తెలుగు వారికి గర్వకారణమన్నారు. కూచిపూడి నాట్య శైలిలో ఉన్న నాటకీయతను దృష్టిలో పెట్టుకొని సంగీతం కూర్పు చేసినప్పుడే జనరంజకంగా ఉంటుందన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు నృత్య సంగీత దర్శకులు డి.ఎస్.వి.శాస్త్రీని ఘనంగా సత్కరించారు. నిష్టల సుధామాల సభకు స్వాగతోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు వి.విజయ్కుమార్, శ్రీలత నారపరాజు, డాక్టర్ ఇందిరా, స్నేహరాంచందర్, రేణుకా ప్రభాకర్, కె.రాజగోపా లాచార్య, ఆర్.దినకర్, వి.బి.ఎస్ మురళి, డి.జయకుమారాచార్య, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆత్మీయ సమ్మేళనాలు

ఎమ్మెల్యే దానం..



నవ తెలంగాణ - బంజారా హిల్స్..

శనివారం జూబ్లీహిల్స్ లోని ఆయన కార్యాలయంలో నియోజక వర్గం లోని అన్ని శాఖల అధికారులు కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన దిశా నిర్దేశం చేశారు. ప్రతి డివిజన్ నుండి 500 నుండి 1000కి తగ్గకుండా నియో జక వర్గం మొత్తంలో 10,000 పైచిలుకు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని వారికున్న సమస్యలను పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, వెంకటేశ్వర కాలనీ కార్పొరేటర్ మన్నే కవితరెడ్డి, సోమాజిగూడ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, ఖైరతాబాద్ బంజారాహిల్స్ డివిజన్ నాయకులు అన్ని శాఖల ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

పండిత్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి

నవ తెలంగాణ-బంజారా హిల్స్

పండిత్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని శనివారం గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా కార్పొరేటర్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి విజయరెడ్డి టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు నియోజకవర్గంలోని పలు డివిజన్ల



అధ్యక్షులతో కలిసి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.

మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-అంబర్‌పేట

గత ప్రభుత్వాల హాయంలో నీటి కోసం రోడ్లపైకి ప్రజలు వచ్చేవారని, నేడు కేసీఆర్ అలాంటి పరిస్థితి లేకుండా అందరికీ అందుబాటులో మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శువారం నల్లకుంట డివిజన్ పరిధిలోని నరసింహ బస్తీలో 18 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా వేయనున్న మంచి నీటి పైప్ లైన్ పనులకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ వై అమఅత తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబర్ పేట నియోజక వర్గంలో ఐదు డివిజన్లలోని పలు కాల



నీల్లో, బస్తీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ, డ్రైనేజీ, మంచి నీటి, వరద నీటి పైప్ లైన్ల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు వంటి అనేక పనులు చేపడుతునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడి ప్రసాద్, శంకర్, లక్ష్మణ్, భాస్కర్ గౌడ్, రాము యాదవ్, భూపతి, అధికారులు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాంపల్లి తహశీల్దార్‌ను కలిసిన ఆనంద్ కుమార్ గౌడ్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

నాంపల్లి తహసీల్దార్ ఎం.వి.వి. ప్రసాద్‌రావును గోషామహల్ బిఆర్ ఎస్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సం దర్భంగా ఆనంద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న కల్యాణ లక్ష్మీ, పెన్షన్ వంటి అంశాలపై చర్చిం చామన్నారు. అర్హులైన పింఛన్లు మంజూరు చేయాలని కోరినట్లు వారు తెలిపారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారని అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయటానికి కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్ర మంలో జాంబాగ్ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు అహ్మద్ భాయ్, మహ్మద్ మజీద్ భాయ్, సయ్యద్ అసద్‌భాయ్, వసంత్ అన్న , గణేష్ అన్న , పృధ్వి రాజ్ పాల్గొన్నారు.

అనలాగ్ ఐఏఎస్ అకాడమీలో నాణ్యమైన విద్య

- అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్



నవ తెలంగాణ-అదిక్ మెట్

అనలాగ్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్కాలర్‌షిప్ టెస్ట్ 'అస్త్ర' పోస్టరావిష్కరణ శనివారం జరిగింది. ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద గల అనలాగ్ అకాడమీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారత స్థాయిలో సివిల్స్ పరీక్షలో 40 వ ర్యాంక్ సాధించిన సాయి అశ్రిత్ శాకమూరి హాజరై అనలాగ్ అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్ విన్నకోటతో కలిసి "అస్త్ర"పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయి అశ్రిత్ మాట్లాడుతూ తనకు ర్యాంకు రావడంతో అనలాగ్ ఐఏఎస్ అకాడమీ సంస్థ అందించిన సహకారం ఎంతో ఉందన్నారు. అనలాగ్ అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్ విన్నకోట మాట్లాడుతూ. తమ ఇన్‌స్టిట్యూషన్‌లో చదివి జాతీయ స్థాయిలో 3,8 వ ర్యాంకులతో పాటు అనేక మంది అభ్యర్థు ర్యాంకులు సాధించారన్నారు.

బాధితునికి న్యాయం చేసిన ఖైరతాబాద్ రెవెన్యూ సిబ్బంది

నవ తెలంగాణ- జూబ్లీహిల్స్

రహమత్‌నగర్ డివిజన్, ఎస్పిఆర్ హిల్స్ కమలానగర్‌లో ఫాతిమా అనే మహిళా 2012లో ఇల్లు కొనుగోలు చేసింది. ఆర్థిక ఇబ్బందులతో ఇంటి యజమాని ఫాతిమా బేగం తండ్రి హైదర్ నిర్మాణం మధ్యలో ఆపేశారు. అప్పటినుండి ఆ ఇల్లు ఆమె స్వాధీనంలోనే ఉన్నది. దానికి సంబంధించి పట్టాలు లింకు డాక్యుమెంట్స్ ఫారం డి పట్టా, నోటరీ డాక్యుమెంట్స్ అన్నీ ఇంటి యజమాని వద్ద ఉన్నాయి. గత వారం నుండి ఇద్దరు అక్రమన దారులు ఆ ఇంటిని ఆక్రమించి స్లాబ్ వేయటానికి ప్రయత్నిస్తుండగా, ఇంటి యజమాని అడ్డుకొని వారిని నిలదీశాడు. దానికి వారు ఈ ఇంటిని వారు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూపకుండా పనులు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇంటి యజమాని ఫాతిమా బేగం వారిపై జూబ్లీహిల్స్ పోలీస్



స్టేషన్లో కేసు పెట్టి, కలెక్టర్‌కు, ఆర్డిఓకు ఖైరతాబాద్ ఎమ్మార్వోకు, అన్ని ఆధారాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే స్పందించిన ఖైరతాబాద్ ఎమ్మార్వో, ఆర్ఐ హారిక సిబ్బందిని పంపించి, అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేసి బాధితులకు న్యాయం చేసినట్లు తెలిపారు. అక్రమంగా తిరిగి ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన కూల్చివేస్తామని ఆక్రమణదారులను హెచ్చరించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యూసుఫ్‌గూడలో జానకమ్మతోటలో శనివారం ఉదయంగుర్తు తెలియని మహిళ (35) మృతదేహాన్ని గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు వెంటనే బ్లీహిల్స్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, మహిళా సబ్ ఇన్స్పెక్టర్ కృష్ణవేణి అక్కడకు చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతి చెందిన మహిళ బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తూ, మూడు రోజుల క్రితం ఇంటి నుండి బయటకు వచ్చినట్లు ఆమె పేరు కవిత అని, ఆమె చెల్లి సరిత బేగంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె భర్త కూడా రౌడీషీటర్ అని, ప్రస్తుతం జైల్లో ఉన్నాడని, ఆమెకు కల్లుతాగే అలవాటు ఉందని, దానితో పాటుగా ఆమెకు ఫిట్స్ వ్యాధి కూడా ఉన్నట్లు తెలిపారు. అయితే మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, ఆమె దేహంపై వస్త్రాలు లేవని, ఆమె మానభంగం చేసి చంపినట్లుగా అక్కడ ఆధారాలు సేకరించారు. ఎవరితోనో కలిసి కల్లుతాగి ఉంటుందని, అనంతరం హత్యకు గురై ఉంటుందని, పోలీసులు దర్యాప్తు చేస్తూ కేసు విచారిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా హాస్పటల్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

జూన్ 4న లింగాయత్‌ల మహార్యాలీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

లింగాయతుల సమస్యల సాధనకై జూన్ 4న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లింగాయత్ మహాసభను నిర్వహిస్తున్నట్లు లింగాయత్ సమన్వయ సమితి తెలిపింది.శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వెన్న ఈశరప్ప, మాజీ ఎంపీ సురేష్ శంకర్, సంగమేశ్వరప్పలు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 40 లక్షల జనాభా కలిగిన లింగా యతులకు అన్ని రంగాలలో సమాన వాటా కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని వీరశైవ లింగాయతులను ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. మహాను భావుడైన బసవేశ్వరుని విగ్రహాన్ని అసెంబ్లీముందు ప్రతి ష్ఠించాలని, హైదరాబాద్ నగరంలో 150అడుగుల బసవే శ్వరుని విగ్రహ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి సురేష్ షెట్కార్, సంగమేష్, వి.ఈశ్వరప్ప, అవినాష్ బోసికర్, బి.హనుమంతు, శంకరప్ప పాటిల్, రాజేశ్వరి, బి.రేణుక, విజయ్ కుమార్, కాల్వ మల్లికార్జున్, అనిల్ పాటిల పాల్గొన్నారు.



తరాలకు తరగని స్ఫూర్తి సురవరం : మంత్రి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



సురవరం ప్రతాపరెడ్డి అనేక రంగాలలో అసాధారణమైన కృషిని కొనసాగించి తరాలకు తరగని స్ఫూర్తిని అందించారని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శ్లాఘించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు 80 సంవత్సరాల ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం పరిషత్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో ఏర్పాటుచేసిన సురవరం ప్రతాపరెడ్డి జయంతి ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సురవరం సాహిత్య సామాజిక రంగాలలో అసాధారణమైన కృషిని అందించారని,ఒక సాహిత్యానికే ఆయనను పరిమితం చేయడం తగదని తెలిపారు. సురవరాన్ని కేంద్రంగా చేసుకొని నూరేళ్ల తెలంగాణ పరిణామాలను ఇప్పటికే రెండు సంపుటాలుగా గ్రంథస్థం చేశామని, మూడవ సంపుటం త్వరలోనే రానుందని నిరంజన్ రెడ్డి అన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ సురవరం ప్రతాపరెడ్డి సారస్వత పరిషత్ స్థాపకుల్లో ఒకరని, రెండవ అధ్యక్షులుగా చేసిన కృషి పరిషత్తు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. సురవరం జీవితం సాహిత్యంపై తాను పరిశోధన చేసిన సందర్భంలో ఆయన అసాధారణ ప్రతిభా సంపత్తిని తెలుసుకున్నానని శివారెడ్డి పేర్కొన్నారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య స్వాగతో పన్యాసం చేస్తూ ఆధునిక తెలంగాణ అభ్యుదయానికి ప్రతాపరెడ్డి వైతాళిక పాత్ర నిర్వహించారని అన్నారు. 1996 సంవత్సరంలో సురవరం శతజయంతి సందర్భంగా సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి కార్యదర్శిగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సురవరం రచనలు వెలుగు చూసేందుకు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు.సురవరం ప్రతాపరెడ్డి కుమారుడు డాక్టర్ సురవరం కృష్ణ వర్ధన్ రెడ్డి ప్రసంగిస్తూ తమ తండ్రి దివంగతులైన సమయంలో తాను 11 ఏళ్ల వయసులో ఉన్నానని, రాజా బహదూర్ వెంకటరామారెడ్డి, మాడపాటి హనుమంతరావు వంటి ప్రముఖులతో నాన్నగారికి ఉన్న అనుబంధం స్వయంగా చూశానని గుర్తు చేసుకున్నారు. విజ్ఞాన సరోవర ప్రచురణ సంస్థ నిర్వాహకుడు కొండా లక్ష్మీకాంతరెడ్డి ప్రసంగించారు. పలువురు సాహిత్యాభిమానులు, రచయిత లు,సురవరం ప్రతాపరెడ్డి కుటుంబ సభ్యులు కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఎంత కాలం ?

ఎప్పుడో నాటిన కుల మొక్కలకు
నెత్తురు పోసి మరీ పెంచుతూ
వాటి గింజలను సమాజంలోకి విసిరేస్తున్నారు

తొండ ముదిరి ఊసరవెల్లి ఐనట్టు
ఆ గింజలు మహావృక్షాలై
విషవాయువుని చిమ్ముతున్నయి
వాటి ఊడలు దళితుల మెడలకు ఉరి తాళ్లై
ఎన్నో ప్రాణాలను బలితీసుకుంటునై

20వ శతాబ్దంలో కూడా
మనుషులనింకా కులపిసాచి పట్టిపీడిస్తుంది
చెప్పులు చిపురికట్టతో కొట్టి దాన్ని ఎవరు వదిలిస్తరు
ఇయ్యాల డాక్టర్లు హార్ట్ ట్రాన్స్ ప్లాంటేశన్ పేరుతో
గుండె తీసి గుండె పెడుతు(రు
కానీ అన్ల ఇంత మానవత్వం ఎవరు నింపుతరు

హైదరాబాద్ మహానగరాన్ని కూడ
ఈ మహమారి వదలలేదు
ఇల్లు రెంటు కోసం వెళ్తే
కులం తక్కువ అని
మొకం మీదే తలుపులు ముతపడుతై

ఇటీవల జరిగిన యువకుడి హత్యకు కారణం
కులాంతర వివాహం అని తెలిసి
గుండె చెలిమి నిండుకుంది
నెత్తుట్టి మడుగులో మానవత్వం
ఊపిరాడక చచ్చిపడింది

కన్నతండ్రే కూతురి పుస్తెలను
యముడికి అప్పగించి
తెల్లచీరను కానుకగా తెచ్చాడు
తిరాచుస్తే తాను ఆత్మహత్య చేసుకొని
చావు ఓడిలోకి చేరుకున్నడు
ఇప్పుడు గెలిచింది ఎవరు ఒడింది ఎవరు

కొత్తగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తో
రోబొలకి ఆలోచనా శక్తి ఇస్తరంట
చూస్తుంటే వాటి తలలో కూడా
కులబీజం నాటి పంపెలా ఉన్నారు

టెక్నాలజీ ఎంత పెరిగినా
బూజుపట్టిన బుర్రలకు
ఈసమంత కూడ తెలివి రావట్లేదు

అంటరానితనం ఇంకా ఎంత కాలం
ఇక ఉర్కునేది లేదు
కులవ్యవస్థను అరికాళ్ళతో
అతాల పాతాలంలోకి తోక్కాల్సిందే

- ఆకాష్ మునిగాల, 8106390647

జోష్ YOUTH N YOUTH
హైదరాబాద్ 11
నవతెలంగాణ
ఆదివారం 28 మే 2023
www.navatelangana.com

సివిల్స్-2022 ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. 'పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతూ పట్టుదలతో చదివితే ఏ పోటీ పరీక్ష అయినా సాధించొచ్చు. అందుకు పేద, ధనిక భేదం లేదు.. ప్రతిభ, ప్రజ్ఞ ఉన్న ప్రతిఒక్కరూ విజయ తీరాలకు చేరుకోవచ్చు' అని నిరూపించారు. సరైన లక్ష్యం, కృషి ఉంటే దేన్నయినా సాధించవచ్చని ప్రపంచానికి చాటిచెప్పారు. అపజయాలకు కుంగి పోకుండా విజయతీరాలను చేరుకున్నారు. తండాలు, దళిత వాడల నుంచి దేశ అత్యుత్తమ సర్వీసులకు ఎంపికై నేటి యువతరానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ముద్దుబిడ్డల చిరుపరిచయం ఈ వారం జోష్.

- అనంతోజు

పక్కా ప్రణాళికే...
మా విజయ రహస్యం



నిరాశ పడొద్దు : ఉమా హారతి

ఏదో ఒక ర్యాంకు వస్తే చాలనుకున్నాను. మూడో ర్యాంకు వస్తుందని మాత్రం అస్సలు ఊహించలేదు. ముందుగా జాగ్రఫీ ఆప్షనల్ సబ్జెక్టు ఉండేది. ఆ తర్వాత ఆంత్రోపాలజీకి మారాను. ఒకవేళ పరీక్షల్లో ఫెయిల్ అయినా నిరాశ పడొద్దు. ఎవరి నుంచైనా మనం స్ఫూర్తి పొందవచ్చు. నేను ఐదేళ్ల నుంచి ప్రిపేర్ అవుతున్నా. ఈ పరీక్ష ప్రక్రియలో చాలా ఫెయిల్యూర్స్ చూశాను. అయినా నిరాశ పడలేదు. విశ్వాసంతో చదువుతూ ముందకెళ్లాను. ఈ ప్రాసెస్‌లో కుటుంబ సభ్యుల సపోర్టు, ఎమోషనల్ సపోర్టు చాలా అవసరం. అది ఉంటే చాలు. సమాచారం, పుస్తకాలు.. అన్నీ ఆన్‌లైన్‌లో ఉచితంగా దొరుకుతాయి. కానీ ఎమోషనల్, ఫ్యామిలీ సపోర్టు మాత్రం దొరకదు కదా.. అదే చాలా అవసరం. మహిళలు, పురుషులు ఎవరైనా సరే.. కుటుంబం సపోర్టు చేస్తే సాధించవచ్చు. నూటికి నూరు శాతం మా నాన్నే నాకు స్ఫూర్తి, ప్రేరణ. మహిళల విద్యపై ఎక్కువగా దృష్టి పెడతాను.



తొలి ప్రయత్నంలోనే విజయం వరించింది : శాఖమూరి సాయి ఆశ్రిత్

మాది జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గుంటూరుపల్లి. 22 ఏండ్లకే సివిల్స్ సాధించడం నమ్మలేకపోతున్నా. అది కూడా ఆలిండియా 40వ ర్యాంక్. నాన్న శాఖమూరి అమర్ క్రెడాయ్ (స్థిరాస్తి వ్యాపారుల సంఘం) కోశాధికారి. అమ్మ పద్మజ. వరంగల్ పబ్లిక్ స్కూల్లో 10వ తరగతి వరకు, హైదరాబాద్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్, రాజస్థాన్ బిట్స్ (పిలానీ) లో బీటెక్ చదివాను. బీటెక్ ఫైనల్ సెమీస్టర్‌లో ఉండగానే ప్రిపరేషన్ మొదలుపెట్టాను. బీటెక్ పూర్తి చేసిన వెంటనే హైదరాబాద్ సీబీఎస్ ఐఏఎస్ అకాడమీలో కోచింగ్ తీసుకున్నాను. 2022లో మొదటి ప్రయత్నంలోనే ఆలిండియా 40వ ర్యాంక్ సాధించాను. కష్టపడి చదివాను. కష్టపడి చదివితే విజయం వరిస్తుందనడానికి నేనే ఉదాహరణ.



సమాజాన్ని చదువుకున్నాను: అజ్మీరా సంకేత్‌కుమార్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు అవుతున్నా నేటికీ అనేక గిరిజన తండాలు నాగరికతకు దూరంగా బతుకున్నాయి. అందుకే గిరిజన తండాల్లో చైతన్యం నింపేందుకు కృషి చేస్తాను. మాది మంచిర్యాల జిల్లా దండేపల్లి. చిన్నప్పటి నుంచి చదువుపై అమితమైన ఇష్టం. అమ్మ సవిత ఇస్రోలో ఉద్యోగం. నాన్న ప్రేమ్ సింగ్ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ డైరెక్టర్. వాళ్లను చూస్తూ పెరిగిన నేను అలాగే గౌరవంగా బతకాలనుకున్నాను. ఢిల్లీ ఐఐటీలో 2017లో బీటెక్ చేసి.. జపాన్‌లో రీసెర్చింగ్‌లో ఉద్యోగం చేస్తున్నా కానీ, ఏదో అసంతృప్తి వెంటాడేది. సివిల్స్ సాధించాలని నిర్ణయించుకొని హైదరాబాద్ వచ్చేశాను. ఎలాంటి కోచింగ్ లేకుండా స్వతహాగానే ప్రిపేర్ అయ్యాను. మొదటి ప్రయత్నంలో విఫలమైనా రెండో ప్రయత్నంలో 35వ ర్యాంక్ సాధించాను. అందరిలా రోజుకు 12, 14 గంటలు నేను చదవలేదు. సమాజాన్ని చదువుకున్నాను. అదే నన్ను ఈ రోజు విజేతగా మీ ముందు నిలిపింది.



కష్టాలు, కన్నీళ్లు నా లక్ష్యం ముందు చిన్నబోయాయి : డోంగ్రీ రేవయ్య

మాది కుమురంభీం అసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం తుంగేడ్ గ్రామం. నా నాలుగేండ్లటప్పుడే నాన్న మనోహర్ చనిపోయారు. గట్టిగా గాలి వీస్తే ఎగిరిపోయే పూరి గుడిసె. ముగ్గురు పిల్లలతో అమ్మ విస్తారి భాయ్ రోజూ బతుకు పోరాటమే చేసింది. అడవిలో కట్టెలు కొట్టుకొచ్చి, ఇంటింటికీ తిరిగి అమ్మేది. ప్రభుత్వ పాఠశాలలో వంట పని చేసేది. సెలవుల్లో కూలి పనులకూ వెళ్లేది. అమ్మ చదువుకోకపోయినా, చదివితేనే బతుకు మారుతుందని గట్టిగా నమ్మేది. అదే మాకు నేర్పింది. కాగజ్ నగర్‌లోని శిశుమందిర్ లో ఒకటి నుండి 5వ తరగతి వరకు, ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఆసిఫాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో, హైదరాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. 2012లో నాకు ప్రతిష్ఠాత్మక మద్రాస్ ఐఐటీలో సీటొచ్చింది. కానీ, రూ.22 వేలు కట్టాలి. రెక్కడితే గానీ డొక్కాడని కుటుంబం. అంత డబ్బెక్కడిది? ఆ గడ్డు పరిస్థితిలో.. ప్రతికలో వచ్చిన ఓ కథనం చదివి అప్పటి మా కలెక్టర్ అశోక్ స్పందించి సాయం చేశారు. మరికొంత మంది తమ వంతు సాయం అందించారు. అప్పుడే నాకు ఒక సివిల్ సర్వెంట్‌కి ఉన్న పవరేంటో అర్థమైంది. అది సాధించాలనే అప్పుడే సంకల్పించుకున్నాను. దానికంటే ముందు ఆర్థికంగా కొంత స్థిరపడితే.. అమ్మకు భారం తగ్గుతుందని అనుకున్నా. ఐఐటీ మద్రాసులో ఇంజినీరింగ్ పూర్తయ్యాక 'గేట్' రాశా. మంచి ర్యాంకు రావడంతో ఓఎన్‌జీసీలో రూ.22లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. ఐదేండ్లు అక్కడ పని చేస్తూనే.. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాను. 2021లో తొలిసారి సివిల్స్ పరీక్షలు రాసి ఇంటర్వ్యూ వరకూ వెళ్లా. కానీ విజయం సాధించలేదు. ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకొని సీనియర్ల సాయంతో దాన్ని అధిగమించా. హైదరాబాద్‌లోని బాల లత గారి దగ్గర కొన్నాళ్లు శిక్షణ తీసుకున్నా. రెండోసారి గురి తప్పలేదు. నాకొచ్చిన 410 ర్యాంకుకి ఐపీఎస్ రావొచ్చు. ఆర్థిక చేయూత లేక చాలామంది పేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారు. నా పరిధిలో అలాంటి వారికి ముందుగా సాయం చేయాలనుకుంటున్నా.



ఓటమి పట్టుదలను పెంచింది : గ్రందే సాయికృష్ణ

గతంలో మూడుసార్లు సివిల్స్ అటెంప్ట్ చేసి ఫెయిల్ అయినప్పటికీ నిరాశపడకుండా చదివి తానేంటో ఫలితాల ద్వారా చాటి చెప్పాడు. మాది కొత్తగూడెంలోని శ్రీనగర్ కాలనీ. నాన్న శ్రీనివాస్ ఓ లాడ్జి మేనేజర్. అమ్మ నాగలక్ష్మి గృహిణి. మధ్యతరగతి కుటుంబం. అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. పదో తరగతి వరకు కొత్తగూడెంలోని సూర్యోదయ పబ్లిక్ స్కూల్, ఇంటర్మీడియట్ విజయవాడలోని శ్రీగాయత్రి జూనియర్ కాలేజీ, బీటెక్ కేరళలోని కాలికేట్ నగరంలోని ఎన్ఐటీలో పూర్తి చేశాను. ఆ తర్వాత ఎల్అండ్‌టీ కంపెనీలో రెండేండ్లు ఉద్యోగం చేసి మానేసి సివిల్స్‌పై దృష్టి పెట్టాను. ఎలాంటి శిక్షణ లేకుండా రోజుకు సుమారు 10 గంటల చొప్పున మూడేండ్లు కష్టపడ్డాను. యూపీ ఎస్సీ పాత ప్రశ్నాపత్రాలు, ఆన్‌లైన్‌లో మోడల్ పేపర్స్‌తో స్వయంగా మాక్ టెస్టులు పెట్టుకొని నాకు నేనే ఏయే అంశాల్లో వెనుక బడ్డానో గుర్తించి తిరిగి ప్రిపరేషన్ ప్రారంభించాను. మొదటిసారి 2019లో సివిల్స్ రాసి మెయిన్స్‌కు అర్హత సాధించాను కానీ, మెయిన్స్ క్లియర్ చేయలేకపోయాను. 2020, 2021 ఇదే సీన్ రిపీట్ అయింది. అయినా కుంగిపోలేదు. నాలో సాధించాలన్న కసి రెట్టింపు అయింది. 2022లో మెయిన్స్‌కు అర్హత సాధించాను. ఈ ఏడాది మెయిన్స్ కూడా క్లియర్ చేసి ఇంటర్వ్యూకు ఎంపికయ్యాను. ఇంటర్వ్యూలో కూడా సెలక్ట్ అయి ఏకంగా 293వ ర్యాంకు సాధించాను. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నిరాశను ఆవరించ నీయలేదు. నాకు నేనుగా దృఢంగా ఉండటానికి ప్రయత్నం చేశాను. ఓడిపోయిన ప్రతిసారి నాలో కసిని పెంచింది. సాధించాలన్న పట్టుదల పెరిగింది. అదే నా విజయ రహస్యం.

శ్రీమతికో లేఖ

బుజ్జమ్మా.. ఇది నీకోసమే..



నీతో చెప్పాలనుకున్న మాటలు కొన్నింటిని ఇలా కాగితంపై కల్లాపి చల్లాను.. చూస్తావు కదూ...

జీవితంలో నాకు నేనే వద్దనుకున్న రోజుల్లో, నీకు నేను కావాలంటూ నా ముందు ప్రత్యక్షమయ్యావ్ పున్నమి పువ్వులా

ఆ క్షణం.. నాక్కూడా నువ్వు కావాలనిపించావ్, కానీ నే అనుకోలేదప్పుడు నీతో జీవితం ఇంత అందంగా.. కాదు కాదు.. ఇంత ఆనందంగా ఉంటుందని..

ఇప్పుడేమనిపిస్తోందో తెలుసా? ఇంకొన్నేళ్ల ముందే నిన్ను నేనెందుకు కలవలేదూ అని...

నిన్న మొన్నటి వరకూ నాకంటూ కొన్ని ఆలోచనలుండేవి.

కొందరు మనుషులు ఎప్పటికీ కలవని సమాంతర రేఖల్లాంటివారని అనుకునే టోడ్ని. అందుకేనేమో కొంత కాలం కొన్ని బంధాలకు, ఇంకొందరి మనుషులకు దూరంగా ఉన్నాను. కానీ అది ఒట్టి అపోహనని నువ్వు చెప్పకనే చెప్పావ్.

ఎన్నో వైరుధ్యాలున్న ఈ మనుషులతో ఇంత కలివిడిగా, ఎంతో ప్రేమగా నీలాగా వుండగలగటం అంత సులువేం కాదు. అందుకింకేదో మంత్రం తెలిసుండాలి అమ్మడు నీకు.

పెళ్లికి ముందు వరకూ నేను ఒంటరిగానే ఉండేవాడ్ని. నా పనేదో నాది. లేవడం, ఫ్రెషవ్వడం, వర్క్‌లోకి వెళ్లడం, తిరిగి రావడం, ఫ్రెష్షవడం, కాసేపు మొబైల్ చూసి మళ్ళీ బజ్జోవడం. ఇదే నా లైఫ్ టైం టేబుల్‌లా ఉండేది. మూడు పదులు దాటేస్తున్నా ఇంకా లైఫ్‌లో ఏమీ సాధించలేదు కదా, కనీసం అమ్మానాన్నలకు ఏమాత్రం చేయూత కాలేకపోయానే, ప్రేమలో కూడా ఓడిపోయాను, అంతా అయిపోయింది ఇంక ఈ లైఫ్ నాకు వద్దనుకుని సూసైడ్ అటెమ్ట్ కూడా చేసి మళ్లీ వెనుకడుగేసిన జీవితం నాది. అలాంటి ఏమీ లేని, ఎవ్వరికీ ఏమీకాని ఈ ఏకాకి బతుకులోకి ఏక్ దమ్ భాగ్యలక్ష్మి బంపర్ డ్రా లక్కు చిక్కినట్టు దొరికావ్. ఆ క్షణం నుంచి ఈ షణ్ముఖ్ గాడి జిందగీ ఫేటే మారిపోయింది.

ఇప్పుడు నేనో రారాజుని. నా కోసం ఓ రాణుంది. నా యువరాణి ఉంది.

అందం, అణకువ ఉన్న ఐదున్నరడుగుల ప్రేమ స్వరూపం.

నన్ను, నా కుటుంబాన్ని, నా ఇంటిని తన నెత్తిన పెట్టుకు నడిపిస్తున్న ధరణి, నా బ్రతుకు పాటను ఓ "శృతి" లో నడిపే అందమైన తరుణి.

నీ గురించి ఏం చెప్పను..? ఎన్ని కష్టాల్ని దాటొచ్చిన జీవితమో గానీ, అవతలివారు బాధించినా కూడా సరిగా ప్రతిస్పందించడమో, లేక నిందించడమో తెలియని పసిమనసువి. నీకు చేతగాని పనంటూ లేదు, అన్నింట్లో ఆరితేరావ్, కొన్నింటిని భరించాలన్నా కూడా ఎవరైనా నీ తర్వాతనే.

నువ్వా... అచ్చు అవని లెక్క అమ్మడు..

రోజుకోసారి ఏదో కారణంగా అలకల పల్లకీపై కూర్చుంటావ్, నేను నా బుజ్జమ్మను బుజ్జగించాలని ప్రయత్నిస్తాను. వెనువెంటనే బుంగమూతి పెడతావ్. గట్టిగా ఓ కసురు కసరాలననిపిస్తుంది ఇంతలోనే ఆ బుంగమూతి నుంచి ఓ అరనవ్వు విసురుతావ్. ఇంకేముంది నా మనసు గగనంలో గర్జనలాగి, వెంటనే నా నుంచి ప్రతినవ్వు పూలవర్షమై కురుస్తుంది నీ ముంగిట. ఇలా నీ రెండు పదుల పసితనానికి నేనెప్పుడో నీ ఫ్యానయ్యా. ఇయ్యాల నేను నీ అభిమాన సంఘాధ్యక్షుడ్ని, నీ ప్రేమాలయ పూజారిని, నా దేవేరికి దొరికిన నీ మామూలు శ్రీవారిని...

ట్రస్టు మీ బంగారం You Are Complete. నువ్వు నీలాగే ఉండాలి. ఇలాగే అందమైన కలలు కనాలి. గప్పుచిప్పు గంతులేయాలి, అల్లరల్లరిగా చిందులేయాలి, అప్పుడప్పుడూ అలగాలి, మారామ్ చేయాలి. కుదిరితే రెక్కలు కట్టుకుని మబ్బుల్లోకెగిరిపోవాలి. పడితే దెబ్బలు తగుల్తాయని హెచ్చరిస్తుంటాన్నేను. అస్సలు పట్టించుకోవద్దు. ఊరికూరికే నీతో గొడవపడతుంటాను గానీ, అయినా..! నువ్వు గెలిస్తేనే నాకెక్కువ సంతోషమన్న సంగతి నీక్కూడా తెలుసులే. యాద్ రఖో బుజ్జమ్మా... మన లైఫ్ మన చేతిలోనే ఉంటుంది. అందుకే చెబుతున్నా... రోజూ నువ్వు ఆనందంగా ఉండాలి. నీ మనసుకు నచ్చినట్టుగా ఉండాలి. కొన్ని అనుకున్నట్టుగా జరుగుతాయ్. ఇంకొన్ని ఆటోమేటిక్‌గా జరుగుతాయ్. కానీ ఏం జరిగినా సరే టేకిటీజీ అని బ్రతికేయడమే జీవితం...

బైదిబై... పెళ్లి రోజు శుభాకాంక్షలమ్మా (నీకు + నాక్కూడా)

ఇట్లు
నీ శ్రీవారు

ఆచూకీ కానొస్తలే

నిశబ్దాన్ని పటాపంచలు చేసిన
ఆ పసిబిడ్డ ఏడుపే
నేను విన్న చివరాకరిది.

ఈ మధ్య కాలంలో నువ్వేపుడైన
బిగపట్టిన పిడికిలిని చూశావా ?
కాసిన్ని వేడి వేడి నినాదాలను
ఆ దోపిడిదారుల గుండెలపై విసిరేయడం
కనీసం కళ్ళారా చూశావా ??
నిద్రలేకుండా చేసేటి ఆ ప్రశ్నలేవి
విడమరిచి వివరించే వేధికలేవి
మొద్దుబారిన మెదళ్ళను
సానబెట్టిన ఆ మాటలేవి??

వేట మొదలైన అడవిలోనే
నాటకం షురూ అయినట్టు
దొంగలు దొరతనం మోస్తుంటే
పొదల సాటున సప్పిడి మాటలతో



సగ ప్రాణాలతో సాగుతున్న
పిరికి పందల వత్తాసు పాటలే
రాజ్యతంత్రమయినట్టుంది.

భగ భగ రగిలే
నిప్పుల జ్వాలలు
యుద్ధభూమిపై పారిన
ఎర్రఎర్రని రక్తపు అలలు
కన్నతల్లుల త్యాగాల కన్నీళ్లు
నిన్ను నన్ను నిలదీస్తుంటే
తల లేని మొండెం వోలె
ఇక తప్పించుకోకు !

నిశబ్దాన్ని నిలువునా చీల్చి
నింగిని తగిలేలా
కొత్త దరువు మొదలెట్టు
గతకాలపు గొంతుల
ఆచూకీ పట్టుకొని
సైన్యమై కదులు...

- రామ్ పెరుమాండ్ల



ఫైనల్లో ప్రణయ్

- సెమీస్‌లో ఓడిన పి.వి సింధు
- మలేషియా మాస్టర్స్ టోర్నీ

కౌలాలంపూర్ (మలేషియా)

మలేషియా మాస్టర్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. టైటిల్ ఫేవరేట్, అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో పరాజయం పాలవగా.. మెన్స్ సింగిల్స్‌లో సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్‌ఫైనల్స్ వరకు ఎదురులేని విజయాలతో పతక ఆశలు రేపిన మహిళల సింగిల్స్ మాజీ వరల్డ్ నం.2 సెమీస్ సమరంలో అనూహ్య పరాజయం చవిచూసింది. ఏడో సీడ్ గ్రిగోరియ టన్‌జంగ్ (ఇండోనేషియా) చేతిలో వరుస గేముల్లో ఓటమి చెందింది. హెచ్.ఎస్ ప్రణయ్ సెమీఫైనల్లో ప్రత్యర్థి వాకోవర్‌తో నేరుగా టైటిల్ పోరుకు చేరుకున్నాడు. నేడు అంతిమ సమరంలో చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యంగ్‌తో పోటీపడనున్నాడు.

చెమట పట్టకుండా!

పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో హెచ్.ఎస్ ప్రణయ్ తుది పోరుకు చేరుకున్నాడు. క్వార్టర్‌ఫైనల్లో కిదాంబి శ్రీకాంత్‌పై మెరుపు విజయం సాధించిన క్వాలిఫయర్ క్రిస్టియన్ (ఇండోనేషియా) శనివారం సెమీఫైనల్లో ప్రణయ్‌తో తలపడ్డాడు. క్రిస్టియన్‌పై ఆరంభం నుంచీ ఆధిపత్యం చూపించాడు ప్రణయ్. 11-2తో విరామ సమయానికి తొలి గేమ్‌లో తిరుగులేని ఆధిక్యం సంపాదించాడు. ద్వితీయార్థంలో క్రిస్టియన్ పుంజుకుని 15-15 వద్ద స్కోరు సమం చేసి ఉత్కంఠకు తెరతీశాడు. 19-17తో ప్రణయ్ తొలి గేమ్ సొంతం చేసుకునే క్రమంలో.. క్రిస్టియన్ మోకాలి గాయానికి గురయ్యాడు. నొప్పితోనే కోర్టును వీడిన క్రిస్టియన్ మళ్లీ రాకెట్ పట్టలేదు. తీవ్రమైన నొప్పితో క్రిస్టియన్ సెమీఫైనల్స్ నుంచి వాకోవర్ ఇచ్చాడు. అప్పటికే తొలి గేమ్‌లో ఆధిపత్యం చెలాయించిన హెచ్.ఎస్ ప్రణయ్ మరో గేమ్‌లో ఆడాల్సిన అవసరం లేకుండానే ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మరో సెమీఫైనల్లో చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యంగ్ 21-13, 21-19తో చైనీస్ తైపీ షట్లర్ లిన్ చున్ యిపై అలవోక విజయం నమోదు చేశాడు.



మహిళల సింగిల్స్‌లో పి.వి సింధు నిరాశపరిచింది. సుదీర్ఘ విరామం అనంతరం ప్రత్యర్థులపై ఎదురుదాడితో హడలెత్తించిన సింధు.. సెమీఫైనల్లో నిలకడ లేమి ఆటతీరుతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. 44 నిమిషాల సెమీఫైనల్ పోరులో ఇండోనేషియా అమ్మాయి గ్రిగోరియ టన్‌జంగ్ సాధికారిక విజయం సాధించింది. 14-21, 17-21తో పి.వి సింధు వరుస గేముల్లో ఇండోనేషియా షట్లర్‌కు తలొగ్గింది. తొలి గేమ్‌లో సింధు 3-0తో శుభారంభం చేసింది. కానీ ఇండోనేషియా షట్లర్ వేగంగా పుంజుకుంది. 7-7తో స్కోరు సమం చేసింది. 11-8తో ముందంజ వేసిన సింధు.. విరామం అనంతరం ఆధిక్యం నిలుపుకోలేదు. 12-12 వద్ద స్కోరు సమం చేసిన గ్రిగోరియ..16-13తో దూసుకెళ్లింది. అదే ఊపులో 21-14తో తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది. ఇక చావోరేవో తేల్చుకోవాల్సిన రెండో గేమ్‌లో సింధు అంచనాలను అందుకోలేదు. విరామ సమయానికి 9-11తో వెనుకంజ వేసిన సింధు.. ఆ తర్వాత ఏ దశలోనూ ఇండోనేషియా షట్లర్‌ను అందుకోలేదు. ఆధిక్యం నిలుపుకుంటూ ముందుకెళ్లిన గ్రిగోరియ 21-17తో రెండో గేమ్‌ను, ఫైనల్స్ బెర్త్‌ను ఖాతాలో వేసుకుంది. నేడు జరిగే తుది పోరులో జపాన్ స్టార్, టాప్ సీడ్ అకానె యమగూచితో టైటిల్ కోసం గ్రిగోరియ తలపడనుంది.

సిఎం కప్.. యువజన క్రీడోత్సవం

శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్

- నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు
- పోటీపడనున్న 7500 మంది అథ్లెట్లు

నవతెలంగాణ-హైదరాబాద్

సిఎం కప్ 2023 పోటీలను తెలంగాణ యువజన క్రీడోత్సవంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం కప్ పోటీలు అంతిమ ఘట్టానికి చేరుకున్నాయి. మండల, జిల్లా స్థాయి పోటీలు విజయవంతంగా ముగియగా, నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు షురూ కానున్నాయి. మండల స్థాయి పోటీల్లో 2 లక్షల మంది క్రీడాకారులు పోటీపడగా, జిల్లా స్థాయి పోటీల్లో 85 వేల మంది అథ్లెట్లు సత్తా చాటారు. నేటి నుంచి రాష్ట్ర స్థాయిలో జరిగే 18 క్రీడాంశాల్లో 7500 మందికి పైగా క్రీడాకారులు పోటీపడనున్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే సిఎం కప్ పోటీలకు శాట్స్ యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఆరంభోత్సవ ఏర్పాట్లు, క్రీడాకారులకు వసతి, భోజన, రవాణా ఏర్పాట్లను పర్యవేక్షించిన శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ 'నవ తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. సిఎం కప్ పోటీల ప్రత్యేకత, ఏర్పాట్లపై ఆయన మాటల్లోనే..



శనివారం మధ్యాహ్నం ఉన్నతాధికారులతో కలిసి క్రీడాకారులకు అందించే భోజనం చేస్తున్న శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్

గుర్తుండిపోయేలా ఆరంభ వేడుకలు

సిఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారమే మొదలు కానున్నాయి. ఆరంభ వేడుకలను సోమవారం నిర్వహిస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, సాంస్కృతిక సౌందర్యం ఉట్టిపడేలా ప్రారంభోత్సవ వేడుక ఉండనుంది. ఆస్కార్ వేదికపై మెరిసిన నాటు నాటు గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ సిఎం కప్ వేదికపై గాత్రం వినిపించనున్నాడు. ఆరంభ వేడుకకు ఐటీ శాఖ మంత్రి కెటిఆర్ ముఖ్య అతిథిగా రానున్నారు. తెలంగాణ రాష్ట్ర స్టార్ క్రీడాకారులు, వెటరన్ అథ్లెట్లు, క్రీడా పురస్కార గ్రహీతలు ఆరంభ వేడుకలకు హాజరు కానున్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న తొలి సిఎం కప్ పోటీల ఆరంభ వేడుకలు గుర్తుండిపోయేలా ప్రణాళిక చేస్తున్నాం.

క్షేత్ర స్థాయిలో అపూర్వ స్పందన

మండల, జిల్లా స్థాయి పోటీల పర్యవేక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాను. ఎక్కడికి వెళ్లినా గ్రామీణ క్రీడాకారుల నుంచి సిఎం కప్ పోటీలకు అపూర్వ స్పందన లభించింది. రెండు లక్షల మంది క్రీడాకారులు పోటీపడటం సాధారణ విషయం కాదు. ఏటూరు నాగారం వంటి ఏజెన్సీ ప్రాంతంలోనూ మండల స్థాయి పోటీలకు సుమారు ఐదు వేల మంది క్రీడాకారులు తరలివచ్చారు. 615 మండలాల్లో, 33 జిల్లాల్లో సిఎం కప్ పోటీలు పండుగ వాతావరణంలో విజయవంతం కావటం ఎంతగానో సంతృప్తినిచ్చింది.

పోటీల్లో బాలికల ముందంజ

సిఎం కప్ పోటీలను ప్రత్యక్షంగా చూసిన తర్వాత.. తల్లిదండ్రులు అమ్మాయిలను క్రీడల వైపు ప్రోత్సహించరనే అభిప్రాయమే పూర్తిగా మారిపోయింది. వాస్తవానికి మండల, జిల్లా స్థాయి పోటీల్లో అమ్మాయిల భాగస్వామ్యమే ఎక్కువ!. మండల స్థాయిలో ఫుట్‌బాల్‌ను పురుషులకు మాత్రమే నిర్వహించగా.. మహిళలకు సైతం నిర్వహించాలని పెద్ద ఎత్తున వినతులు వచ్చాయి. ఫుట్‌బాల్ పోటీలను అమ్మాయిలకు సైతం షెడ్యూల్ చేశాం. వ్యక్తిగత, జట్టు ఈవెంట్లలో పురుషులతో సమానంగా మహిళలు ప్రతిభ చాటారు. సిఎం కప్‌లో బాలికల భాగస్వామ్యం తెలంగాణలో క్రీడా ప్రగతికి నిదర్శనం.

అందుబాటులో మౌళిక సదుపాయాలు

తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే సిఎం కప్ పోటీలను మండల స్థాయి నుంచి నిర్వహిస్తున్నాం. అందుకు కారణం లేకపోలేదు. ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తీసుకు రావటంతో పాటు క్షేత్ర స్థాయిలో క్రీడా సముదాయాలు, మైదానాలు, మౌళిక సదుపాయాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో వినియోగంలోకి తీసుకు వచ్చాం. మండల స్థాయిలో క్రీడా ప్రాంగణాలను ఇక నుంచి శాట్స్ పర్యవేక్షించనుంది. సిఎం కప్ పోటీలతో 615 మండలాలు, 33 జిల్లాల్లో క్రీడా మైదానాలు, క్రీడా సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి!.

పకడ్బందిగా ఏర్పాట్లు

రాష్ట్ర పోటీలకు ఏర్పాట్లు పకడ్బందిగా చేస్తున్నాం. 33 జిల్లాల నుంచి క్రీడాకారులు ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా వసతి, భోజనం, రవాణా, త్రాగునీరు, పారిశుధ్యం, పోలీసు, ఆరోగ్యం విభాగాలకు సబ్ కమిటీలు వేశాం. మహిళా అథ్లెట్ల వసతి కేంద్రం, ఈవెంట్లు జరిగే స్టేడియం, ప్రయాణించే బస్సుల్లో మహిళా కానిస్టేబుల్ విధిగా ఉండనున్నారు. పోటీల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహించనున్నామని శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ తెలిపారు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2023 ఎక్కడ మొదలైందో, అక్కడే ముగించేందుకు సిద్ధమైంది. చెన్నై, గుజరాత్ మ్యాచ్‌తో మొతెరాలో మొదలైన ఐపీఎల్16.. నేడు అదే స్టేడియంలో సూపర్‌కింగ్స్, టైటాన్స్ మహా సమరంతో ముగియనుంది!. ఐదో టైటిల్‌తో ఐపీఎల్‌లో రికార్డు మరింత మెరుగుపర్చుకునేందుకు సూపర్‌కింగ్స్, రెండో టైటిల్‌తో ఐపీఎల్‌లో నయా ఆధిపత్యం చెలాయించేందుకు టైటాన్స్ ఎదురు చూస్తున్నాయి. క్రికెట్‌తో పాటు జీవితంలోనూ ధోని నుంచి ఎంతో నేర్చుకున్న హార్దిక్ పాండ్య.. నేడు గురువుపై గెలిచేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు!.

టైటిల్ కొట్టేదెవరు?

- ఐపీఎల్ ఫైనల్ పోరు నేడు
- ఐదుపై చెన్నై, రెండుపై టైటాన్స్ కన్ను
- రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-అహ్మదాబాద్

ఐపీఎల్ 16 అంతిమ సమరానికి సర్వం సిద్ధం. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్, నాలుగు సార్లు విజేత చెన్నై సూపర్‌కింగ్స్ నేడు టైటిల్ వేటలో అమీతుమీ తేల్చుకోనున్నాయి. సీజన్ ఆరంభ మ్యాచ్‌లో మొతెరాలో చెన్నైపై గుజరాత్ గెలుపొందగా.. క్వాలిఫయర్1లో చెపాక్ వేదికగా టైటాన్స్‌ను సూపర్‌కింగ్స్ మట్టికరిపించింది. నేడు తుది పోరు మళ్లీ మొతెరాలో జరుగనుండగా ఆతిథ్య జట్టుగా గుజరాత్ టైటాన్స్ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. అహ్మదాబాద్‌లో ఆడిన మూడు మ్యాచుల్లోనూ పరాజయం పాలైన చెన్నై సూపర్‌కింగ్స్.. ఇక్కడ తొలి విజయం కోసం నిరీక్షిస్తుంది. చెన్నై రికార్డు ఐదో టైటిల్‌పై కన్నేయగా.. ధోనీసేన (2010, 2011) తర్వాత ఐపీఎల్‌లో వరుస టైటిళ్లు సాధించిన జట్టుగా నిలిచేందుకు గుజరాత్ టైటాన్స్ ఉవ్విళ్లూరుతుంది. గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్‌కింగ్స్ ఐపీఎల్ టైటిల్ పోరు నేడు.



ధోని వర్సెస్ పాండ్య

టైటిల్ పోరును మహి వర్సెస్ హార్దిక్‌గా చూడవచ్చు. క్రికెట్‌లోనే కాదు జీవితంలోనూ ధోనిని మెంటార్‌గా చూస్తాడు పాండ్య. అటు చెన్నై, ఇటు గుజరాత్ జట్లు సుమారు ఒకే తరహా ఫార్ములాతో నడుస్తున్నాయి. ఆటగాళ్లకు స్వేచ్ఛ ఇవ్వటం, ఫామ్‌లో లేకపోయినా మద్దతుగా నిలువటం, ప్రశాంతమైన డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణం, ఫలితంపై కాకుండా ప్రక్రియపై ఫోకస్ పెట్టడం ఇరు జట్ల శైలి. అయితే, ఆట విధానంలో ఇరు జట్లు భిన్నం. టైటాన్స్ తడాఖా, సూపర్‌కింగ్స్ మ్యాజిక్ భిన్న అంశాలపై ఆధారపడి ఉంటుంది. కీలక ఫైనల్లో వ్యూహాత్మక ఎత్తుగడలే విజయాన్ని అందిస్తాయి. ధోని, పాండ్య నాయకత్వ పోటీ నేడు చూడవచ్చు.

టైటాన్స్ దూకుడు

క్వాలిఫయర్ 1లో తడబడిన టైటాన్స్.. క్వాలిఫయర్2లో ముంబయిపై చిత్తు చేసింది. శుభ్‌మన్ గిల్ సీజన్లో మూడో సెంచరీతో విశ్వరూపం చూపించాడు. శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్య, విజయ్ శంకర్, డెవిడ్ మిల్లర్‌లకు తోడు రషీద్ ఖాన్ బ్యాట్‌తో దండయాత్ర చేస్తుండటం గుజరాత్‌కు అత్యంత సానుకూలం. లక్ష్యాన్ని నిర్దేశించినా, ఛేదించినా టైటాన్స్ శిబిరంలో ఎటువంటి ఒత్తిడి కనిపించటం లేదు. మహ్మద్ షమి, మోహిత్ శర్మ పేస్ కాంబినేషన్ చెన్నైకి సవాల్‌గా మారనుంది. రషీద్ ఖాన్ 24 బంతులను ఎదుర్కొవటం సూపర్‌కింగ్స్‌కు మరో సమస్య. ముంబయిపై విజయోత్సాహంలో ఉన్న టైటాన్స్ నేడు ఫైనల్లో ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది.

సూపర్‌కింగ్స్‌కు ఎదురుందా?

సాధారణ ఆటగాళ్లతో అసమాన ప్రదర్శనలు రాబట్టడంలో ఎం.ఎస్ ధోని దిట్ట. ఈ సీజన్లో అది మరోసారి నిరూపితమైంది. సూపర్‌కింగ్స్ శిబిరంలో అరివీర భయంకర బ్యాటర్లు ఎవరూ లేకపోయినా.. జట్టుగా చెన్నై ప్రమాదకారి. రుతురాజ్ గైక్వాడ్, డెవాన్ కాన్వే, అజింక్య రహానెలకు తోడు యువ ఆల్‌రౌండర్ శివం దూబె చెన్నైని ముందుండి నడిపిస్తున్నారు. మోయిన్ అలీ, రవీంద్ర జడేజా, అంబటి రాయుడు మంచి ఫామ్‌లో ఉన్నారు. ధోని బ్యాట్‌తో దండెత్తకపోయినా.. నాయకుడిగా ప్రభావం చూపిస్తున్నాడు. దీపక్ చాహర్, మతీశ పతిరణ పేస్.. మహీశ్ తీక్షణ, జడేజా, మోయిన్ స్పిన్ కాచుకోవటం టైటాన్స్‌కు సైతం సవాలే.

పిచ్, వాతావరణం

ఈ సీజన్లో అహ్మదాబాద్‌లో భారీ స్కోర్లు నమోదయ్యాయి. ఇక్కడ ఎనిమిది మ్యాచుల్లో సగటు తొలి ఇన్నింగ్స్ స్కోరు 193 పరుగులు. వాటిలో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు ఐదుసార్లు గెలుపొందింది. మంచు ప్రభావం లేకపోవటం, తుది పోరు ఒత్తిడి దృష్ట్యా టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ చేసేందుకు మొగ్గు చూపవచ్చు. ఫైనల్ పోరుకు ఎటువంటి వర్షం ముప్పు లేదు!.

నవచిత్రం



మహేష్‌బాబు

డబుల్ ధమాకా..

'అతడు', 'ఖలేజా' వంటి సినిమాల తరువాత మహేష్ బాబు, త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'ఎస్ఎస్ఎంబి 28' (వర్కింగ్ టైటిల్). హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌లో ఎస్.రాధాకృష్ణ (చినబాబు) భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూజా హెగ్డే, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచే ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇటీవల విడుదలైన మహేష్ బాబు ఫస్ట్ లుక్ పోస్టర్‌కి అద్భుతమైన స్పందన లభించింది. గత కొద్దిరోజులుగా 'ఎస్ఎస్ఎంబి 28' టైటిల్ ఏంటో తెలుసుకోవాలనే ఆసక్తి అందరిలో నెలకొంది. తాజాగా చిత్ర బృందం టైటిల్ వెల్లడికి ముహూర్తం ఖరారు చేసింది. సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఈనెల 31న టైటిల్‌ని రివీల్ చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇక్కడ మరో విశేషం కూడా ఉంది. కృష్ణ నటించిన ఆల్ టైం హిట్స్‌లో ఒకటైన 'మోసగాళ్ళకు మోసగాడు' చిత్రాన్ని ఆయన జయంతి కానుకగా ఈనెల 31న 4కె ఫార్మెట్‌లో భారీ సంఖ్యలో థియేటర్లలో విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా ప్రదర్శించనున్న అన్ని థియేటర్లలో 'ఎస్ఎస్ఎంబి 28' చిత్రానికి సంబంధించిన టైటిల్ గ్లింప్స్‌ని విడుదల చేయనున్నారు. అంతేకాదు ఈ విడుదల కార్యక్రమం అభిమానుల చేతుల మీదుగా 'మాస్ స్ట్రైక్' పేరుతో విడుదల కానుంది. ఈ గ్లింప్స్ అభిమానులకి మాస్ ఫీస్ట్ అవుతుందని చిత్ర బృందం చెబుతోంది. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో ఈ

ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు

కేరళలో రీసెంట్ టైమ్స్‌లో ఇండస్ట్రీ హిట్‌గా నిలబడిన చిత్రం '2018'. ఈ చిత్రం శుక్రవారం తెలుగులో విడుదల అయింది. నిర్మాత బన్నీ వాసు తెలుగు ప్రేక్షకులకు అందించిన ఈ చిత్రానికి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ, 'పబ్లిసిటికి ఎక్కువ టైం లేకపోయినా నేను నమ్మింది ఒకటే.. ఇందులో ఉన్న కంటెంట్ మనిషి హృదయాన్ని కదిలిస్తుందని. ఇప్పటివరకు దాదాపు 17 సినిమాల వరకు తెలుగులో ప్రొడ్యూస్ చేసాను. కానీ ఈ సినిమా నాకు ఒక ఎక్స్ట్రా లేబుల్ ఇచ్చింది. కేరళలో మా 'గీత గోవిందం'ని రిలీజ్ చేసి, వచ్చిన ఫండ్స్‌ను అక్కడ వరదల టైంలో ఫండ్‌గా ఇచ్చాము' అని తెలిపారు. 'మా సినిమాని ఆదరిస్తున్న తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీకి చాలా కృతజ్ఞతలు. బన్నీవాసు గారు 63 లక్షలు 2018లో కేరళకి ఫండ్స్ ఇచ్చారు' అని దర్శకుడు జ్యూడ్ ఆంటోని అన్నారు. హీరో టోవినో థామస్ మాట్లాడుతూ,'ఈ సినిమాను ఊహించని స్థాయిలో రిసీవ్ చేసుకున్నందుకు చాలా థ్యాంక్యూ. ఈ సినిమాకి కేరళలో మాత్రమే కాకుండా అన్నిచోట్లా కూడా మంచి రెస్పాన్స్ వస్తుంది' అని అన్నారు.



బన్నీవాసు

హతవిధీ.. ఏందిదీ

'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా కోసం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ ఓ పాట పాడారు. ఈ సినిమాలో ధనుష్ పాడిన 2వ పాట 'హతవిధి' ఈనెల 31న విడుదల కానుంది. నవీన్ పోలిశెట్టి, అనుష్క శెట్టి ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. 'హతవిధి' పాట అనౌన్స్‌మెంట్ కోసం హీరో నవీన్ పోలిశెట్టి రిలీజ్ చేసిన ఫన్నీ వీడియో అందర్నీ విశేషంగా అలరిస్తోంది. ఈ చిత్రంలోని ఓ పాట పాడేందుకు నవీన్ పోలిశెట్టి చేసిన హంగామా ఏమిటో ఈ వీడియో చూస్తే అర్థమవుతుంది. ఆయనకి బదులు ధనుష్ ఈ పాట పాడిన విధానం అందర్నీ బాగా నవ్విస్తుంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్ పై మహేష్ బాబు.పి డైరెక్ట్ చేసిన ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మళయాల భాషల్లోనూ విడుదల కానుంది.



ధనుష్

సంగీత దర్శకుడు రాజ్‌కు ఘన నివాళి



తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్నో హిట్ సాంగ్స్‌కి సంగీతాన్ని అందించిన ప్రముఖ సంగీత దర్శకులు రాజ్(63) ఇటీవల గుండెపోటుతో మరణించిన సంగతి విదితమే. రాజ్ మృతికి సంతాపంగా తెలుగు టెలివిజన్ అండ్ డిజిటల్ మీడియా మ్యూజిషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో సంతాప సభ ఏర్పాటు చేశారు.
నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ, 'నాకు రాజుగారు దూరపు చుట్టం. ఆర్టిస్ట్ అవుదామని అనుకుంటున్నప్పుడు నేను మొదటిసారి వెళ్ళింది ఈయన ఇంటికే. రాజులు చాలామంది ఉంటారు కానీ అందులో మంచి రాజులు కొంత మందే ఉంటారు. అలాంటి వారిలో ఈ రాజుగారు ఒకరు' అని అన్నారు. సురేష్ కొండేటి మాట్లాడుతూ,'చిన్నప్పట్నుంచి రాజ్‌గారి పాటలు వింటూ పెరిగాను. నేను హైదరాబాద్‌కు వచ్చిన దగ్గర్నుంచి ఆయన్ని ఫాలో అవుతూ ఉండేవాడిని. 'సిసింద్రీ' షూటింగ్ సమయంలో ఆయన్ని కలిసే అవకాశం దొరికింది.
నేను రిలీజ్ చేసిన 'ప్రేమించాలి' సినిమాలో రాజ్ గారి కుమార్తె శ్వేతతో పాటలు పాడించాను. రాజ్ గారి మరో అమ్మాయి దివ్య కూడా చిరంజీవి 'ఖైదీ నెంబర్ 150' సినిమాకి డైరెక్షన్ డిపార్ట్మెంట్లో పని చేశారు. గొప్ప సంగీత దర్శకుడు రాజ్ మరణం మనకే కాదు సినీ పరిశ్రమ మొత్తానికి తీరని లోటు' అని తెలిపారు. ఇంత ఘనంగా నాన్నగారి సంతాప సభను ఏర్పాటు చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని రాజ్ కుమార్తెలు భావోద్వేగానికి గురయ్యారు.

ఊహించని మలుపులు..

'స్వాతిముత్యం' సినిమాతో సక్సెస్‌ఫుల్‌గా అరంగేట్రం చేసిన హీరో బెల్లంకొండ గణేష్ 'నేను స్టూడెంట్ సార్'తో థ్రిల్ ఇవ్వడానికి రెడీ అవుతున్నారు. రాకేష్ ఉప్పలపాటి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్వీ 2 ఎంటర్‌టైన్‌మెంట్ పై 'నాంది' సతీష్ వర్మ నిర్మించారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా జూన్ 2న ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో దర్శకుడు రాకేష్ ఉప్పలపాటి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. 'మాది భీమడోలు పక్కన యం.నాగుల పల్లి. 'చుక్కలాంటి అమ్మాయి చక్కనైన అబ్బాయి' సినిమా తర్వాత ఆనంద్ అనే కోడైరెక్టర్ తేజ గారికి పరిచయం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి 'అహింస' స్క్రిప్ట్ వరకూ తేజ గారితోనే జర్నీ చేశాను. ఈ సినిమాకి కృష్ణ చైతన్య కథ అందించారు. ఇదొక థ్రిల్లర్. కథ గురించి ఏం చెప్పినా సస్పెన్స్ రివీల్ అయిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మనకి ఇష్టమైన ఫోన్, అవసరమైన ఐడెంటిటీ.. భయపెట్టే గన్.. ఈ మూడింటి చుట్టూ కథ ఉంటుంది. హీరోకి, కమీషనర్‌కి వార్ ఎలా వచ్చిందనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ప్రతి ముప్పై నిమిషాలకు ఊహించని మలుపు వస్తుంది. ఇందులో మీరు ఎండ్‌ని, విలన్‌ని, కథ ఏ స్వరూపంలోకి వెళుతుందో అనేది ఊహించలేరు. సినిమా ఆసాంతం ఎంగేజ్ చేస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే సినిమా ఇది. ఇప్పటి వరకు మూడు ప్రివ్యూలు వేశాం. అన్నింటికి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మరో సినిమా చేస్తున్నామని మా నిర్మాత సతీష్ అడ్వాన్స్ ఇచ్చారు. అలాగే మూడు పెద్ద బ్యానర్ల నుంచి కాల్స్ వచ్చాయి' అని అన్నారు.



రాకేష్

అందర్నీ మెప్పించే అలా నిన్ను చేరి

దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో రాబోతున్న చిత్రం 'అలా నిన్ను చేరి'. విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్నారు.



పాయల్ రాధాకృష్ణ, దినేష్ తేజ్, హెబ్బా పటేల్

ఈ చిత్రంతో మారేష్ శివన్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్, గ్లింప్స్, హీరో బర్త్ డే స్పెషల్ పోస్టర్ ఇలా అన్నింటికీ సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాను నిర్మాత ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ ఎత్తున నిర్మించారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ అవుతుందని మేకర్లు చెబుతున్నారు.
ఈ సినిమాకు సుభాష్ ఆనంద్ సంగీతం అందించగా, ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ అన్ని పాటలు రాయడం విశేషం. ఐ ఆండ్రూ కెమెరామెన్‌గా, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా ఈ సినిమాకు పని చేశారు. త్వరలోనే ఈ మూవీ రిలీజ్ డేట్‌ను మేకర్లు ప్రకటించనున్నారు.

సరికొత్త మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్

'చక్రవ్యూహం' - ది ట్రాప్ (ఉపశీర్షిక) ట్రైలర్‌ను యువ కథానాయకుడు సాయిధరమ్ తేజ్ రిలీజ్ చేశారు. విలక్షణ పాత్రలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న అజయ్ ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషించారు. మిస్టరీ క్రైమ్ నేపథ్యంలో సాగే ఈ కథని మధుసూదన్ దర్శకత్వంలో సహస్ర క్రియేషన్స్ బ్యానర్ పై సావిత్రి నిర్మించారు.
ఈ సినిమా అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని జూన్ 2న థియేటర్స్‌లో రిలీజ్ అవుతుంది.
సినిమా సినిమాకి అందులో ఉన్న పాత్రకి తగ్గట్టు బాడీ లాంగ్వేజ్, హావభావాలతో తగిన న్యాయం చేస్తూ ఎదిగిన నటుడు అజయ్ ఈ క్రైమ్ స్టోరీలోను అదే రీతిన ప్రేక్షకుల మెప్పు పొందుతారు. ట్రైలర్ ఆద్యంతం సస్పెన్స్‌ని క్రియేట్ చేసింది. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కథపై మరింత ఆసక్తి పెంచింది. మరోసారి అజయ్ తన అద్భుతమైన నటన కనపరిచాడు. ఇటీవల రిలీజ్ అయిన టీజర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా నైజాం, సీడెడ్ హక్కులని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ శశిధర్ రెడ్డి కొనుగోలు చేశారు' అని చిత్ర బృందం తెలిపింది.



అజయ్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

పంట పోయినంక.. ధర పెరిగింది

పసుపు క్వింటాకు రూ.1500-2000 పెరుగుదల

- మార్చి నెలఖరుకే రైతుల నుంచి కొనుగోలు
- బడా భూస్వాములకు, దళారులకు లాభాలు
- క్వింటాకు రూ.15 వేలు ప్రకటించాలని రైతన్నల డిమాండ్
- నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- బోర్డు విషయంలోనూ ఇదే తీరు



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పసుపు మార్కెట్ మాయాజాలంతో మరోసారి రైతన్న కుదేలయ్యాడు. ఆరుగాలం కష్టపడి పంటను పండించి మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతు కన్నా.. ఆ పంటను అగ్గువకు కొని నిలువ చేసుకుని ఇప్పుడు అమ్ముకుంటున్న దళారులు, వ్యాపారులకు, బడా భూస్వాములకు పసుపు పంట లాభాలు కురిపిస్తోంది. సీజన్‌లో ఒక్కసారిగా పంట మార్కెట్‌కు పోటెత్తడంతో క్వింటాకు రూ.4000 నుంచి రూ.4,500కు కొనుగోలు చేసిన వ్యాపారులు.. ప్రస్తుతం అదే పంటను క్వింటాకు రూ.6000-రూ.6500కు అమ్ముకుంటున్నారు. ఈ సీజన్‌లో భారీ వర్షాలతో పంట మునిగి పసుపు దిగుబడి తగ్గడంతో పాటు మార్కెట్‌లోనూ ధర లేక రెండు విధాలుగా పసుపు రైతు నష్టపోయాడు. పసుపు పంటకు క్వింటాకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించాలన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రతియేటా పసుపు రైతు నష్టపోతూనే ఉన్నాడు.

నిజామాబాద్ జిల్లా పసుపు పంటకు పెట్టింది పేరు. జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్, మెండోరా మండలాలతో పాటు పక్క జిల్లా జగిత్యాలలో రైతులకు పసుపు పంట జీవ నాధారం. భారతదేశంలో అత్యధికంగా పసుపు సాగయ్యే ప్రాంతాల్లో నిజామాబాద్ కూడా ప్రధానమైనది. ఇక్కడ దిగుబడి అయ్యే పంట దేశవిదేశాలకు ఎగుమతి అవుతోంది. ఇక సంఖ్యా బలం పరంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో అభ్యర్థుల రాజకీయ తలరాతలను తారుమారు చేసే సత్తా ఇక్కడి పసుపు రైతులకు ఉన్నది. అంతటి ప్రాచుర్యం కలిగిన పసుపు పంటను సాగు చేస్తున్న రైతులకు మాత్రం నష్టాలే ఎదురవుతున్నాయి. ఈ సీజన్‌లో జిల్లాలో 35 వేల ఎకరాల్లో పంటను సాగు చేశారు. ఈ పంటను జనవరి నెలఖారు నుంచి ఏప్రిల్ చివరి వరకు రైతులు మార్కెట్‌లో విక్రయించారు. కానీ సీజన్‌లో పసుపు పంట ధర భారీగా పతనమయ్యింది. ఒక్కసారిగా మార్కెట్‌కు పంట పోటెత్తడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను అమాంతం తగ్గించారు. క్వింటాకు కేవలం రూ.4000-రూ.4500 వరకు కొనుగోలు చేశారు. అంతకముందు యేడాది రైతులు తమ పంటను రూ. 8000 వరకు కూడా అమ్మకాలు చేశారు. కానీ ఈ యేడాది ధర ఏమాత్రమూ పెరగలేదు. ఒక్కో రోజు మార్కెట్‌కు 14,000 క్వింటాళ్ల వరకు పసుపు వచ్చి చేరింది. కానీ 90 శాతం మంది రైతుల పంటను క్వింటాకు రూ.5000 లోపు కొనుగోలు చేశారు. అమ్మకం సీజన్ ముగియగానే పసుపు ధర అమాంతం పెరగడం గమనార్హం. ప్రస్తుతం జిల్లాలో క్వింటాకు ధర రూ.1500-రూ.2000 పెరిగింది. అత్యధికంగా రూ.8289 ధర కూడా పలికింది. పైగా ఈ ధర రానున్న రోజుల్లో క్వింటాకు రూ.9 వేల నుంచి రూ.10 వేలు కూడా పెరగొచ్చని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. సీజన్‌లో రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి నిల్వ చేసుకున్న దళారులు, వ్యాపారులు, బడా భూస్వాములు ప్రస్తుతం రెండింతల లాభాలు పొందుతున్నారు.

మహారాష్ట్ర రైతు కన్నా తక్కువ ధర...

మహారాష్ట్రలో సాగు చేసే పసుపు పంటతో పోల్చితే జిల్లాలో సాగయ్యే పసుపు పంట నాణ్యత ఎక్కువగా ఉంటుంది. కానీ విచిత్రమేమిటంటే జిల్లా రైతుల కన్నా ప్రస్తుతం మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్న మహారాష్ట్ర రైతులకు ధర ఎక్కువ పలకడం గమనార్హం. జిల్లాలో సాగయ్యే పసుపుతో పోల్చితే మహారాష్ట్ర పంటలో కొంత ఎరుపు రంగు వస్తుంది. కానీ ఇప్పుడు ఈ పంటకు సగటున క్వింటాకు రూ.6060 వరకు పలుకుతోంది. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మే నుంచి జూన్ వరకు మహారాష్ట్ర పసుపు అమ్మకాలు జరుగుతాయి.

బయటి మార్కెట్‌లో డిమాండ్ వల్ల ధర పెరుగుదల

సీజన్‌లో కొన్న ధర కంటే ప్రస్తుతం ధర పెరిగిన మాట వాస్తవమే. రూ.1500 నుంచి రూ. 2000 వరకు ధర పెరిగింది. పసుపునకు డిమాండ్ పెరిగితే ధర పెరుగుతుంది. జిల్లాలో రైతులు పండించే పంటల్లో నాణ్యతలో చాలా రకాలుగా ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ పెరిగితే ఇక్కడి వ్యాపారులు ధర పెంచి కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఈ-నామ్‌లో కొనుగోలు చేసే వ్యాపారులు కమీషన్ ఏజెంట్లుగా ఉన్నారు. బయట ధర పెరిగితే ఆ ధర ఆధారంగా కొనుగోలు చేస్తున్నారు.

- వెంకటేశం, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి

పసుపు రైతులను పట్టించుకోని మోడీ సర్కారు..

పసుపు రైతుల మద్దతుతో నిజామాబాద్ లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకున్న కేంద్రంలోని బీజేపీ సర్కారు.. రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. ఐదు రోజుల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి ఎన్నికల్లో గెలిచిన తరువాత అటకెక్కించింది. పసుపు బోర్డు తరువాత ఈ ప్రాంత రైతుల రెండో ప్రధానమైన డిమాండ్‌ను కూడా కేంద్రం పట్టించుకోకపోవడం గమనార్హం. పసుపు పంటకు క్వింటాకు రూ.15 వేల మద్దతు ధర చెల్లించాలని గత లోక్ సభ ఎన్నికల్లో రైతులు ఆందోళన చేపట్టిన విషయం తెలి సిందే. బీజేపీ అధికారంలోకి వస్తే పసుపు పంటకు గిట్టు బాటు ధర కల్పిస్తామని, దేశవిదేశాల్లో బ్రాండ్ ప్రచారం కల్పించి ధర పెరిగేలా కృషి చేస్తామని చెప్పిన ఎంపీతో పాటు బీజేపీ పెద్దలు ప్రస్తుతం మాటెత్తడం లేదు. ఒకవేళ రైతుల డిమాండ్ మేరకు కేంద్ర ప్రభుత్వం పసుపు పంటకు క్వింటాకు రూ.15 వేలు పెంచినట్టయితే రైతులకు నష్టాలు మిగిలేవి కావు.

అడవుల రక్షణ, పునరుద్ధరణే ప్రాధాన్యం

- ప్రత్యామ్నాయ అడవుల పెంపకం,
- రికార్డు స్థాయిలో కొత్త ఫారెస్ట్ బ్లాక్ల నోటిఫికేషన్
- బీడీ కార్మికులకు సేకరణ ఛార్జీలు, బోనస్ ఆన్ లైన్ ద్వారా నేరుగా ఖాతాలకు చెల్లింపు
- కోతుల బెడద నివారణకు స్టెరిలైజేషన్ సెంటర్లు పెంచుతాం : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అడవుల రక్షణ, పునరుద్ధరణే తమ తొలి ప్రాధాన్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నొక్కిచెప్పారు. ప్రత్యామ్నాయ అడవుల పెంపకం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. అటవీశాఖ పనితీరు, పురోగతిపై శనివారం హైదరాబాద్‌లో బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు.బీడీ కార్మికులకు సేకరణ ఛార్జీలు, బోనస్ ఆన్‌లైన్ ద్వారా నేరుగా ఖాతాలకు చెల్లింపు ప్రక్రియను అధికారులతో కలిసి ప్రారంభించారు. సుమారు లక్ష మంది లబ్దిదారులకు 220 కోట్ల రూపాయల బోనస్ ను చెల్లించటం పట్ల మంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు. హరితహారాన్ని విజయవంతం చేసి, గణనీయంగా పచ్చదన శాతం పెరిగేందుకు కృషి చేస్తున్న అధికారులు, సిబ్బంది, భాగస్వామ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కంపా నిధుల ద్వారా అడవులను అభివృద్ధి చేస్తున్న రాష్ట్రాల్లో మనమే అగ్రస్థానంలో ఉన్నామని అన్నారు. కొత్తగా 135 అటవీ బ్లాక్‌లను అభివృద్ధి చేస్తూ, సుమారు 14 వేల ఎకరాల అడవిని సృష్టించామని వివరించారు. ఆ అటవీ బ్లాక్ లను ప్రభుత్వం ద్వారా నోటిఫై కూడా చేయటం ఒక రికార్డు అన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కోతుల బెడద అధికంగా ఉందనీ, రైతులు ఇబ్బంది పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. నిర్మల్‌లో నెలకొల్పిన స్టెరిలైజేషన్ సెంటర్ తరహాలో దశల వారీగా అన్ని జిల్లాలకు విస్తరించాలని సూచించారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ నుంచి గ్రామాల తరలింపు పురోగతి, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో టైగర్ కారిడార్ల విస్తృతిపై చర్చించారు. అటవీ నేరాల అదుపులో కఠినంగా ఉండాలనీ, అవసరమైతే పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని పీడీ కేసులు పెట్టాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న విజిలెన్స్ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని నిర్ణయించారు. అటవీశాఖలో ఖాళీల భర్తీని టీఎస్‌పీఎస్‌తో సంప్రదింపుల ద్వారా త్వరగా రిక్రూట్ మెంట్ జరిగేలా చూడాలని ఆదేశించారు. వీలున్న అన్ని ప్రాంతాల్లో బాధ్యతాయుత ఎకో టూరిజాన్ని ప్రోత్సహించాలని సూచించారు. జూన్ 19 నుంచి ప్రారంభమయ్యే తెలంగాణ హరితోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమీక్షలో పీసీసీఎఫ్, హెచ్‌ఓఎఫ్ఎఫ్ ఆర్ఎం.డోబ్రియాల్, అటవీ అభివృద్ధి సంస్థ వీసీ, ఎమ్‌డీ చంద్రశేఖరరెడ్డి, అటవీశాఖ జాయింట్ సెక్రటరీ ఎం. ప్రశాంతి, పీసీసీఎఫ్‌లు లోకేశ్ జైస్వాల్, ఎలూసింగ్ మేరు, ఎంసీ పర్గెయిన్, అదనపు పీసీసీఎఫ్ సునీతా భగవత్, ఆర్థిక

92 శాతం కంటి పరీక్షలు పూర్తి

సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిర్దేశించుకున్న లక్ష్యంలో 92 శాతం కంటి పరీక్షలు పూర్తయ్యాయి. ఈ మేరకు శనివారం సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో ఇప్పటి వరకు ఒక కోటి 54 లక్షల 58 వేల 982 మందికి కంటి పరీక్షలను చేశారు. వీరిలో 21,85,945 మందికి రీడింగ్ గ్లాసెస్ అందజేశారు. 11,862 గ్రామ పంచాయతీ వార్డులు, 3,495 మున్సిపల్ వార్డుల్లో కంటి పరీక్షలు వంద శాతం పూర్తి చేశారు. జూన్ 15 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఒక కోటి 15 లక్షల 13 వేల 797 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని నిర్ధారించారు. నివారించదగ్గ అంధత్వరహిత తెలంగాణగా మార్చే లక్ష్యంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

నిర్మల్ బస్టాండ్‌లో కమర్షియల్ కాంప్లెక్స్

ఫంక్షన్‌హాల్, దుకాణ సముదాయాల నిర్మాణం

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో టీఎస్ఆర్టీసీ చైర్మెన్ సమీక్ష

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నిర్మల్ బస్టాండ్‌లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల్ని వేగంగా చేపట్టాలని మంత్రి ఏ ఇంద్రకరణ్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. శనివారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రితో టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్థన్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ బస్టాండ్‌లో చేపడుతున్న నిర్మాణాల గురించి వివరించారు. రూ.35 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఫంక్షన్‌హాల్‌తో పాటు 53 దుకాణ సముదాయాలు కూడా ఉంటాయని వివరించారు. 1.3 ఎకరాల్లో అత్యాధునిక హంగులతో ఈ కాంప్లెక్స్‌ను సెల్లార్‌తో పాట జీ ప్లస్ వన్ గానిర్మిస్తున్నట్టు తెలిపారు. దీనివల్ల టీఎస్ఆర్టీసీకి అదనపు ఆదాయం వస్తుందని చెప్పారు. సమావేశంలో టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈ వినోద్‌కుమార్, సిటిఎం విజయ్‌కుమార్, సీసీఈ రాంప్రసాద్, సివిల్ ఇంజనీర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి

నవతెలంగాణ- తుంగతుర్తి



సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామంలో శనివారం వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి కూలీ కొండ వీరస్వామి (75) గ్రామ సమీపంలోని అవుసలోని కుంటలో ఉపాధి పనికి వెళ్లాడు. ఎండ తీవ్రతతో వడదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తోటి కూలీలు వీరస్వామికి సపర్యలు చేస్తుండగానే మృతిచెందాడు. పనిప్రదేశంలో టెంట్, నీటి సౌకర్యం కల్పించడం లేదని, ఉపాధి హామీ అధికారుల నిర్లక్ష్యం వల్లే వీరస్వామి మృతిచెందాడని గ్రామస్తులు ఆరోపించారు. మృతుని కుటుంబానికి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర సర్కార్ విశేష కృషి

కోకాపేటలో పద్మశాలి ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపన

మంత్రులు హరీష్ , గంగుల , తలసాని, శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర సర్కార్ విశేష కృషి చేస్తున్నదని మంత్రి గంగుల కమలాకర్ చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని కోకాపేటలో 2.5 ఎకరాల్లో రూ.5కోట్లతో పద్మశాలి ఆత్మగౌరవ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సహచర మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ కులవృత్తులకు చేయూత నిస్తూనే బలహీనవర్గాల్లో అక్షర చైతన్యం తీసుకొస్తున్నదని చెప్పారు. అందుకు తగిన విధంగా 310 బీసీ గురుకులాలను నిర్వహిస్తూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విద్యను అందిస్తుందన్నారు. గతంలో దరఖాస్తు ఇచ్చి దండంపెట్టినా ఒక్క రూపాయి ఏ ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. అత్యధిక శాతంగా ఉన్న బీసీలకు ఆసరా పింఛన్లలో పెద్ద మొత్తం కేటాయిస్తూ ఆత్మగౌరవంతో జీవించేలా భరోసానిస్తున్నారన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాయని తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

అవినాశ్‌రెడ్డికి ఊరట

ఈ నెల 31 వరకు అరెస్టు వద్దు

ముందస్తు బెయిల్‌పై అదేరోజు తీర్పు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డిని ఈ నెల 31 వరకు అరెస్టు వంటి కఠిన చర్యలు తీసుకోరాదని సీబీఐకి హైకోర్టు ఆదేశించింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శనివారం సుదీర్ఘ వాదనలు ముగిశాయి. దీంతో తుది ఉత్తర్వులను ఈ నెల 31న జారీ చేస్తామని జస్టిస్ లక్ష్మణ్ వెల్లడించారు. హైదరాబాద్ ఆస్పత్రిలో అవినాష్ తల్లికి శస్త్రచికిత్స జరుగనుందని, తండ్రి ఇదే కేసులో జైల్లో ఉన్నారని, ఈ నేపథ్యంలో అవినాష్ తల్లి దగ్గర ఉండాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. అవినాష్, సీబీఐ, వివేకా కూతురు సునీతల వాదనలు విన్నామని, తుది ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పింది. అవినాష్‌కు ఎంపీ సీటు ఇవ్వాలని ముందే పేరు ఖరారు చేసినప్పుడు, ప్రచారం కూడా చేసుకుంటున్నప్పుడు ఎంపీ టిక్కెట్ కోసం వివేకాను హత్య చేయాల్సిన అవసరం ఏముందని హైకోర్టు సీబీఐని ప్రశ్నించింది. సామాన్యుల కేసుల్లో కూడా విచారణ ఇదే తరహాలో జాప్యం అవుతుందా అని ప్రశ్నించింది. దీనిపై సీబీఐ న్యాయవాది స్పందిస్తూ, కోర్టుల్లో కేసులు వేసి అవినాష్ కాలయాపన చేస్తున్నారని జవాబు చెప్పింది. భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డిలను కస్టడీలో ఉండగా విచారణ చేసినా ఫలితం లేకపోయిందని తెలిపింది. హత్య జరిగిన రోజు అవినాష్ జమ్మలమడుగు వెళ్లలేదని, ఇంట్లోనే ఉన్నారని ఎలా చెబుతారని హైకోర్టు ప్రశ్నకు ఇప్పుడే ఆ వివరాలు వెల్లడించలేమని సీబీఐ చెప్పింది.

యాదాద్రిలో సౌకర్యాలు మెరుగుపర్చండి

దేవాదాయ శాఖపై మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సమీక్ష

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆలయాల అభివద్ధి, దేవాదాయ భూములు సంరక్షణతో పాటు యాత్రీకులు సంతప్తి చెందేలా సౌకర్యాలు కల్పించాలని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శనివారంనాడాయన దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా చేపట్టిన ధూప దీప నైవేద్య పథకం వర్తింపు ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కామన్ గుడ్ ఫండ్ నిధుల ద్వారా చేపట్టిన ఆలయాల అభివద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను దేవాదాయశాఖ తరపున ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. అన్యాక్రాంతమైన దేవదాయశాఖకు చెందిన భూములను తిరిగి రాబట్టేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఇప్పటి వరకు 6,002 ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. కోర్టు కేసుల్ని త్వరగా పరిష్కరించాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఉద్యోగులు బాధ్యతయుతంగా పని చేయాలనీ, భక్తుల విశ్వాసాలను గౌరవించాలని చెప్పారు. యాదాద్రిలో భక్తులకు వసతులు మరింత మెరుగుపర్చాలని ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, అదనపు కమీషనర్లు జ్యోతి, కష్ణవేణి, స్తపతి వల్లినాయగం తదితరులు పాల్గొన్నారు.

అప్పుల కుప్పగా తెలంగాణ : వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై ప్రతిపక్షాలు చేసేది గోబెల్స్ ప్రచారమంటూ ఆర్థిక మంత్రి హరీశ్‌రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. తొమ్మిదేండ్లుగా అబద్దాల పాలన చేస్తున్న సీఎంను ఏమనాలని ప్రశ్నించారు. గోబెల్స్ ప్రచారానికి అసలుసిసలు వారసులు సీఎం కేసీఆర్ అని తెలిపారు. బంగారు తునక అని చెప్పి రూ.4.50లక్షల కోట్ల అప్పులు చేయటమేంటని ప్రశ్నించారు. అయినా రుణమాఫీకి, డబుల్ బెడ్ రూం ఇండ్లకు డబ్బు లేదని చెబుతున్నారని విమర్శించారు. చేసిన అప్పులకు ఏడాదికి రూ.30వేల కోట్ల మిత్తీలు కట్టేది నిజం కాదా? అని ప్రశ్నించారు.

వ్యాధిని స్ఫూర్తిగా మార్చుకున్న కమల్ షా

"సిల్వర్ లైనింగ్" పుస్తకాన్ని ఆవిష్కరణలో ఎంపీ శశి థరూర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యాధితో ఓడిపోకుండా ఆ వ్యాధినే స్ఫూర్తికి మూలంగా మార్చుకున్న నెఫ్రో ప్లస్ సహ వ్యవస్థాపకులు కమల్ షా జీవిత ప్రయాణం స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ శశిథరూర్ కొనియాడారు. శనివారం హైదరాబాద్ లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన కమల్ షా రాసిన "సిల్వర్ లైనింగ్ - ఓవర్‌కమింగ్ అడ్వర్సిటీ టు బిల్డ్ నెఫ్రోప్లస్, ఇండియాస్ లార్జెస్ట్ డయాలసిస్ ప్రొవైడర్" పుస్తకాన్ని ఆవిష్కరించారు. డయాలసిస్ రోగి అయిన కమల్ షా తాను బాధపడినట్టుగా ఎవరూ బాధపడకూడదని నెఫ్రో ప్లస్ ను స్థాపించారని తెలిపారు. ఇంకా పుట్టని తరాల వారి కోసం సైతం దాన్ని ఎప్పటికీ నిర్వహణలో ఉంచాలని కమల్ షా నిర్ణయం తీసుకున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయని ఉషా ఉతుప్, రచయిత, బిజినెస్ కామెంటేటర్, టాటా సన్స్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ గోపాలకృష్ణన్, చలనచిత్ర నిర్మాత మధు మంతెన పాల్గొన్నారు.

పర్యాటక శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

సీఎం కేసీఆర్‌కు చాడ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో 20 ఏండ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. ఆ ఉద్యోగుల వయో పరిమితిని 61 ఏండ్లకు పెంచాలని కోరారు. తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో చాలీచాలని వేతనాలతో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారిని క్రమబద్ధీకరణ చేస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికీ ఆ ప్రక్రియను చేపట్టకపోవడంతో ఉద్యోగులు నిరుత్సాహంతో ఉన్నారని తెలిపారు. తెలంగాణ విభజన తర్వాత టూరిజం కార్పొరేషన్‌కు 941 పోస్టులను కేటాయించారని పేర్కొన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో 183 మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు.

ధాన్యంలో దళారీ

రైతులను అడ్డుపెట్టుకొని కొనుగోలు కేంద్రాల్లోకి ఎంట్రీ



- ముందుగా రైతుల నుంచి క్వింటాల్ రూ.1500లోపు కొనుగోలు
- వెంటనే డబ్బులు చెల్లిస్తుండటంతో అమ్ముతున్న అన్నదాతలు
- నిర్వాహకులతో కుమ్మక్కు.. రైతుకు క్వింటాకు రూ.560 నష్టం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రైతుల కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోకి దళారీలు ప్రవేశిస్తున్నారు. మిల్లర్ల కొర్రీలు, కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి నిరీక్షణతో విసిగి వేసారిన అన్నదాతలు దళారుల వైపు మొగ్గు చూపుతున్నారు. కేంద్రాల్లో ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్ రూ.2,060, బీ గ్రేడ్ రూ.2,040 చొప్పున కొనుగోలు చేస్తున్నా మిల్లర్ల కొర్రీలు, విచ్చలవిడిగా తరుగు తీస్తుండటం, రోజులు తరబడి కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షించాల్సి రావటంతో విసిగి వేసారిన రైతులు దళారులనే ఆశ్రయిస్తున్నారు. అన్నింటికీ మించి ధాన్యం అమ్మిన వెంటనే దళారీలు డబ్బులు ఇస్తుండటంతో క్వింటాల్ రూ.1,500 లోపు ధరకే తెగనమ్ముకుంటున్నారు. తిరిగి అదే ధాన్యాన్ని దళారీలు రైతుల పట్టేదారు పాస్‌పుస్తకాలు, ఇతరత్రా ఆధారాలను అడ్డుపెట్టుకుని కొనుగోలు కేంద్రాల్లోనే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్ముకుని లాభాలు గడిస్తుండటం గమనార్హం.

ఆలస్యం.. కొద్దిరోజులకే మూత

ఉత్పత్తి ప్రారంభమైన నెల, నెలన్నర రోజుల తర్వాత రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు తెరుచుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 7,100 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మార్చి నెలలోనే ధాన్యం దిగుబడి ప్రారంభమైనా ఏప్రిల్‌లోగానీ కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. ఈలోపు పలువురు రైతులు ఎలాంటి తరుగు లేకుండా పచ్చివడ్లనే క్వింటాల్ రూ.1,100 చొప్పున మిల్లుల్లో అమ్ముకున్నారు. ఉప్పుడు బియ్యానికి ఉపయోగపడతాయని మిల్లర్లు వీటిని కొనుగోలు చేశారు. కొందరు దళారులకు క్వింటాకు 5 కేజీల తరుగుతో విక్రయించారు.

ఆలస్యంగా మేలుకున్న సర్కారు కేంద్రాలను ప్రారంభించి పట్టుమని నెలన్నర రోజులు కూడా కాకముందే సరుకు రావట్లేదనే కారణంతో సగం మూతబడ్డాయి. అయితే కొనుగోలు కేంద్రాలు మూతబడే ముందు అధికారులు రైతులకు సమాచారం ఇవ్వాలి. కానీ ఇవేవీ జరగట్లేదు. కేంద్రాన్ని మూసే క్రమంలో పదిమంది రైతులతో కలిపి దళారీ ధాన్యాన్ని కూడా కాంటాలు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పైగా దళారీ ధాన్యానికి ఎటువంటి కొర్రీలు లేకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు జాగ్రత్త పడుతున్నట్టు సమాచారం. ఇందుకు కేంద్రాల నిర్వాహకులకు క్వింటాకు రూ.100 నుంచి రూ.200 వరకు దళారీ నుంచి అందుతున్నాయనే ఆరోపణలున్నాయి.

దళారీకే ప్రా'ధాన్యం'

కొనుగోలు కేంద్రాల్లో దళారీలకే ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆరోపణలున్నాయి. కేంద్రాల నిర్వాహకులకు దళారీలు తమ లాభంలో కొంత ముట్టజెప్పుతుండటంతో వారికి కొమ్ముకాస్తున్నట్టు చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరులో ఇటీవల కేంద్రాలు మూతబడే ముందు ఈ తంతు ఎక్కువగా కొనసాగినట్టు తెలుస్తోంది. తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాలు, మహబూబాబాద్ జిల్లాలో మరిపెడ, డోర్నకల్, కురవి, తదితర మండలాల్లోని కేంద్రాల్లో ఇప్పుడు ఈ తంతు కొనసాగుతుందనే ఆరోపణలున్నాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 236 కేంద్రాలను తెరవగా దీనిలో 119 కేంద్రాలు మూతబడ్డాయి. వీటిలో గురువారం వరకు 1,16,593.28 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వీటిలో దళారీలకు సంబంధించిన ధాన్యం 30శాతం పైగా ఉంటుందని అంచనా. మరోవైపు దళారీల ధాన్యం వెంటనే మిల్లులకు తరలిస్తుండగా.. అక్కడ ఎలాంటి కొర్రీలు లేకుండా దిగుమతి చేసుకునేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత దళారీలు తమ పరపతిని వినియోగిస్తున్నట్టు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లోని ఇబ్బందులకు తాళలేక రైతులు ఇష్టానుసారంగానే దళారీలకు అమ్ముతుండటం.. పైగా తమ ప్రూఫ్స్ కూడా ఇస్తుండటంతో దళారీల పని సులువవుతోంది. ఈ విషయాన్ని బయటకు వెల్లడించేందుకు కూడా రైతులు ముందుకు రావడం లేదు. పైగా దళారీ ధాన్యానికి సంబంధించిన నగదు వెంటనే చెల్లించాలని రైతు కోరితే నూటికి రూ.1-2 చొప్పున కోత పెడుతున్నట్టు కొందరు ఆరోపిస్తున్నారు. వారం, పదిరోజుల సమయం ఉంటే మాత్రం ఎలాంటి కోతపెట్టకుండా నగదు చెల్లిస్తున్నారని రైతులంటున్నారు.

- మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం..

మధుసూదన్, అదనపు కలెక్టర్, ఖమ్మం

దళారీల విషయం మా దృష్టికి రాలేదు. ఎక్కడైనా దళారులు అమ్ముతున్నట్టు తెలిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. దీనిపై దృష్టి సారిస్తాం.

జాతీయ భద్రతపై మోడీ ప్రభుత్వం రాజీ : కాంగ్రెస్

గౌహతి : జాతీయ భద్రతపై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజీ పడుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అజయ్ మాకెన్ విమర్శించారు. ఎన్నికల ప్రయోజనాల కోసం విద్వేష రాజకీయాలను మోడీ ప్రభుత్వం ఉపయోగిస్తుందని, రాజ్యాంగ విలువలను - ప్రజాస్వామ్య సంస్థలను బలహీనం చేస్తుందని ఆయన అన్నారు. తొమ్మిదేళ్ల పూర్తయిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తిచూపేందుకు 35 నగరాల్లో 'తొమ్మిదేళ్ల తొమ్మిది ప్రశ్నలు' పేరుతో విలేకరుల సమావేశాలు నిర్వహిస్తామని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గౌహతిలో అజయ్ మాకెన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించకూడదని బిజెపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మాకెన్ విమర్శించారు. ఆర్థిక అసమానతలు భారీగా పెరుగుతున్నప్పటికీ దేశ ఆస్తులను మోడీ తన స్నేహితులకు విక్రయిస్తున్నారని చెప్పారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని, ప్రతిపక్ష పార్టీలపై ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నారని తెలిపారు. రైతులకు ఆదాయం రెట్టింపు చేస్తామనే హామీని నెరవేర్చడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. తొమ్మిదేళ్లలో మోడీ ఒక్క విలేకరుల సమావేశంలో కూడా పాల్గొనలేదని మాకెన్ విమర్శించారు.